# ఫిజియోథెరపీ ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలి

**డీఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణ**

**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 08 (వుదయం ప్రతినిధి):**

ఫిజియోథెరపీ ప్రాధాన్యతపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ సూచించారు.ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాత కలెక్టరేట్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ఈ ర్యాలీ కొనసాగింది. డీఎంహెచ్ఓ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.ర్యాలీలో పారామెడికల్ కళాశాల విద్యార్థులు ఫిజియోథెరపీ ప్రాధాన్యతపై నినాదాలు చేస్తూ పాల్గొన్నారు.అనంతరం కేక్ కట్ చేసి పలువురిని సన్మానించారు.
ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవికుమార్, తెలంగాణ ఫిజియోథెరపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ డి.ఎస్. సుమంత్, కార్యదర్శి డాక్టర్ ఎన్. స్వజన, కోశాధికారి డాక్టర్ అంజలి, డాక్టర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామంలో ముమ్మర దోమల నివారణ



**వుదయం**

**మనూరు సెప్టెంబర్:9**

సంగారెడ్డి,జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం, మనూరు మండలం,అతిమ్యాల్ గ్రామ, సర్పంచ్, కొంగలి విద్యాసాగర్, రెడ్డి తన సొంత,గ్రామంలో,ప్రజల ఆరోగ్యం కోసం, తను చేసే సేవలు,ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో, ఉంచుకుని పరిసరాల, పరిశుభ్రతపై ప్రత్యేక,శ్రద్ధ తీసుకుంటూ, దోమల,నివారణకు నిరంతరం,చర్యలు కొనసాగిస్తున్నాం. ప్రజారోగ్యమే లక్ష్యం పరిశుభ్రమైన,అతిమ్యాల్ మనందరి బాధ్యత.
కొంగరి,విద్యా సాగర్,రెడ్డిఅతిమ్యాల్, గ్రామ,సర్పంచ్,

# పంటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి



**గద్వాల, సెప్టెంబర్ 09 (వుదయం కరస్పాండెంట్)**

పత్తి, వరి, మొక్కజొన్న, వేరుశనగ, కంది పంటలను రైతులు క్రమం తప్పకుండా పరిశీలిస్తూ సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని దక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ సహ పరిశోధన సంచాలకులు డా. ఎల్. కృష్ణ సూచించారు.వర్షాధార ప్రాంతాల్లో నేల తేమను సంరక్షిస్తూ, మట్టి పరీక్ష ఆధారంగా సమతుల్య ఎరువులు వినియోగించాలని తెలిపారు. పంటల్లో పురుగులు కనిపించిన వెంటనే మందులు పిచికారీ చేయకుండా, ఆర్థిక నష్టపరిమితి దాటినప్పుడు మాత్రమే నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. పత్తిలో రసం పీల్చే పురుగులు, వరిలో ఆకు ముడత, కాండం తొలుచు పురుగు, ప్లాంట్ హాపర్లను పర్యవేక్షించాలని, మొక్కజొన్నలో కత్తెర పురుగును ప్రతి 3-5 రోజులకు గమనించాలని తెలిపారు. వేరుశనగ, కందిలో కలుపు, పురుగు-తెగుళ్లను గుర్తించి సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. రైతులు అవసరమైన సాంకేతిక సూచనల కోసం సమీప వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ పరిశోధనా కేంద్రాలను సంప్రదించాలని డా. కృష్ణ సూచించారు.

# క్షయ నివారణలో విద్యార్థులు భాగస్వాములు కావాలి



**సంగారెడ్డివుదయం.**

క్షయ వ్యాధి నివారణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని జిల్లా క్షయ కార్యక్రమ అధికారి డాక్టర్ అరుణ కుమారి సూచించారు. మంగళవారం సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో 'క్షయ వ్యాధి గురించి తెలుసుకోండి' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా సమన్వయకర్త అరుణ మాట్లాడుతూ.. ఎన్‌సీసీ విద్యార్థులు సమాజ సేవా కార్యక్రమాల్లో ముందుంటారని, క్షయ వ్యాధి నిర్మూలనలో కూడా వారిని భాగస్వాములను చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం విద్యార్థులను వాలంటీర్లుగా నమోదు చేసి, క్షయ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, చికిత్స తదితర అంశాలపై అవగాహన కల్పించేలా శిక్షణ అందిస్తున్నామని పేర్కొన్నారు.శిక్షణ పొందిన విద్యార్థులు తమ గ్రామాలు, పరిసర ప్రాంతాల్లో ప్రజలకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించేలా ప్రజలకు సూచించాలని తెలిపారుకార్యక్రమంలో ఎన్‌సీసీ ఏఎన్ఓ విజయ మేడమ్, ఎన్‌సీసీ అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అంత్యక్రియలకు ఆర్థిక సహాయం



**(సెప్టెంబర్ 9, బషీరాబాద్, వుదయం)**

బషీరాబాద్ మండలం కోర్విచేడ్ గని గ్రామానికి చెందిన అంబన్న అనారోగ్యంతో బుధవారం మరణించాడు. ఈ విషయాన్ని సర్పంచి వడ్డే శరణమ్మ శ్రీనివాస్, బీవీజీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, శ్రీ బాలాజీ ఆసుపత్రి అధినేత డాక్టర్ సంపత్ కుమార్ కు తెలుపగా ..మానవత్వంతో అంత్యక్రియల కోసం రూ.3వేల ఆర్థిక సాయం గ్రామస్తుల వడ్డే కోటప్ప. వడ్డే శివకుమార్. విజయ్. మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు వడ్డే శ్రీనివాస్ చేతుల మీదుగా అందించారు.

# రైతుల పాలిట ఆపద్బాంధవంగా 'శాలిహోత్ర ఎక్స్‌ప్రెస్'




*** ఉచిత పశువైద్య సేవలతో మన్ననలు పొందుతున్న డాక్టర్ విహాల్, శివ**

**అచ్చంపేట, సెప్టెంబర్ 09 (వుదయం ప్రతినిధి):**

గ్రామీణ రైతుల జీవనాధారమైన పాడి పశువులకు సకాలంలో వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఎస్‌బీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న 'శాలిహోత్ర ఎక్స్‌ప్రెస్' కార్యక్రమం రైతుల పాలిట ఆపద్బాంధవంగా నిలుస్తోంది. సంస్థ ద్వారా ఈ కార్యక్రమం అమలవుతోంది.రైతుల వద్దకే వెళ్లి ఉచితంగా పశువైద్య సేవలు అందించడం ఈ కార్యక్రమం ప్రత్యేకత. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని అంకిరోనిపల్లి, సింగారం, చందాపూర్ గ్రామాల్లో డాక్టర్ విహాల్, శివ అందిస్తున్న సేవలు రైతుల ప్రశంసలు అందుకుంటున్నాయి.ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు తదితర మూగజీవాలకు అవసరమైన వైద్య సేవలను అందిస్తూ, ఫోన్ కాల్ రాగానే స్పందించి గ్రామానికి చేరుకొని సకాలంలో చికిత్స అందిస్తున్నారు. వైద్య వృత్తిని సేవగా భావిస్తూ నిజాయితీగా పనిచేస్తున్న వారి సేవాభావం ఆదర్శనీయమని రైతులు కొనియాడుతున్నారు.ఈ సేవలు అందిస్తున్న ఎస్‌బీఐ ఫౌండేషన్, BAIF సంస్థలకు, డాక్టర్ విహాల్, శివలకు అంకిరోనిపల్లి గ్రామ రైతులు నేనావత్ లక్పతి, నేనావత్ శివరాం తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సేవలు మరిన్ని గ్రామాలకు విస్తరించాలని కోరారు.

# ప్రతి చిన్నారికి వ్యాధి నిరోధక టీకాలు అందించాలి

*** వందశాతం టీకాల లక్ష్యాన్ని సాధించాలి:**

*** వైద్యాధికారి డాక్టర్ భరత్**

**గద్వాల సెప్టెంబర్ 09 (వుదయం కరస్పాండెంట్)**



ప్రతి చిన్నారికి వ్యాధి నిరోధక టీకాలు అందేలా చర్యలు తీసుకుని, వందశాతం టీకాల లక్ష్యాన్ని సాధించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ భరత్ సూచించారు.బుధవారం ఉప్పేర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ముల్కలపల్లి ఉప ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన సాధారణ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా టీకాల నమోదు పుస్తకం, తల్లిశిశు సంరక్షణ కార్డులు, టీకాలు వేయాల్సిన పిల్లలు, గర్భిణుల జాబితాను పరిశీలించారు. జాబితా ప్రకారం పిల్లలు, గర్భిణులు అందరూ టీకాలు వేయించుకున్నారా లేదా అనే వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. టీకాలు ప్రారంభించని లేదా మధ్యలోనిలిపివేసిన పిల్లలు ఎవరైనా ఉన్నారా అని ఆరా తీశారు.అనంతరం టీకాల నిల్వ, భద్రత, శీతలీకరణ విధానాన్ని పరిశీలించారు. టీకాల తరలింపు పెట్టె, మంచు ముక్కలు, బీసీజీ, నోటి ద్వారా ఇచ్చే పోలియో టీకా, ఐదు వ్యాధుల సమ్మిళిత టీకా, మీజిల్స్‌రుబెల్లా టీకా, ఎ విటమిన్ వంటి మందుల వివరాలను పరిశీలించారు. తెరిచిన టీకా సీసాలను వినియోగించే విధానం, టీకా నాణ్యత సూచిక, శీతలీకరణ పద్ధతుల గురించి ఆరోగ్య కార్యకర్తను అడిగి తెలుసుకున్నారు. టీకాల భద్రపరిచే విధానం సక్రమంగా ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి చిన్నారికి టీకాలు అందేలా వందశాతం లక్ష్యాన్ని సాధించాలని, ఒక్క చిన్నారి కూడా టీకాకు దూరం కాకుండా చూడాలని వైద్యాధికారి సూచించారు. ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు టీకాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. టీకాలు వేసిన వివరాలను అదే రోజు టీకాల నమోదు అంతర్జాల వ్యవస్థలో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బహుళ ప్రయోజన ఆరోగ్య విస్తరణ అధికారి రవీందర్, ఆరోగ్య పర్యవేక్షకురాలు లక్ష్మి, సహాయక నర్సు మంత్రసాని విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. టీకాల కార్యక్రమం ప్రశాంతంగా, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా నిర్వహించారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో వేగం పెంచాలి

*** బీఎల్ఓలు ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వహించాలి**

*** కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల, సెప్టెంబర్ 09 (వుదయం కరస్పాండెంట్)**



ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కాని, అనామిలిస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ చేసి, అవసరమైన పత్రాల సేకరణ, ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. బుధవారం గద్వాల పట్టణంలోని 28, 37వ వార్డులకు సంబంధించిన 266, 267, 268, 269 పోలింగ్ కేంద్రాల పరిధిలో బూత్ స్థాయి అధికారులు నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత తేదీల్లో విచారణకు హాజరు కాకపోయినా, బీఎల్ఓలు వారి ఇళ్లకు వెళ్లి అవసరమైన పత్రాలను సేకరించాలన్నారు.
ఎస్ఐఆర్ ప్రక్రియపై ఇప్పటికే సిబ్బందికి శిక్షణ ఇచ్చినందున, విధుల్లో నిర్లక్ష్యం లేదా అవగాహన లోపం ఉండకూడదని స్పష్టం చేశారు. బీఎల్ఓలు ముందస్తు ప్రణాళికతో పనిచేస్తూ, ఏ, బీ, సీ కేటగిరీల వారీగా ఓటర్లను గుర్తించి, అవసరమైన పత్రాలను మాత్రమే సేకరించాలని సూచించారు.కుల ధ్రువీకరణ పత్రాలు అవసరమైన అర్హులకు త్వరితగతిన ధ్రువీకరణ పత్రాలు అందేలా రెవెన్యూ అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని, రెండు రోజుల్లోనే వాటిని మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి గల్లంతు కాకుండా, ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకమైన సమగ్ర ఓటరు జాబితా రూపొందించడమే ఎస్ఐఆర్ ప్రక్రియ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రక్రియను జిల్లాలో విజయవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ మధుమోహన్, కౌన్సిలర్లు చంద్రశేఖర్, మంజులరాణి, అదనపు సహాయ ఎన్నికల నమోదు అధికారి సతీష్, పర్యవేక్షకురాలు నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్

*** సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట సిపి ఎస్. రష్మీ పెరుమాళ్ పిలుపు**

**సిద్దిపేట, సెప్టెంబర్ 9 (వుదయం బ్యూరో)**



సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్, ఐపిఎస్ ఒక ప్రకటనలో కోరారు. రాజీ పడదగిన సివిల్, క్రిమినల్, ఆస్తి వివాదాలు, కుటుంబ తగాదాలు, రోడ్డు ప్రమాదాలు, డ్రంక్ అండ్ డ్రైవ్, టౌన్ న్యూసెన్స్, చెక్ బౌన్స్ తదితర కేసులలో బాధితులు, నిందితులు సంబంధిత పోలీస్ స్టేషన్‌ను గానీ, న్యాయస్థానాన్ని గానీ నేరుగా సంప్రదించి కేసులు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. చిన్న చిన్న కేసులతో కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృధా చేసుకోవద్దని సూచించారు. పోలీస్ స్టేషన్లలో ఇప్పటికే రాజీ పడదగిన కేసులను గుర్తించి ఇరువర్గాలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని, లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం లభిస్తుందని పేర్కొన్నారు.

# గజ్వేల్ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం




*** కాళోజీ జీవితం నేటి యువతరానికి ఆదర్శం: ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం**

*** ఉత్సాహంగా పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థినులు**

**గజ్వేల్, సెప్టెంబర్ 9 (వుదయం ప్రతినిధి)**

స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రజాకవి కాళోజీ నారాయణ రావు జయంతిని పురస్కరించుకుని తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కాళోజీ జీవితం, ఆయన రచనలు నేటి తెలంగాణ యువతరానికి మార్గదర్శకమని, విద్యార్థులు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. తెలుగు శాఖాధిపతి డాక్టర్ ఎం. చంద్రశేఖర్ కార్యక్రమ పరిచయం చేస్తూ... నాడు నిజాం దౌర్జన్యాలు, అన్యాయాలపై కాళోజీ తన కలంతో సాగించిన పోరాటాన్ని, ఆయన జీవిత విశేషాలను వివరించారు. అధ్యాపకులు డాక్టర్ జయరాజు, డాక్టర్ సుజాత తెలంగాణ యాస సౌందర్యం, భాషా గొప్పతనాన్ని తెలపగా, సీహెచ్. ఉమారాణి కాళోజీ కవితలలోని సూటిదనాన్ని కవితల రూపంలో వినిపించారు. విద్యార్థినులు ఉపన్యాసాలు, పాటలతో పాటు కాళోజీ సూక్తులను చిత్రాల రూపంలో ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్ కమలా క్రిస్టియాన, డాక్టర్ జె. ఉమారాణి, అధ్యాపకులు సరోజన, డాక్టర్ శ్రీలత, కస్తూరి, డాక్టర్ బాలచంద్రం, డాక్టర్ సౌజన్య, శ్రీధర్, శ్యామ్, భాస్కర్, విజయ్, రమాదేవి, సిరాజ్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేటి సమాజానికి కాళోజీ ఆలోచనలు దిక్సూచి



*** అన్యాయాన్ని ప్రశ్నించే చైతన్యం ప్రతి ఒక్కరిలో రావాలి**

**గద్వాల, సెప్టెంబర్ 09 (వుదయం బ్యూరో)**

అన్యాయాన్ని ఎదిరించడం, ప్రజల హక్కుల కోసం ప్రశ్నించడం, సామాజిక అసమానతలను రూపుమాపేందుకు కృషి చేయడం వంటి కాళోజీ నారాయణరావు ఆలోచనలు ప్రస్తుత సమాజానికి మరింత అవసరమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో సాంకేతికత, ఆర్థిక అభివృద్ధి పెరుగుతున్నప్పటికీ పేదరికం, అసమానతలు, వివక్ష, అవినీతి, సామాజిక అన్యాయాలు ఇంకా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి సమస్యలపై ప్రజలు మౌనంగా ఉండకుండా కాళోజీ స్ఫూర్తితో ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కాళోజీ రచించిన 'నా గొడవ' కేవలం ఒక పుస్తకం మాత్రమే కాదని, అన్యాయంపై ప్రజల్లో చైతన్యం రగిలించే ప్రశ్నాస్త్రమని అన్నారు. సమాజంలో జరుగుతున్న తప్పులను ప్రశ్నించడం, బలహీన వర్గాలకు అండగా నిలవడం, ప్రజాస్వామ్య విలువలను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యతగా భావించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు కూడా ప్రజలకు సేవ చేసే సమయంలో కాళోజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని పారదర్శకత, బాధ్యత, న్యాయం, మానవతా దృక్పథంతో విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. యువత కాళోజీ సాహిత్యాన్ని చదివి సామాజిక బాధ్యత, ప్రజాస్వామ్య స్పృహ, ప్రశ్నించే ధైర్యాన్ని అలవర్చుకోవాలన్నారు.కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం ఆయన సాహిత్య సేవలకు దక్కిన గౌరవమని, తెలంగాణ భాషా సంస్కృతి పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ పేర్కొన్నారు.

# కాళోజీ జయంతి వేడుకలు ఘనంగా

*** తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులకు సన్మానం**

**అయిజ, సెప్టెంబర్ 09 (వుదయం ప్రతినిధి)**



పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రముఖ కవి, రచయిత శ్రీ కాళోజీ నారాయణరావు జయంతిని, తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు వెంకటస్వామి, ప్రభ, సుధారాణిలను ఘనంగా సన్మానించారు. అలాగే సెప్టెంబర్ 5న నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తింపు పొందిన తిమ్మప్ప, వెంకటస్వామిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్‌రెడ్డి, భాస్కర్, రాజేంద్రకుమార్, జి. నర్సింహులు, లక్ష్మణ్, లక్ష్మీనారాయణ, అనితారాణి, శ్వేత, తిమ్మప్ప, రఘు, అరుణ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రాజీ మార్గమే రాజమార్గం




**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 09 (వుదయం బ్యూరో):**

ప్రజల న్యాయ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు కోర్టు పరిధిలోని వివిధ కేసులను పరిష్కరించుకునే అవకాశం ఉందని జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 12న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఎస్పీ న డిటెక్టివ్ డిపార్ట్ మెంట్ (DD) కేసులు, పెట్టీ కేసులు, చిన్న కేసులు, ట్రాఫిక్ చలానాలు, మైనర్ క్రిమినల్ కేసులు, సివిల్ వివాదాలు వంటివి లోక్ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కారం పొందవచ్చన్నారు. న్యాయస్థానాల్లో పెండింగ్ లో ఉన్న కేసులను తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో ముగించుకోవచ్చని, ఇది శాంతియుత పరిష్కార విధానం కావున ఇరుపక్షాలు పరస్పర అంగీకారంతో సమస్యలు పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలకు తక్షణ న్యాయం అందే ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని సూచించారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్ అన్యాయం

*** ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తే గొంతు నొక్కుతారా?**

*** బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు రాజిరెడ్డి**

**దౌల్తాబాద్ సెప్టెంబర్ 09(వుదయం):**



ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడం దారుణమని బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు రాజిరెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. రైతులు, నిరుద్యోగులు, మహిళలు, విద్యార్థులు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారని తెలిపారు.
ప్రజల తరపున ప్రశ్నించే ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం వారిని సభ నుంచి సస్పెండ్ చేయడం ద్వారా ప్రజల గొంతును అణచివేయాలని చూస్తోందని రాజిరెడ్డి ఆరోపించారు. అసెంబ్లీ ప్రజా సమస్యలపై చర్చించే ప్రజాస్వామ్య వేదిక అని, ప్రతిపక్ష సభ్యులకు తమ వాణిని వినిపించే అవకాశం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.ప్రశ్నించే గొంతులను సస్పెండ్ చేసినంత మాత్రాన ప్రజా సమస్యలు పరిష్కారం కాకుండా పోవని, ప్రజల సమస్యలపై బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై విధించిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేసి, అసెంబ్లీలో ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక చర్చకు ప్రభుత్వం అవకాశం కల్పించాలని రాజిరెడ్డి కోరారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం ప్రశ్నించడం సహజమని, ప్రశ్నించే గొంతును అణచివేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైతే రాబోయే రోజుల్లో ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారని రాజిరెడ్డి హెచ్చరించారు.

# టీఎంజేఎఫ్ రాష్ట్ర మహాసభల కరపత్రాల ఆవిష్కరణ

*** మహాసభను విజయవంతం చేయాలి : మున్సిపల్ చైర్మన్ మం. అశోక్**

**కోహిర్ సెప్టెంబర్ 9( వుదయం ప్రతినిధి )**



తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం (టీఎంజేఎఫ్) 3వ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన కరపత్రాలను బుధవారం కోహిర్ మున్సిపల్ కార్యాలయంలో ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్మన్ మం. అశోక్ చేతుల మీదుగా కరపత్రాలను ఆవిష్కరించారు.టీఎంజేఎఫ్ రాష్ట్ర నాయకులు చెల్మెడ అనిల్‌కుమార్, మం. సుధాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మం. అశోక్ మాట్లాడుతూ సభలు విజయవంతంగా జరగాలని ఆకాంక్షించారు. జర్నలిస్టుల సమస్యలు, హక్కుల పరిరక్షణ కోసం టీఎంజేఎఫ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రాష్ట్ర మహాసభలను విజయవంతం చేసేందుకు జర్నలిస్టులు, టీఎంజేఎఫ్ నాయకులు, సభ్యులు సమన్వయంతో పనిచేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# సర్పంచ్ లకే చెక్ పవర్ ఇవ్వాలని కలెక్టర్ కు వినతి

**నారాయణపేట సెప్టెంబర్ 9(వుదయం ప్రతినిధి)**



గ్రామాల అభివృద్ధి కోసం ఉప సర్పంచ్‌లకు కల్పించిన జాయింట్ చెక్ పవర్‌ను రద్దు చేసి ప్రజలచే ఎన్నుకోబడిన సర్పంచ్‌కు చెక్ పవర్ కల్పించాలని సర్పంచులు బుధవారం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు.తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల పరిపాలనలో సర్పంచ్‌లు అత్యంత కీలకమైన ప్రజాప్రతినిధులు గ్రామ ప్రజలచే ప్రత్యక్షంగా ఎన్నికైన సర్పంచ్‌లు గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం గ్రామ పంచాయతీ పరిపాలనలో ప్రధాన బాధ్యతను నిర్వహిస్తున్నారని వారికి చెక్ పవర్ ఇవ్వాలని వారు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో అప్పిరెడ్డిపల్లి సర్పంచ్ వెంకట్ రెడ్డి,బోయిన్ పల్లి తండా సర్పంచ్ లక్ష్మణ్ నాయక్,సింగారం సర్పంచ్ నాగిరెడ్డి, బోయిన్ పల్లి సర్పంచ్ వెంకటేష్,ఊటకుంట తండా సర్పంచ్ వెంకట్ నాయక్, ఎక్లాస్పూర్ సర్పంచ్ శేఖర్ గౌడ్ ,జిలాల్పూర్ సర్పంచ్ శివలింగప్ప, లింగంపల్లి తండా సర్పంచ్ సీతాబాయి రాందాస్,ధన్వాడ మండల సర్పంచ్ జ్యోతి,కొండాపూర్ సర్పంచ్ విజయ,బుడమర్రి తండా సర్పంచ్ అనిత,మణిపూర్ తాండా సర్పంచ్ కవిత,గున్ముఖల సర్పంచ్ అనంతమ్మ, దామరగిద్ద మండల్ అధ్యక్షులు శరన్ నాయక్,ఉట్కూరు మండల అధ్యక్షుడు కథలప్ప,ఓబులాపూర్ సర్పంచ్ సత్యనారాయణ రెడ్డి, వత్తు గుండ్ల తండా సర్పంచ్ క్రాంతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హుడి ఓటు పోకూడదు.. అనర్హుడి పేరు ఉండకూడదు

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి**

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 9 (వుదయం ప్రతినిధి):**

ఓటర్ల జాబితా సవరణలో చిన్నపాటి పొరపాటుకు కూడా తావివ్వొద్దని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అర్హుడైన ఒక్క ఓటరు పేరు జాబితాలో గల్లంతు కాకూడదని.. మృతులు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లు కొనసాగకుండా నిబంధనల ప్రకారం తొలగించాలని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితానే ఎన్నికల ప్రక్రియకు పునాది కావడంతో SIRలో ప్రతి అంశాన్ని క్షేత్రస్థాయిలో నిర్ధారించిన తర్వాతే మార్పులు, చేర్పులు, తొలగింపులు చేపట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షాతో కలిసి బుధవారం తాంసీ, భీంపూర్ మండలాల్లో సుదర్శన్‌రెడ్డి క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. తాంసీ మండలం ఘోట్కూరి, భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి నిర్వహిస్తున్న సర్వే, ఓటర్ల వివరాల పరిశీలన, కొత్తగా నమోదుకు వచ్చిన దరఖాస్తుల ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. బీఎల్‌ఓల వద్ద ఉన్న ఓటర్ల జాబితాలు, దరఖాస్తులను పరిశీలించిన సీఈఓ.. వివరాల నమోదులో తీసుకుంటున్న జాగ్రత్తలపై ఆరా తీశారు. పేరు, వయస్సు, చిరునామా వంటి వివరాల్లో తప్పులు గుర్తిస్తే నిబంధనల ప్రకారం సరిచేయాలని సూచించారు. ఇంటింటి సర్వేలో ఒక కుటుంబానికి సంబంధించిన వివరాలను మాత్రమే కాకుండా, ఆ కుటుంబంలోని ప్రతి ఓటరు వాస్తవంగా అక్కడే నివసిస్తున్నారా? అనే అంశాన్ని కూడా నిర్ధారించాలని స్పష్టం చేశారు. డాక్యుమెంట్లు అందుబాటులో ఉన్న చోట వాటిని పరిశీలించి వివరాలను ధ్రువీకరించాలని, పత్రాలు లేని సందర్భాల్లో సంబంధిత వ్యక్తులకు అవసరమైన మార్గదర్శకాలు అందించి నిబంధనల ప్రకారం ధ్రువీకరణ చేపట్టాలని తహశీల్దార్లకు సూచించారు. క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారం ఆధారంగా తదుపరి చర్యలను నిబంధనల మేరకు చేపడతామని తెలిపారు.



జిల్లాలో SIR ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని, గత మూడు రోజులుగా క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహిస్తున్నామని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. 18 ఏళ్లు నిండిన అర్హులైన యువత ఓటరుగా నమోదు అయ్యేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి పౌరుడు తన పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకునేలా ప్రజలకు సమాచారం అందించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా SIR ప్రక్రియను పూర్తి చేస్తున్నామని తెలిపారు. బీఎల్‌ఓలు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సందేహాలను నివృత్తి చేయాలని, అర్హులైన వారు జాబితాలో నమోదు కాకుండా మిగిలిపోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అదే సమయంలో అనర్హుల పేర్లు కొనసాగకుండా నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని డైట్ కళాశాల, సంజయ్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సీఈఓ, కలెక్టర్ సందర్శించి సవరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రూ, ఎస్. రాజేశ్వర్, తహశీల్దార్లు శ్రీనివాస్, గణేష్, రమేష్, ఎన్నికల నాయబ్ తహశీల్దార్లు సూరజ్, ఇస్తారీ, ఎన్నికల సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు, స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్పీకర్ పట్ల అనుచిత వాక్యాలను తీవ్రంగా ఖండిస్తున్నాం



- **నిరసనగా కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం**
- **పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్**

**కోరుట్ల సెప్టెంబర్ 09 (వుదయం ప్రతినిధి)**

స్పీకర్ పట్ల అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మెల్సీ తాత మధు ను వెంటనే సస్పెండ్ చేయాలని కోరుతూ తాత మధు చేసిన అనుచిత వాక్యాలకు నిరసనగా పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కెసిఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ మాట్లాడుతూ తెలంగాణ శాసనసభ గౌరవాన్ని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ పదవి ప్రతిష్టతను కించపరిచే విధంగా బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వాక్యాలు అవమానకరమైన వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం కోరుట్ల పట్టణ కొత్త బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం ముందు పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన చేపట్టడం జరిగిందన్నారు అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు వ్యవహార శైలిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమాలను చూసి తట్టుకోలేక బిఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను పక్కదో పటిస్తున్నారన్నారు ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అటవీ , వన్యప్రాణుల రక్షణ చర్యలను మరింత బలోపేతం

**డివిజనల్ ఫారెస్ట్ అధికారి భార్గవ్ కుమార్**

**కాగజ్ నగర్ ( వుదయం ప్రతినిధి )**



అటవీ సంపద వన్యప్రాణుల సంరక్షణ మరింత బలోపథం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కాగజ్నగర్ అటవీ డివిజనల్ అధికారి భార్గవ్ కుమార్ తెలిపారు. బుధవారం కాగజ్ నగర్ అటవీ డివిజన్ అధికారులు ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతాల్లో అక్రమంగా చెట్ల నరికివేత, అటవీ భూముల ఆక్రమణ, వన్యప్రాణుల వేట మరియు ఇతర అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు నిరంతర పెట్రోలింగ్, రక్షణ గస్తీ, వాహన తనిఖీలు మరియు సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు. అటవీ సిబ్బంది ప్రతిరోజూ తమ పరిధిలోని అటవీ ప్రాంతాలను పర్యవేక్షిస్తూ, అనుమానాస్పద కార్యకలాపాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని. అవసరమైన ప్రాంతాల్లో కెమెరా ట్రాప్స్, మొబైల్ ప్యాట్రోలింగ్ మరియు సాంకేతిక పర్యవేక్షణ వంటి ఆధునిక పద్ధతులను కూడా వినియోగించాలని తెలిపారు. అటవీ సంపదకు నష్టం కలిగించే అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేశారు. వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా వేట నిరోధక చర్యలు, నీటి వనరుల పర్యవేక్షణ, వన్యప్రాణుల కదలికల పరిశీలన కు డ్రోన్స్ వినియోగించాలని సిబ్బందికి సూచించారు. కాగజ్నగర్ ,సిర్పూర్ ,కర్జల్లి, బెజ్జూర్ ,పెంచికలపేట ఫారెస్ట్ రేంజ్ అధికారులు, డిప్యూటీ రేంజ్ అధికారులు, సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టివేత

**బెజ్జూర్ ( వుదయం ప్రతినిధి )**

బెజ్జూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుష్నపల్లి బ్రిడ్జి వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, అక్రమంగా తరలిస్తున్న సుమారు 5 క్వింటాళ్ల పీడీఎస్ పట్టుకు పట్టుకున్నట్లు ఎస్ఐ ఎం.డి. సర్తాజ్ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సై సిబ్బంది తో కలిసి తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వస్తున్న ఆటోను ఆపి తనిఖీ చేయగా ఆటోలో 11 ప్లాస్టిక్ సంచుల్లో పీడీఎస్ బియ్యం ఉండగా డ్రైవర్ బోగ మహేష్‌గా గుర్తించామని బియ్యంతో పాటు ఆటో ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టమన్నారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం, రవాణా చేయడం లేదా విక్రయించడం చట్టవిరుద్ధమని, ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.



# పెరిక సంఘ భవన స్థలంపై సమావేశం

**జన్నారం,సెప్టెంబర్ 9 (వుదయం విలేఖరి)**

జన్నారం మండల పురగిరి క్షత్రియ పెరిక సంఘం కార్యవర్గ సమావేశం మండల కేంద్రంలో నిర్వహించారు.ఈ సమావేశంలో ప్రధానంగా జన్నారం మండల పెరిక సంఘం భవన నిర్మాణానికి స్థలం ఏర్పాటు, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై నాయకులు సుదీర్ఘంగా చర్చించారు.నాయకులు మాట్లాడుతూ జన్నారం మండల పెరిక సంఘానికి సొంత భవనం ఏర్పాటు ఎంతో అవసరమని, సంఘ సభ్యులందరూ ఐకమత్యంతో ముందుకు వచ్చి భవన నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా సంఘ భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని నిర్ణయించి, స్థలం కోసం బయానాగా పదివేల రూపాయలను అల్లం రవికి అందజేసారు.భవిష్యత్‌లో అదే స్థలంలో సంఘ భవన నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కార్యవర్గం నిర్ణయించింది.కార్యక్రమానికి జిల్లా నాయకులు అక్కల రమేష్, బొడ్డు తిరుపతి, సంగ మానయ్య, ఎన్. మల్లేష్, ముత్తె నారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.మండల పెరిక సంఘం అధ్యక్షులు కానిగంటి శివలింగు, గౌరవ అధ్యక్షులు ఎంబడి సత్యం, ప్రధాన కార్యదర్శి గూడా అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి తిరుపతి, ముత్యం సతీష్, మండల నాయకులు అల్లం రవి, పేరం శ్రీనివాస్, కుదర వెంకన్న, యువజన నాయకులు పేరం మహేందర్, కానిగంటి లక్ష్మణ్, కొట్టే హరికృష్ణ, అల్లం సురేష్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# దళిత వ్యతిరేకి కల్వకుంట్ల కుటుంబం



**విలేకరుల సమావేశంలో జువ్వాడి కృష్ణారావు**

**కోరుట్ల సెప్టెంబర్ 09(వుదయం ప్రతినిధి)**

ఎమ్మెల్సీ తాత మధు స్పీకర్ పై చేసిన అనుచిత వాక్యాలను తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కల్వకుంట్ల కుటుంబం దళితుల వ్యతిరేకులని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు సోమవారం హైదరాబాదు లో ఎమ్మెల్సీ తాతా మధు రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై చేసిన వ్యాఖ్యలకు స్పందిస్తూ మంగళవారం నియోజకవర్గ కేంద్రమైన కోరుట్ల పట్టణ జువ్వాడి కృష్ణారావు స్వగృహం జువ్వాడి భవన్లో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ 10 సంవత్సరాలు అధికారంలో ఉండి చేయలేని పనులను కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో చేపడుతుందని ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి నాడు ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత కల్వకుంట్ల కుటుంబానిదేనని బిఆర్ఎస్ పార్టీ చేసిన అప్పులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెల్లిస్తున్నారని విదేశీ పెట్టుబడులను తీసుకురావడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక కృషి చేస్తున్నారన్నారు రైతు నియోజకవర్గంలో రైతు ఆధారిత పరిశ్రమ అయినటువంటి ముత్యంపేట చక్కర కర్మాగారాన్ని 170 కోట్ల బ్యాంకు రుణాలు చెల్లించి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు 10 సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో ఒక్క నూతన రేషన్ కార్డును కూడా మంజూరు చేయలేదని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నూతన రేషన్ కార్డులను మంజూరు చేయడమే కాకుండా దేశంలో ఎక్కడా లేనివిధంగా రేషన్ దుకాణాల ద్వారా నిరుపేదలు కూడా కడుపునిండా తినాలని సంకల్పంతో సన్న బియ్యాన్ని పంపిణీ చేయడం జరుగుతుందన్నారు పేద మధ్య తరగతి ప్రజలకు విద్యుత్ భారాన్ని తగ్గించేందుకు 200 యూనిట్ల వరకు ఉచిత సరఫరా చేయడం జరుగుతుందన్నారు స్వర్గీయ మాజీమంత్రి రత్నాకర్ రావు కోరుట్ల పట్టణంలో సుమారు 5000 ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇస్తే గడచిన పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో కేవలం 80 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మాత్రమే నిర్మించారని అది కూడా వారికి అనుకూలంగా ఉన్నవారికి ఇచ్చారన్నారు టీటీడీ బోర్డు మెంబర్ గా ఉండి కూడా మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు టీటీడీ కళ్యాణ మండపానికి ఒక్క రూపాయి నిధులు కూడా మంజూరు చేయించలేదని అలాగే వెంకటేశ్వర దేవాలయంలో ఉన్న ఉప ఆలయాల్లో విగ్రహాలను ఏర్పాటు చేయలేదని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆలయాల్లో విగ్రహాలు ఏర్పాటు చేయడమే కాకుండా కళ్యాణ మండపానికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోలేదని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ పాఠశాలలకు అధిక నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు శాసనసభ స్పీకర్ గా దళితుడు ఉన్నత స్థానంలో ఉండగా ఆయనను అధ్యక్ష అని పిలవాల్సిన పరిస్థితి ఉంటుందని కెసిఆర్ శాసనసభ కు అసలు రావడంలేదని గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అప్పటి సీఎల్పీ నాయకుడు ప్రతిపక్ష నేత మల్లు భట్టి విక్రమార్క ప్రతిపక్ష నాయకుడిగా కాంగ్రెస్ పార్టీ నియమించిందని దీంతో కేసీఆర్ తన అహంకారంతో దళిత వ్యతిరేకతతో మల్లు భట్టి విక్రమార్క ప్రతిపక్ష హోదాను తొలగించిన దుర్మార్గుడు కేసీఆర్ అన్నారు తెలంగాణ లో కెసిఆర్ అధికారంలోకి రాకముందు తెలంగాణ రాష్ట్రా ఏర్పాటు జరిగితే దళితున్నే ముఖ్యమంత్రి చేస్తానని మాటిచ్చి మోసం చేశాడని అలాగే దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని చెప్పి మోసం చేశాడని దళితులను మోసం చేసిన వ్యక్తి కె చంద్రశేఖర్ రావు అని అన్నారు ఉన్నత పదవిలో ఉన్నటువంటి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై అనుచిత వ్యాఖ్యలు చేసి ఆయనను అవమానించినటువంటి విషయం సామాన్యమైనది కాదని భారత రాజ్యాంగాన్ని వ్యతిరేకించినట్లేనని అన్నారు భారత రాజ్యాంగం ను వ్యతిరేకిస్తే భారతీయ న్యాయ సంహిత బిఎన్ఎస్) లో ఏ శిక్ష విధించాలని ఉందొ అదేవిధంగా స్పీకర్ ను అవమానించిన వారిని శిక్షించాలని తాతా మధును శాసనమండలి సభ్యత్వం నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు కోరుట్ల నియోజకవర్గం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు కల్వకుంట్ల కుటుంబం తండ్రి కొడుకులు రాజ్యమేలుతున్నారని అవినీతి కమిషన్లతో సంపాదించిన డబ్బులు ఖర్చుపెట్టి ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలు చేయిస్తున్నారన్నారు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు మెట్పల్లి మండలం కొండ్రికర్ల వాగుపై వంతెన నిర్మిస్తామని బాండ్ పేపర్ పై రాసి ఇచ్చి మాట తప్పడని కానీ నేడు తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు నాయకత్వంలో వంతెన మంజూరు చేయించడం తోపాటు నేడు సగానికి పైగా నిర్మాణం పూర్తయిందని త్వరలోనే మిగతా పని కూడా పూర్తి చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ జిల్లా కాంగ్రెస్ మైనారిటీ విభాగం అధ్యక్షులు నయీమ్ మున్సిపల్ వైస్ చైర్మన్ షాహిద్ కౌన్సిలర్ లు మోర్తాడ్ లక్ష్మి నారాయణ వాసీద్ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు జిల్లా మైనార్టీ అధ్యక్షులు ఎంఏ నయీమ్ నాయకులు రిజ్వాన్ పాషా శ్రీ వెంకటేశ్వర దేవస్థానం ధర్మకర్తల మండల అధ్యక్షులు ఎతిరాజం నర్సయ్య కో ఆప్షన్ సభ్యులు బొద్దురి సతీష్ కుమార్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి రాజోజి సదానందచారి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఎలేటి మహిపాల్ రెడ్డి నాయకులు భూమయ్య నజ్జు కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాలో ఉన్న నాయకులు యువజన కాంగ్రెస్ ఎన్ ఎస్ యు ఐ విభాగాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మందమర్రి ఏరియాలో ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు

**మంచిర్యాల /మందమర్రి/ రామకృష్ణాపూర్/ సెప్టెంబర్09(వుదయం ప్రతినిధి)**



సింగరేణి మందమర్రి ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో ప్రజాకవి, పద్మవిభూషణ్ కాలోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై కాలోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జీఎం ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ.. కాలోజీ నారాయణరావు తన కలం, గళంతో తెలంగాణ ప్రజా చైతన్యానికి, భాషా వికాసానికి దిశానిర్దేశం చేశారని కొనియాడారు. కాలోజీ జయంతిని తెలంగాణ ప్రభుత్వం 'తెలంగాణ భాషా దినోత్సవం'గా నిర్వహించడం గర్వకారణమన్నారు."పుట్టుక నీది.. చావు నీది.. బతుకంతా దేశానిది" అనే సందేశంతో ప్రజల్లో చైతన్యం నింపిన కాలోజీ సిద్ధాంతాలు, ఆయన పాటించిన విలువలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. కాలోజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఎస్ఓటూజీఎం జి.ఎల్. ప్రసాద్, ఏఐటీయూసీ జి.ఎం. స్ట్రక్చర్ కమిటీ మెంబర్ సి.వి. రమణ, సీఎంఓఏఐ జాయింట్ సెక్రటరీ రవి, ఏరియా ఈఅండ్ఎం ఏజీఎం బాలాజీ భగవతిజ, కేకే ఏజెంట్ ఖదీర్, శాంతిఖని ఏజెంట్ సంతోష్ కుమార్, కేకేఓసీపీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాంబాబు, డీజీఎం (పర్సనల్) సి.హెచ్. అశోక్, సీనియర్ పీవో ఆర్. సత్యనారాయణతో పాటు ఏరియా ఉన్నతాధికారులు, వివిధ విభాగాల అధిపతులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొని కాలోజీ సేవలను స్మరించుకున్నారు.

# తెలంగాణ గర్వించదగ్గ మహనీయుడు కాళోజీ నారాయణరావు



**క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ గొడిసెల సంధ్యారాణి, రాజా రమేష్, కమిషనర్ మురళీకృష్ణ**

**మంచిర్యాల/ రామకృష్ణాపూర్/ సెప్టెంబర్ 09 (వుదయం ప్రతినిధి)**

తెలంగాణ గర్వించదగ్గ మహనీయుడు, తెలంగాణ వైతాళికుడు కాళోజీ నారాయణరావు అని క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ గొడిసెల సంధ్యారాణి, రాజా రమేష్, కమిషనర్ మురళీకృష్ణ అన్నారు.బుధవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలకు మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల ప్రతి ఉద్యమానికి ప్రతిధ్వనిగా నిలిచిన కాళోజీ నారాయణరావు ప్రజలందరికీ సుపరిచితులని అన్నారు. తెలంగాణ వైతాళికుడిగా తన జీవితాన్ని ప్రజల కోసం అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు. తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమమే ఊపిరిగా జీవించారని తెలిపారు.కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రభుత్వం నిర్వహించడం సంతోషకరమని అన్నారు.

విద్యార్థి దశలోనే నిజాం పాలనను ఎదిరించి, తెలంగాణలో విద్యా వ్యాప్తికి కృషి చేశారని గుర్తుచేశారు. తన రచనల ద్వారా ప్రజలను చైతన్యపరిచి సమాజానికి ఆదర్శంగా నిలిచారని తెలిపారు.కాళోజీ నారాయణరావు బహుభాషా కోవిదుడిగా, కవిగా, రచయితగా విశిష్ట సేవలు అందించారని అన్నారు. తెలుగుతో పాటు వివిధ భాషల్లో మానవ హక్కులు, కుల వివక్ష లేని సమాజం కోసం రచనలు చేశారని పేర్కొన్నారు.మహనీయుల ఆశయాలను కొనసాగిస్తూ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




# ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సర్పంచుల ముందస్తు అరెస్ట్

**నాగిరెడ్డిపేట,వుదయం**

విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా మండలానికి చెందిన ముగ్గురు సర్పంచులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. బేజ్జం చెరువు తండా సర్పంచ్ మాలావత్ భాస్కర్ (బీజేపీ), గోపాల్‌పేట్ సర్పంచ్ రాజోపల్లి వంశీకృష్ణగౌడ్ (బీఆర్ఎస్), లను బుధవారం తెల్లవారుజామున 4.30 గంటలకు పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అరెస్టులతో తమ పోరాటాన్ని అడ్డుకోలేరని, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# బీజేపీ నుంచి బీఆర్ఎస్ లోకి చేరికలు



**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 9 (వుదయం న్యూస్) :**

మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ మండల నాయకుడు,గత సర్పంచ్ ఎన్నికల్లో 500 ఓట్లు సాధించిన సంగ లచ్చన్న బుధవారం మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.బీఆర్ఎస్ మండల అధ్యక్షులు చుంచు చిన్నయ్య, ఉపాధ్యక్షులు అంకతి రమేష్, గ్రామ కమిటీ అధ్యక్షులు ఇండ్ల లింగన్న ఆధ్వర్యంలో మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు గారు లచ్చన్నకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా లచ్చన్న మాట్లాడుతూ "మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నాను అని అన్నారు రాబోవు రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ నాయకత్వంలో మంచిర్యాల నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తాను అని తెలిపారు.

# శివాలయంలో అభిషేకం

**బెజ్జూర్, సెప్టెంబర్ 9 (వుదయం ప్రతినిధి )**



బెజ్జూర్ మండల కేంద్రంలోని శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం పురస్కరించుకొని నిత్యభిషేక కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు గురుదత్ ఆధ్వర్యంలో అభిషేకం, అర్చన, శివలింగానికి అన్నాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. శ్రీ రంగనాయక స్వామి, వీర హనుమాన్, శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు తంగడపల్లి మహేష్, భక్తులు వోల్లాల నాగభూషణ్ గౌడ్ శారద దంపతులు,నరేందర్ గౌడ్ విద్య దంపతులు, శ్రీరామ భాస్కర్ స్వప్న, భక్తులు పాల్గొన్నారు.

# వార్డ్ మెంబర్స్ ఫారం నియోజవర్గ ఇన్చార్జిగా మల్లికార్జున్

**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 09 (వుదయం న్యూస్):**



తెలంగాణ వార్డు మెంబర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి ఆదేశాల మేరకు లక్షెట్టిపేట మండలం సూరారం గ్రామానికి చెందిన ఐదవ వార్డ్ మెంబర్ పెట్టం మల్లికార్జున్ ను మంచిర్యాల నియోజకవర్గ వార్డ్ మెంబర్స్ ఫోరం ఇన్చార్జిగా నియమించారు. ఈ మేరకు బుధవారం మల్లికార్జున్ కు జిల్లా వార్డ్ మెంబర్స్ ఫోరం ఇంచార్జ్ ముక్త సంతోష్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పెట్టం మల్లికార్జున్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. తనకు ఈ బాధ్యత అప్పగించినందుకు రాష్ట్ర ఫోరమ్ వ్యవస్థాపక అధ్యక్షురాలు నాగజ్యోతి, మంచిర్యాల జిల్లా వార్డ్ మెంబర్స్ పోరం ఇంచార్జ్ ముక్త సంతోష్ కుమార్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దండేపల్లి మండల ఇంచార్జ్ సుదర్శన్, వార్డు సభ్యులు, పాల్గొన్నారు.

# నీటి కుంటలో మునిగి రైతు మృతి

**పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు మృత్యువాత**

**నిజాంసాగర్ సెప్టెంబర్ 09 (వుదయం ప్రతినిధి):**

మహమ్మద్‌నగర్ మండలం హసన్‌పల్లి గ్రామానికి చెందిన రైతు సుంకే సాయిలు (38) ప్రమాదవశాత్తు నీటి కుంటలో మునిగి మృతి చెందినట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. నిజాంసాగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది.

ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం పొలానికి నీరు అందించేందుకు వెళ్లిన సాయిలు గ్రామ పరిధిలోని బోయినోళ్ల జాలకుంట తూము వద్ద ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. సాయిలు నీటిలో మునిగిపోవడాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి అతడిని బయటకు తీశారు. అయితే అప్పటికే సాయిలు మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి భార్య అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు



పోలీసులు శవపంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

# హాస్టల్ తండా అంగన్‌వాడీలో రాష్ట్రీయ పోషణ మాసం

**జన్నారం,సెప్టెంబర్ 9 (వుదయం విలేఖరి)**



జన్నారం మండలం కవ్వాల్ హాస్టల్ తండా అంగన్‌వాడీ కేంద్రంలో 9వ రాష్ట్రీయ పోషణ మాసం సందర్భంగా పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జన్నారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి హాజరై ప్రతి ఒక్కరు పౌష్టికాహారం తీసుకోవాలని, పిల్లల వయసుకు తగిన అనుబంధ పోషకాహారం ఇవ్వాలని, ప్రోటీన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. అలా తీసుకుంటేనే పిల్లల వయసుకు తగ్గ బరువు, ఎత్తు, ఎత్తుకు తగ్గ బరువు పెరుగుతారని తెలిపారు.ఈ పోషణ మాసం కార్యక్రమం సెప్టెంబర్ 9 నుండి అక్టోబర్ 8 వరకు కొనసాగుతుందని, అందరు అంగన్‌వాడీ టీచర్లు తమ కేంద్రాల్లో షెడ్యూల్ వారీగా కార్యక్రమాలు నిర్వహించాలని సూపర్‌వైజర్ సూచించారు. అనంతరం పోషణ పై ప్రతిజ్ఞ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి, అంగన్‌వాడీ టీచర్లు వజ్ర, నీలా, జిజియా, గర్భిణులు, పిల్లల తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.

# భద్రాచలంలో రెస్టారెంట్లపై ప్రత్యేక తనిఖీలు

- 12 రెస్టారెంట్ల తనిఖీ..
- 7 ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు..

**38 కిలోల నాణ్యత లేని ఆహార పదార్థాలు డిస్కార్డ్**

**భద్రాచలం 9/9/26 వుదయం ప్రతినిధి:**

భద్రాచలం పట్టణంలో ప్రజలకు, భక్తులకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు చేపట్టడంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ శ్రీ ఈ. శరత్ ఆధ్వర్యంలో రెస్టారెంట్లు, హోటళ్లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన ఈ తనిఖీల్లో ఆహార పదార్థాల నాణ్యత, వంటశాలల పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ విధానం, ముడి పదార్థాల నాణ్యత, ఆహార భద్రతా ప్రమాణాల అమలు తదితర అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజల ఆరోగ్యానికి ఎలాంటి ముప్పు కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగానే ఈ ప్రత్యేక తనిఖీలను నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా భద్రాచలం పట్టణంలోని మొత్తం 12 రెస్టారెంట్లను అధికారులు తనిఖీ చేశారు.

ప్రతి రెస్టారెంట్‌లో ఆహార పదార్థాలను ఏ విధంగా నిల్వ చేస్తున్నారు, వంట చేసే ప్రాంతాలను ఎంతవరకు పరిశుభ్రంగా ఉంచుతున్నారు, వంటకు ఉపయోగించే ముడి పదార్థాల నాణ్యత ఎలా ఉంది, వండిన ఆహారాన్ని సురక్షితంగా ఉంచుతున్నారా లేదా అనే అంశాలను పరిశీలించారు. అదే విధంగా రెస్టారెంట్లలో పనిచేస్తున్న సిబ్బంది పరిశుభ్రత, వంటగదిలో ఉపయోగిస్తున్న సామగ్రి, ఆహార పదార్థాల నిర్వహణ విధానాలను కూడా అధికారులు పరిశీలించినట్లు తెలిపారు. తనిఖీల సందర్భంగా నాణ్యత మరియు పరిశుభ్రత ప్రమాణాలకు అనుగుణంగా లేని ఆహార పదార్థాలను అధికారులు గుర్తించారు. వాటిలో 15 కిలోల గ్రేవీ, 20 కిలోల మాంసం, 3 కిలోల మసాలా పేస్ట్ ఉన్నాయి. మొత్తం 38 కిలోల ఆహార పదార్థాలను డిస్కార్డ్ చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యతపై అనుమానం ఉన్న, వినియోగానికి అనువుగా లేని ఆహార పదార్థాలను రెస్టారెంట్లలో ఉంచకూడదని అధికారులు స్పష్టం చేశారు. రెస్టారెంట్లలో ఆహార పదార్థాల నిల్వ విషయంలో యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులు సూచించారు.





**ఆహారం కలుషితం కాకుండా**

మాంసం, కూరగాయలు, మసాలాలు, గ్రేవీలు, ఇతర ముడి పదార్థాలను తగిన ఉష్ణోగ్రతలో, సురక్షితమైన పద్ధతిలో నిల్వ చేయాలని తెలిపారు. ముడి పదార్థాలు, వండిన ఆహార పదార్థాలు కలిసిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఆహారం కలుషితం కాకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే నాణ్యమైన ముడి పదార్థాలను మాత్రమే వంటకు ఉపయోగించాలని అధికారులు సూచించారు. గడువు ముగిసిన, నాణ్యత లేని లేదా అనుమానాస్పదమైన ముడి పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించరాదని హెచ్చరించారు. ఆహార పదార్థాల తయారీ, నిల్వ, విక్రయం వంటి ప్రతి దశలోనూ ఆహార భద్రతా ప్రమాణాలను పాటించడం రెస్టారెంట్ యాజమాన్యాల బాధ్యత అని స్పష్టం చేశారు. తనిఖీల్లో గుర్తించిన లోపాలను సరిదిద్దుకునేందుకు సంబంధిత రెస్టారెంట్లకు 15 రోజుల గడువు ఇచ్చారు. ఈ గడువులోగా నోటీసుల్లో పేర్కొన్న లోపాలను పూర్తిగా సరిదిద్దుకోవాలని అధికారులు ఆదేశించారు. అనంతరం తిరిగి తనిఖీలు నిర్వహించి పరిస్థితిని పరిశీలిస్తామని తెలిపారు.

ఇచ్చిన గడువులో లోపాలను సరిదిద్దుకోకపోతే నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని అధికారులు హెచ్చరించారు. భద్రాచలం ప్రముఖ పుణ్యక్షేత్రం కావడంతో నిత్యం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, పర్యాటకులు పట్టణానికి వస్తుంటారు. ముఖ్యంగా ఆలయ దర్శనం కోసం వచ్చే భక్తులు హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహారం తీసుకునే పరిస్థితి ఉంటుంది. ఈ నేపథ్యంలో రెస్టారెంట్లు, హోటళ్లలో పరిశుభ్రమైన వాతావరణం ఉండటంతో పాటు నాణ్యమైన ఆహారం అందించడం ఎంతో ముఖ్యమని అధికారులు పేర్కొన్నారు. ప్రజలకు అందించే ఆహారంలో ఎలాంటి నాణ్యతా లోపాలు లేకుండా యాజమాన్యాలు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలు కూడా తాము ఆహారం తీసుకునే హోటళ్లు, రెస్టారెంట్లలో పరిశుభ్రత పరిస్థితులను గమనించాలని అధికారులు సూచించారు. నాణ్యత లేని ఆహారం, అపరిశుభ్ర వాతావరణం వంటి అంశాలు కనిపిస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. భద్రాచలంలో ప్రజలకు, భక్తులకు నాణ్యమైన ఆహారం అందేలా ఆహార భద్రతా శాఖ తరఫున ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ శ్రీ ఈ. శరత్ తెలిపారు.

# 10 దొంగతనం కేసులు ఛేదించిన కోదాడ పోలీసులు



- నిందితుడు అరెస్ట్
- 60 లక్షల విలువైన 37.2 తులాల బంగారం, 470 గ్రాముల వెండి, రూ.3.60 లక్షల నగదు, కారు స్వాధీనం

**సూర్యాపేట జిల్లా సెప్టెంబర్ 9:(వుదయం ప్రతినిధి)**

కోదాడ పట్టణంలో వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగను కోదాడ పోలీసులు అరెస్ట్ చేశారు. 10 దొంగతనం కేసులను ఛేదించి నిందితుడి నుంచి భారీగా బంగారం, వెండి, నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. పట్నం శెట్టి రాజు @ రాజీరెడ్డి, వయసు 41 సంవత్సరాలు, వృత్తి కారు డ్రైవర్, నివాసం పాపిరెడ్డినగర్ కాలనీ, జగద్గిరిగుట్ట, హైదరాబాద్. నిందితుడు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో 2009లో ఖమ్మంలో సైకిల్ దొంగతనం చేసి జైలుకు వెళ్లాడు. 2015, 2016లో జగద్గిరిగుట్ట పరిధిలో 5 ఇళ్లలో చోరీలకు పాల్పడ్డాడు. తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి, రాత్రి సమయంలో తన కారును నిర్మానుష్య ప్రదేశంలో నిలిపి, నడుచుకుంటూ వెళ్లి తాళాలు పగలగొట్టేవాడు. స్క్రూడ్రైవర్, చేతి గ్లౌజులకు బదులుగా షూ సాక్స్ ఉపయోగించేవాడు. బంగారం, వెండి, నగదు దొంగిలించి కొన్ని అమ్మడం, కొన్ని కరిగించడం, మరికొన్నింటిని ఫైనాన్స్ సంస్థలో కుదవ పెట్టేవాడు. పోలీసులకు దొరక్కుండా తన కారు అసలు నంబర్ ఏపీ 28 బివై 7770 కు బదులుగా నకిలీ నంబర్ టీఎస్ 07 జి సి 1612 వాడేవాడు. హైదరాబాద్ నుంచి ప్రయాణికులను కోదాడకు తీసుకొచ్చి, రాత్రి కోదాడలోనే ఉండి తెల్లవారుజామున తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసేవాడు. కోదాడలో 2021 నుంచి ఇప్పటివరకు 10 దొంగతనాలకు పాల్పడగా, 2026లోనే 7 ఇళ్లలో చోరీ చేశాడు. నమ్మదగిన సమాచారంతో ఈరోజు ఉదయం 8 గంటలకు దొంగిలించిన బంగారాన్ని విజయవాడకు తీసుకెళ్లి అమ్మేందుకు కోదాడ ఫ్లైఓవర్ మీదుగా వెళ్తుండగా, హుజూర్ నగర్ ఫ్లైఓవర్ వద్ద పోలీసులు తనిఖీ చేస్తుండటం గమనించి వెనక్కి తప్పించుకోబోతుండగా పట్టుకున్నారు. కారు డిక్కీలో బంగారం, వెండి, నగదు, స్క్రూడ్రైవర్లు, షూ సాక్స్ లభించాయి. హోండా అమేజ్ కారు, వివో వై31 5 జి ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్ కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ నేరస్తులు ఎప్పటికైనా చట్టానికి చిక్కక తప్పదన్నారు. ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, సీసీ కెమెరాలు, అలారం సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలని, ఎక్కువ రోజులు ఇంటికి తాళం వేసేవారు విలువైన వస్తువులు ఇంట్లో ఉంచవద్దని, స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే డయల్ 112కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సీసీఎస్ ఇన్స్పెక్టర్ శివకుమార్, కోదాడ టౌన్ ఇన్స్పెక్టర్ శివశంకర్, ఎస్ఐలు హరికృష్ణ, సాయిరాం, అజయ్ కుమార్, సిబ్బంది వెంకన్న, విద్యాసాగర్, మల్లేష్, సతీష్, శివ, ప్రభాకర్, మంజులను ఎస్పీ అభినందించి రివార్డు అందజేశారు.

# ఘనంగా తెలంగాణ మాండలిక భాషా దినోత్సవం

**కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ జాన్ మిల్టన్**

**భద్రాచలం, సెప్టెంబర్ 09 (వుదయం ప్రతినిధి):**



భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తిలో తెలంగాణ మాండలిక భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రజాకవి, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ఆచార్య కాళోజి నారాయణరావు 113వ జయంతి ఉత్సవాలను కళాశాల తెలుగు విభాగం, సాహితి విభాగం ఆధ్వర్యంలో బుధవారం కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజి నారాయణరావు చిత్రపటానికి కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ జాన్ మిల్టన్, అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీమతి హవేల, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ కపిల భారతి, తెలుగు విభాగాధిపతి నందూరి రాంబాబు, సుబ్బరాజు, శ్రీను, కార్యక్రమ కన్వీనర్లు డాక్టర్ సుధాకర్, డాక్టర్ కిరణ్, డాక్టర్ నాగ సమీరా, గణిత విభాగాధిపతి శ్రీమతి శ్రీలతతో పాటు వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాళోజి నారాయణరావు జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో భాష, సాహిత్యం, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించే విధంగా సాగింది.

# కుటుంబమంతా ప్రకృతి ప్రేమికులే...

**ఇల్లందు సెప్టెంబర్ 9 (వుదయం)**



ఇల్లందు తహసిల్దార్ కార్యాలయంలో ఆపరేటర్ గా పనిచేస్తున్న వీరన్న _ భవాని దంపతుల కుమార్తె విస్మిత, కుమారుడు విస్మిత్ పుట్టినరోజు సందర్భంగా మొక్కను నాటి ప్రకృతిపై ఉన్న ప్రేమను తెలియజేశారు అనంతరం వారు మాట్లాడుతూ మానవాళికి మొక్కల అవసరం ఎంతగానో ఉందని ప్రతి ఒక్కరు మొక్కలను నాటడంలో ముందుండాలని మొక్కలు నాటడం ద్వారా ప్రకృతికి ఎంతో సహాయం చేసిన వారు అవుతామని వారు అన్నారు.



# ప్రకృతి వ్యవసాయంతో కుటుంబ ఆరోగ్యం

**అనంతగిరి సెప్టెంబర్ 9 వుదయం**

మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి రైతు తమ కుటుంబ ఆరోగ్య అవసరాల కోసం అర ఎకరంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని సిరి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ మొలుగూరి గోపయ్య తెలిపారు. బుధవారం అనంతగిరి మండలం చనుపల్లి గ్రామంలో గుడ్ మార్నింగ్ ఫార్మర్స్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రకృతి వ్యవసాయంపై ప్రచారం నిర్వహించారు. గత 60 ఏళ్లుగా చేస్తున్న రసాయనిక వ్యవసాయంతో భూసారం దెబ్బతింటుంది అన్నారు. మళ్లీ భూమిలో భూసారం పెరగాలంటే ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. ప్రస్తుతం నేలలో భూసారం పెరగాలంటే జీవామృతం వాడాలన్నారు. అలాగే పొలంలో ఆశించే చీడపీడల నివారణకు నీమాస్త్రం, వేప గింజల కషాయం, బ్రహ్మాస్త్రం, అగ్ని అస్త్రం, వావిలాకు కషాయం, ఆవు మూత్రం పేడ ద్రావణం, పుల్లటి మజ్జిగ, మట్టి ద్రావణం, జీవామృతం పిచికారీ చేసి సమర్థవంతంగా నివారించవచ్చు అన్నారు. మనతో పాటు మన భవిష్యత్తు తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయడమే మార్గమన్నారు. వ్యవసాయ భూమి లేని వారు తమ ఇళ్లల్లో కూరగాయలు సాగు చేసుకోవాలన్నారు. నేల ఆరోగ్యమే పంట ఆరోగ్యమని పంట ఆరోగ్యమే మన ఆరోగ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి రైతు ఏలేటి వెంకటేశ్వర్ రెడ్డి, అమర గాని నాగయ్య పాల్గొన్నారు.

# పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30 వేల పరిహారం ఇవ్వాలి

**రైతు సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు బుర్రి శ్రీరాములు**

**మునగాల, సెప్టెంబర్ 9 (వుదయం):**



పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, నష్టపోయిన ప్రతి ఎకరానికి రూ.30 వేల చొప్పున పరిహారం అందించాలని రైతు సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు బుర్రి శ్రీరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మునగాల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులకు ప్రత్యేక సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. మండల కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో సోమవారం రైతు సంఘం మండల అధ్యక్షులు చందా చంద్రయ్య అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో బుర్రి శ్రీరాములు మాట్లాడారు. మునగాల మండల వ్యాప్తంగా పూత, పిందె దశలో ఉన్న పత్తి పంటకు వర్షాలు లేక పూర్తిగా ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు. పంటల పరిస్థితిని వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టాన్ని అంచనా వేయాలని డిమాండ్ చేశారు. త్రాగునీటి అవసరాల కోసం విడుదల చేసి చెరువులు, కుంటలను నింపుతున్న నీటిని కొందరు దుర్వినియోగం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నీటి వినియోగంపై అధికారులు నిఘా పెట్టి, అక్రమంగా నీటిని వినియోగించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు స్టాలిన్, రామకృష్ణారెడ్డి, మండవ వెంకటాద్రి, డీవైఎఫ్ఐ నాయకులు గడ్డం వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ గారికి ప్రాణహాని కలిగించే కుట్రపై దమ్మపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదుచేసిన బిఆర్ఎస్ శ్రేణులు

**దమ్మపేట సెప్టెంబర్ 9,(వుదయం ప్రతినిధి ):**



తెలంగాణ రాష్ట్ర సాధకుడు,ఉద్యమ నాయకుడు,మాజీ ముఖ్యమంత్రి,బీఆర్ఎస్ పార్టీ అధినేత శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుని హత్య చేయడానికి కుట్ర జరిగిందనే ఆరోపణలు, అలాగే నిన్న అసెంబ్లీలో చోటుచేసుకున్న పరిణామాలు,షాద్‌నగర్ ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్ చేసిన తీవ్ర వ్యాఖ్యలు అత్యంత ఆందోళన కలిగించాయి. ఈ నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావు ఆదేశాల మేరకు, నియోజకవర్గ ఇంచార్జ్,మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావు సూచనలతో బుధవారం దమ్మపేట పోలీస్ స్టేషన్ లో యస్ఐ బాలస్వామికి మండలంలోని పార్టీ శ్రేణులు రాష్ట్రంలో ఈరెండు రోజులు బిఆర్ఎస్ పార్టీపై,పార్టీ నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కుట్రదాడిని వివరిస్తూ ఫిర్యాదు చేయటం జరిగింది.ఈ సందర్బంగా నాయకులు మాట్లాడుతూ .. అసెంబ్లీలో రాజకీయపరమైన వాదనలను ఒక వర్గాన్ని రెచ్చగొట్టే విధంగా ఉపయోగించి,అనంతరం పెద్ద సంఖ్యలో వాహనాల్లో వ్యక్తులను తీసుకొని కేసీఆర్ నివాసముంటున్న ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వైపు వెళ్లడం, కేసీఆర్ గారిని చంపాలంటూ చేసిన వ్యాఖ్యలు అత్యంత తీవ్రమైనవి.ఈవిషయానికి సంబంధించిన వీడియోలు టీవీ, సోషల్ మీడియాలో ప్రచారంలోకి వచ్చిన నేపథ్యంలో పూర్తిస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని ఫిర్యాదులో పేర్కొన్నామని నాయకులు చెప్పారు.గత కొంతకాలంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టడం, భయభ్రాంతులకు గురిచేయడం, మానాయకులు కేటీఆర్ , హరీశ్‌రావు పై నిరాధారమైన ఆరోపణలతో కేసులు పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నాము. అదేవిధంగా కేసీఆర్ పై గతంలో చేసినట్లు ఆరోపించబడుతున్న తీవ్ర, అవమానకరమైన వ్యాఖ్యలు,అసెంబ్లీ వేదికగా చేసిన బెదిరింపు ధోరణి వ్యాఖ్యలను కూడా పోలీసులు పరిగణనలోకి తీసుకుని సమగ్రంగా విచారణ జరపాలని ఫిర్యాదులో పేర్కొన్నాము.పిర్యాదు చేసిన వారిలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల ఉపాధ్యక్షులు గాజుబోయిన యేసుబాబు,మండల సీనియర్ నాయకులు దారా యుగుందర్,అబ్దుల్ జిన్న,సర్పంచ్ యట్ల రామదాసు,వార్డు సభ్యులు దారా రాము,ఉయ్యాల లక్ష్మీనారాయణ,మాజీ కో ఆప్షన్ ఎంపీటీసీ బుడే, వెలుగోటి మహేష్,పాకనాటి శ్రీను,మాజీ ఎంపీటీసీ కాసిని శ్రీను,కొలికపోగు ధర్మ,కొలురి నాగయ్య,బండ్ల లక్ష్మయ్య, దండబత్తుల కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**చర్ల, సెప్టెంబర్ 9: (వుదయం ప్రతినిధి)**



పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని చర్ల ఎస్‌హెచ్‌ఓ ఆలం రాజువర్మ సూచించారు. బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు కాకి అనిల్, అంబోజి సతీష్, మెంతుల నాగరాజు ఆధ్వర్యంలో ఎస్‌హెచ్‌ఓ రాజువర్మకు విత్తన వినాయకుడిని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ రాజువర్మ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. వినాయక చవితి సందర్భంగా రసాయనాలు కలిగిన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా మట్టి గణపతి విగ్రహాలను వినియోగించాలని సూచించారు. మట్టి విగ్రహాలు నీటిలో సులభంగా కలిసిపోయి పర్యావరణానికి పెద్దగా హాని కలిగించవని తెలిపారు. అదేవిధంగా విత్తన వినాయక విగ్రహాలను ఉపయోగించడం ద్వారా పూజ అనంతరం విగ్రహాన్ని మట్టిలో నాటి మొక్కలను పెంచే అవకాశం ఉంటుందని, తద్వారా పర్యావరణ పరిరక్షణకు మరింతగా దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారు చేసిన విగ్రహాలు నీటిలో త్వరగా కరగకపోవడంతో చెరువులు, నదులు, ఇతర నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. అలాగే విగ్రహాలకు ఉపయోగించే కొన్ని రసాయన రంగుల వల్ల నీటిలోని జీవజాలానికి, పర్యావరణానికి నష్టం కలిగే ప్రమాదం ఉందని తెలిపారు. "మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం. ప్రతి ఒక్కరూ తమ వంతుగా మొక్కలు నాటి ప్రకృతి సంరక్షణలో భాగస్వాములు కావాలి" అని ఎస్‌హెచ్‌ఓ రాజువర్మ పిలుపునిచ్చారు.



# కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్‌కు ఘన స్వాగతం

**భద్రాచలం, సెప్టెంబర్ 9 (వుదయం ప్రతినిధి):**

భద్రాచలం పర్యటనలో భాగంగా మంగళవారం రాత్రి సారపాకలోని ఐటీసీ అతిథి గృహానికి విచ్చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ గారికి భద్రాచలం భారతీయ జనతా పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీజేపీ భద్రాచలం నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికి తమ అభిమానం చాటుకున్నారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా భద్రాచలం ప్రాంతానికి వచ్చిన సందర్భంగా పార్టీ నాయకులు ప్రత్యేకంగా సత్కరించారు. బీజేపీ భద్రాచలం నియోజకవర్గం తరఫున శ్రీ బండి సంజయ్ కుమార్ గారికి శాలువా కప్పి ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయంగా స్వాగతం పలికారు. అనంతరం నియోజకవర్గానికి సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలను నాయకులు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా భద్రాచలం నియోజకవర్గంలో నెలకొన్న ప్రజా సమస్యలు, మౌలిక వసతుల అభివృద్ధి, రహదారులు, విద్య, వైద్యం, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి సంబంధించిన అభివృద్ధి అంశాలతో పాటు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి అందాల్సిన సహకారంపై నాయకులు చర్చించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఫలాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు పనిచేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుంజా ధర్మా, కుంజా సంతోష్, నిడదవోలు నాగబాబు, ములిశెట్టి రాంమోహన్ రావు, అట్లూరి రఘురామ్, ముత్యాల శ్రీనివాస్, బోడ సత్యనారాయణ, ములిశెట్టి నిఖిల్, అన్నెం సాయి లక్ష్మణ్, మాలోత్ సాయి వినోద్ తదితరులు పాల్గొన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పర్యటన సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని ఆయనకు ఘన స్వాగతం పలికారు.

# రైల్వే లైన్ సాధనకు శ్రీ వాసవి సేవా సమితి మద్దతు



**లక్ష పోస్ట్ కార్డ్ ఉద్యమ శిబిరంలో పాల్గొని 1000 కార్డుల అందజేత**

**సూర్యాపేట, సెప్టెంబర్ 9: (వుదయం ప్రతినిధి)**

ఆధ్యాత్మిక, సామాజిక సేవలతో పాటు ప్రజల అవసరాల కోసం శ్రీ వాసవి సేవా సమితి ఎప్పుడూ ముందుంటుందని సమితి జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి దేవరశెట్టి నాగరాజు, కోశాధికారి సోమ ప్రవీణ్ కుమార్ తెలిపారు. బుధవారం సూర్యాపేట మున్సిపల్ కార్యాలయం ముందు రైల్వే సాధన సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లక్ష పోస్ట్ కార్డుల ఉద్యమ శిబిరంలో పాల్గొని, రైల్వే లైన్ సాధన ఉద్యమానికి పూర్తి మద్దతు ప్రకటిస్తూ 1000 కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా అభివృద్ధిలో రైల్వే లైన్ కీలకమని, రైల్వే మార్గం వస్తే జిల్లా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ప్రకటించిన రైల్వే మార్గాన్ని కొంతమంది స్వార్థపరులు సూర్యాపేట మీదుగా కాకుండా ఇతర మార్గాలకు మళ్లించడం వల్ల సూర్యాపేట జిల్లా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రైల్వే లైన్ సాధన కోసం నిరంతరం కృషి చేస్తున్న రైల్వే సాధన సమితి కన్వీనర్ దేగల జనార్ధన్ ను అభినందించారు. రైల్వే లైన్ సాధించే వరకు సమితి చేపట్టే ప్రతి ఉద్యమానికి శ్రీ వాసవి సేవా సమితి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. సూర్యాపేట మీదుగా గతంలో ప్రకటించిన విధంగా రైలు మార్గాన్ని కొనసాగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. సూర్యాపేట నుండి రైల్వే మార్గం వెళ్లేలా కేంద్ర, రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో రైల్వే సాధన సమితి నిర్వాహకులు బిక్కుమల్ల ఉపేందర్, రాచూరి ప్రతాప్, నల్లపాటి అప్పారావు, భద్రయ్య, మంజుల, అంజయ్య, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గుండా రమేష్, వాసవి సేవా సమితి ఉపాధ్యక్షులు మిరియాల సుధాకర్, రాచకొండ శ్రీనివాస్, మహంకాళి ప్రణీత్, కలకోటి నరసయ్య, సహాయ కార్యదర్శులు కర్నాటి కృష్ణ, బచ్చు శ్రీనివాస్, తప్పి అనిల్, సోమా ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు.. సత్తుపల్లిలో బీఆర్ఎస్ ఫిర్యాదు

**సత్తుపల్లి సెప్టెంబర్ 9 ( వుదయం ప్రతినిధి )**



తెలంగాణ ఉద్యమ నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్ల శంకర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సత్తుపల్లి బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. కేసీఆర్‌ను అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు ఆయన చావు కోరుకున్నారని ఆరోపిస్తూ సత్తుపల్లి బీఆర్ఎస్ నాయకులు సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యే వీర్ల శంకర్‌పై ఫిర్యాదు చేశారు. వెంటనే శంకర్‌ను అరెస్ట్ చేసి కేసీఆర్‌కు క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ జోలికి వస్తే ఏ ఒక్క బీఆర్ఎస్ కార్యకర్త కూడా సహించబోరని హెచ్చరించారు. ప్రశాంతమైన తెలంగాణలో ఇలాంటి విష సంస్కృతి మంచిది కాదని అన్నారు. రేవంత్ రెడ్డి కనుసన్నల్లోనే ఇలాంటి వ్యాఖ్యలు, దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఎల్లకాలం అధికారం మీది కాదని కాంగ్రెస్ ప్రభుత్వానికి గుర్తు చేస్తూ.. ఈ అరాచక పాలనకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని బీఆర్ఎస్ నాయకులు అన్నారు.

# కేసీఆర్ మరణాన్ని కోరిన కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

**మధిర, సెప్టెంబర్ 9, వుదయం, ప్రతినిధి:**




తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి,బిఆర్ఎస్ అధినేత కే. చంద్రశేఖర రావుపై కాంగ్రెస్ పార్టీకి చెందిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మధిర టౌన్ పోలీస్ స్టేషన్‌లో బిఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. కేసీఆర్ మరణాన్ని బహిరంగంగా కోరుతూ, ఆయనకు హాని తలపెట్టేలా శంకర్ వ్యాఖ్యానించారని,ఈ వ్యాఖ్యలు ప్రజల్లో శాంతి భద్రతల సమస్యలను సృష్టించేలా ఉన్నాయని పేర్కొన్నారు.ఈ మేరకు బుధవారం మధిర టౌన్ సీఐ రమేష్‌ను కలిసిన బిఆర్ఎస్ నాయకులు పల్లపోతు వెంకటేశ్వరావు,చిత్తారినాగేశ్వరావు,అరిగే శ్రీనివాసరావు,బొగ్గుల భాస్కర్ రెడ్డి,చావా వేణు, వంకాయలపాటినాగేశ్వరరావులతో పాటు పలువురు ప్రతినిధులు లిఖితపూర్వక ఫిర్యాదును అందజేశారు.తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పెట్టిన కీలక నాయకుడిపై చట్టసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఒక ఎమ్మెల్యే ఈ తరహా వ్యాఖ్యలు చేయడం అత్యంత దారుణమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజాస్వామ్యంలో రాజకీయ విభేదాలు సహజమని,అయితే ఒక నాయకుడి చావును కోరుతూ బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం చట్టరీత్యా నేరమని బిఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.బాధ్యతాయుతమైన పదవిలో ఉండి సమాజంలో హింసను ప్రేరేపించేలా మాట్లాడిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేసి,చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఐని కోరారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఆళ్ల నాగబాబు, ప్యారి, చీధిరాల రాంబాబు, వేల్పుల శివ,వీర రాఘవరెడ్డి,బొగ్గుల వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

**దమ్మపేట సెప్టెంబర్ 9 (వుదయం ప్రతినిధి):**




అంగన్వాడి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని బుధవారం తలపెట్టిన హైదరాబాద్ ధర్నాకు వెళ్తున్న వారిని, హైదరాబాదులో ధర్నా నిర్వహిస్తున్న రాష్ట్ర నాయకత్వాన్ని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ తాసిల్దార్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి డిప్యూటీ కలెక్టర్కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ మురారి రఘు మాట్లాడుతూ అంగన్వాడి ఉద్యోగులు పని భారం ఎక్కువై సతమతం అవుతున్నారని చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్నప్పటికీ పెరుగుతున్న ధరలకు తగ్గట్టుగా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచలేదని అన్నారు. అంగన్వాడి ఉద్యోగులకు కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని పిఎంసి ప్రీ ప్రైమరీ విద్యను రద్దు చేయాలని సెంటర్ హద్దులు పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సూరమ్మ, జయ, వెంకటలక్ష్మి , సీతారామమ్మ,వజ్రమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి

- కలెక్టర్లకు వాణి ప్రసాద్ ఆదేశం
- జ్ఞాన భారతం మిషన్ లో ప్రాచీన గ్రంథాల డిజిటలైజేషన్ - పర్యాటకం, జ్ఞాన భారతంపై వీడియో కాన్ఫరెన్స్

**సూర్యాపేట, సెప్టెంబర్ 9: వుదయం ప్రతినిధి**

ప్రతి జిల్లాలో ఉన్న ప్రత్యేక పర్యాటక సామర్థ్యాన్ని గుర్తించి, పర్యాటక అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించి పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వి. వాణి ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం పర్యాటక అభివృద్ధి, జ్ఞాన భారతం మిషన్ అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సమీక్షకు కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాణి ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక నోడల్ అధికారిని నియమించాలని సూచించారు. సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ప్రతి జిల్లాలోని ముఖ్య పర్యాటక ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 142 వీకెండ్ గేట్ వే పర్యాటక ప్రాంతాలను గుర్తించామని, వాటి అభివృద్ధికి మౌలిక వసతులు, పెట్టుబడి అవకాశాలు, ప్రచార కార్యక్రమాలను రూపొందించాలన్నారు. ప్రతి జిల్లాకు మూడేళ్ల పర్యాటక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, పీపీపీ విధానంలో ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించాలని సూచించారు. జ్ఞాన భారతం మిషన్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, చారిత్రక ప్రదేశాలు, దేవాలయాల్లో ఉన్న ప్రాచీన గ్రంథాలు, శాసనాలు, మాన్యుస్క్రిప్ట్లను గుర్తించి సంరక్షించి డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు. జిల్లా స్థాయి సమావేశం నిర్వహించి సమగ్ర సర్వే చేపట్టి నివేదిక సమర్పించాలని, అదనపు కలెక్టర్లు నోడల్ అధికారులుగా వ్యవహరించాలని తెలిపారు. పర్యాటక ప్రాంతాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, సీసీ కెమెరాలు, సైన్ బోర్డులు, సమాచార కియోస్క్ లు, గైడ్లు, ఫుడ్ కోర్టులు, దివ్యాంగులకు అనుకూల మార్గాలు వంటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. 8 జిల్లాల్లో 16 ఎకరాలను రూ.8.45 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్డీఓ ప్రేమ్ రాజ్, ట్రైనీ కలెక్టర్



డిప్యూటీ కలెక్టర్లు రవితేజ, అనూష, యూత్ వెల్ఫేర్/పర్యాటక శాఖ అధికారి వెంకట్ రెడ్డి, జీఎం ఇండస్ట్రీ భారతి, టూరిజం ఏఈ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషణపై విస్తృత అవగాహన కల్పించాలి

**ఐటీడీఏ పీవో ఐఏఎస్ బి. రాహుల్**

**భద్రాచలం, సెప్టెంబర్ 9 (వుదయం ప్రతినిధి)**



పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు, మహిళల్లో పోషకాహారంపై అవగాహన పెంపొందించి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి బాటలు వేయడమే పోషణ మాసం ప్రధాన లక్ష్యమని ఐటీడీఏ పీవో ఐఏఎస్ అధికారి బి. రాహుల్ అన్నారు. పోషకాహారం ప్రతి వ్యక్తి ఆరోగ్యానికి, ముఖ్యంగా చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతో కీలకమని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాలు కేవలం పౌష్టికాహారం అందించే కేంద్రాలుగా కాకుండా ఆరోగ్యం, పోషణ, పరిశుభ్రతపై అవగాహన కల్పించే కేంద్రాలుగా మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పోషణ మాస ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఐటీడీఏ పీవో బి. రాహుల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది పోషణ మాస నినాదమైన "మన అంగన్వాడి – మన బాధ్యత" అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో ముందుగా రూపొందించిన షెడ్యూల్ ప్రకారం పోషణ, ఆరోగ్యం, పరిశుభ్రత, తల్లిపాలు, శిశు సంరక్షణ, సమతుల్య ఆహారం వంటి అంశాలపై వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారిణి జే. స్వర్ణలత రెడ్డి మాట్లాడుతూ పోషకాహార లోపాన్ని తగ్గించడం, ప్రతి కుటుంబానికి సమతుల్య ఆహారం ప్రాముఖ్యతను తెలియజేయడం, శిశువు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీటీడీవో రాధమ్మ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రతాప్, నేషనల్ న్యూట్రిషన్ మిషన్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ పొనుగోటి సంపత్, పోషణ అభియాన్ డీపీఏ బి. రాము, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయకులనే ప్రతిష్ఠించండి

**పర్యావరణ పరిరక్షణ కోసం గోడ పత్రిక ఆవిష్కరించిన కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట, సెప్టెంబర్ 9: వుదయం ప్రతినిధి**



పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ వినాయక చవితిని పర్యావరణహితంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించి పూజించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ నందు కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రజలందరి బాధ్యత అని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలు, కృత్రిమ రంగుల వినియోగం వల్ల నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. మట్టి గణనాథులను పూజించి పర్యావరణ హితానికి మేలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఏఈఎస్ డా. పురుషోత్తం రెడ్డి, వీరాస్వామి పాల్గొన్నారు.

## కళావేదిక ఆధ్వర్యంలో 176వ శతాధిక కవి సమ్మేళనం

**భద్రాచలం, సెప్టెంబర్ 9 (వుదయం ప్రతినిధి)**



భద్రాచలంలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ ఆదివారం స్థానిక పాల్ రాజ్ ఇంజనీరింగ్ కళాశాలలో 176వ శతాధిక కవిసమ్మేళనం నిర్వహించనున్నట్లు పాల్ రాజ్ ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్, శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధికార ప్రతినిధి వరలక్ష్మి సాయిరాం తెలిపారు. బుధవారం భద్రాచలం పట్టణంలో నిర్వహించిన శ్రీశ్రీ కళావేదిక సన్నాహక కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ కవిసమ్మేళనం ఏర్పాట్లపై వివరాలను వెల్లడించారు. శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ ప్రతిష్ఠాత్మక కవిసమ్మేళనానికి దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన 200 మందికి పైగా కవులు హాజరై తమ కవితలను వినిపించనున్నారని వరలక్ష్మి సాయిరాం తెలిపారు. తెలుగు సాహిత్యం, కవిత్వం, సాంస్కృతిక విలువలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కవులు, సాహితీవేత్తలు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు. అంతర్జాతీయ సీఈఓ డా. కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరిభూషణం, ప్లానింగ్ అధికారి డా. పార్థసారథి నాయకత్వంలో ఈ శతాధిక కవిసమ్మేళనాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కవిసమ్మేళనంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పాల్గొనే కవులకు ప్రత్యేకంగా ఘన సత్కారం నిర్వహించనున్నట్లు చెప్పారు. కవిసమ్మేళనంలో పాల్గొనదలచిన కవులు ముందస్తుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. ఆసక్తి ఉన్న కవులు 9182613680, 9346078988 నంబర్లకు వాట్సాప్ ద్వారా సంప్రదించాలని కోరారు. కవులు, సాహిత్యాభిమానులు, కళాకారులు, భద్రాచలం పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. ఈ సన్నాహక సమావేశంలో పాల్ రాజ్ ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి సి. జకర్య, శ్రీశ్రీ కళావేదిక తెలంగాణ రాష్ట్ర సమన్వయకర్త సురేష్ బాబు తోటమళ్ల, జిల్లా అధ్యక్షులు జి. లక్ష్మణ్ కుమార్, జిల్లా ప్రతినిధి ఎర్రంశెట్టి పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

## కాళోజి నారాయణరావు జయంతి వేడుకలు

**యాదాద్రి భువనగిరి, 09-09-2026**



జాగృతిలో ఘనంగా కాళోజి నారాయణరావు జయంతి వేడుకలు స్థానిక జాగృతి డిగ్రీ మరియు పీజీ కళాశాల ప్రిన్సిపల్ సింగన బోయిన మల్లేశం గారి ఆధ్వర్యంలో ప్రముఖ ప్రజాకవి, స్వాతంత్ర సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు శ్రీ కాళోజి నారాయణరావు గారి జన్మదినాన్ని పురస్కరించుకొని తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపల్ ఆయన చిత్రపటానికి పూలమాలవేసి మాట్లాడుతూ "నా గొడవే నా కవిత" అన్యాయాన్ని ఎదిరించడమే నిజమైన జీవితం ప్రజల గొంతుకే నా గొంతుక పుట్టుక నీది చావు నీది బతుకంత దేశానిది అనే నినాదంతో విద్యార్థులు ఇలాంటి వ్యక్తులను స్మరించుకుంటూ , ఆదర్శంగా తీసుకుంటూ భవిష్యత్తులో ముందుకెళ్లాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు వెంకటేష్, ఇస్తారి, సుధా కిషోరీ మరియు అధ్యాపక బృందం మరియు (విద్యార్థులు) ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి

**అనంతగిరి సెప్టెంబర్ 9 వుదయం**



మండల పరిధిలోని వాయిలసింగవరం గ్రామంలో బుధవారం గ్రామ పంచాయితీ కార్యాలయంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు 112 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు ,కాళోజీ చిత్రపటానికి గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు, మండల వీబీజీరామ్జీ ఇన్చార్జి ఏపీవో నూకబత్తిని వెంకన్న లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి కాకర్ల సౌమ్య ,అంగన్వాడీ టీచర్ సుజాత ,వార్డు సభ్యులు వీరబోయిన నాగరాజు, దేవులపల్లి నాగరాజు, గ్రామ పెద్దలు కొల్లు సుబ్బారావు బుర్రా పెద్దగొల్ల సైదులు ,బుర్రా వెంకటేశ్వర్లు , గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు

## విజయరాఘవాపురం ముద్దుబిడ్డకు ఘన సన్మానం

**ఎంఈఎఫ్ జాతీయ కోర్ కమిటీ ఉపాధ్యక్షుడిగా డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు ఎన్నిక**

**మునగాల, సెప్టెంబర్ 9 (వుదయం):**



విజయరాఘవాపురం గ్రామానికి చెందిన డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు ఎంఈఎఫ్ జాతీయ కోర్ కమిటీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుంకర పిచ్చయ్య, కిసాన్ జిల్లా రైతు అధ్యక్షుడు బచ్చు అశోక్, ఉపసర్పంచ్ డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు బత్తిని లక్ష్మీనారాయణ, మండల సహాయకార్యదర్శి సోమపంగు బుచ్చిరాములు, బీజేపీ మండల నాయకుడు ఉడుముల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. . విజయరాఘవాపురం నుంచి జాతీయ స్థాయికి ఎదిగిన డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లును గ్రామ ప్రజలు అభినందిస్తూ, ఆయన నాయకత్వంలో మాదిగ సమాజం మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

## సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో కృత్రిమ మేధస్సు(ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటి)పై వర్కుషాప్

**సత్తుపల్లి సెప్టెంబర్ 9 ( వుదయం ప్రతినిధి)**




సత్తుపల్లి మండల పరిధిలోని బి .గంగారం సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కృత్రిమ మేధస్సు(ఏఐ)మరియు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటి)పై మూడు(3)రోజుల వర్కుషాప్ నేటితో ముగిసింది. ఈ వర్కుషాప్ డిపార్ట్మెంట్ అఫ్ ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ వారి ఆధ్వర్యంలో ఇన్స్టిట్యూషన్ అఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీర్స్(IETE)విజయవాడ మరియు KITSCART హైదరాబాద్ వారి సహకారంతో ఈసిఈ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు ఏఐ తో ఐఓటి అంటే కృత్రిమ మేధస్సు (ఏఐ) మరియు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటి) కలిపి పనిచేయడం. ఏఐ డేటాను విశ్లేషించి, నేర్చుకుని, నిర్ణయాలు తీసుకునే సాంకేతికత. ఐఓటి సెన్సర్లు, పరికరాలు ఇంటర్నెట్ ద్వారా డేటాను పంపడం మరియు స్వీకరించడం. ఏఐ మరియు ఐఓటి తెలివైన పరికరాలు. ఉదాహరణ: స్మార్ట్ వ్యవసాయంలో ఐఓటి సెన్సర్లు నేలలో తేమను గుర్తిస్తాయి. ఏఐ ఆ డేటాను విశ్లేషించి పంటకు నీరు ఎప్పుడు అవసరమో నిర్ణయిస్తుంది. ఐఓటి డేటాను సేకరిస్తుంది. ఏఐ ఆ డేటాను అర్థం చేసుకుంటుంది. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి డాక్టర్.వి.శేషారత్నకుమారి మాట్లాడుతూ ఈసిఈ నాలుగో సంవత్సరం విద్యార్థులు కృత్రిమ మేధస్సు (ఏఐ) ఇంటర్ నెట్ అఫ్ థింగ్స్(ఐఓటి)పై ట్రైనింగ్ పొందటంతో పాటు సాఫ్ట్వేర్ మీద మంచి అవగాహన కలిగి ఉండటం దానిని ఎలా ఉపయోగించాలో కూడా తెలియజేయడం జరుగుతుందని విద్యార్థులు ఉద్యోగాలు పొందేందుకు కావాల్సిన నైపుణ్యం ఇటువంటి వర్కుషాప్ లో ప్రత్యేక శిక్షణ కల్పించేందుకు కృత్రిమ మేధస్సు (ఏఐ) & ఇంటర్నెట్ అఫ్ థింగ్స్(ఐఓటి)వర్కుషాప్ పై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తోందని చెప్పారు. ఈసిఈ విభాగాధిపతి డాక్టర్:పి.శేఖర్ బాబు మాట్లాడుతూ (ఏఐ&ఐఓటి)ఈ సాంకేతికతలను ఉపయోగించేటప్పుడు మన వ్యక్తిగత సమాచారాన్ని మరియు గోప్యతను కాపాడుకోవడం చాలా ముఖ్యం.సాంకేతికతను బాధ్యతాయుతంగా ఉపయోగించాలని కోరారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త,విద్యాధికులు హెటేరో గ్రూప్ అఫ్ కంపెనీస్ అధినేత మరియు సాయిస్ఫూర్తి ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ ఛైర్మన్ డాక్టర్ బండి.పార్థసారథిరెడ్డి విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ శ్రీమతి బండి.అన్విద వర్కుషాప్ లో పాల్గొన్న విద్యార్థినీ,విద్యార్థులను వర్చువల్ గా అభినందించారు. కళాశాల సెక్రటరీ & కరస్పాండెంట్ దాసరి.ప్రభాకర్ రెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.వి.శేషారత్నకుమారి , కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్.యాకూబ్ గారు, ఈసిఈ విభాగాధిపతి డాక్టర్:పి.శేఖర్ బాబు ఈ వర్క్ షాప్ కు కో-ఆర్డినేటర్స్ గా :మిస్టర్ పి. నాగశేఖర్, మిస్టర్ యం.వరప్రసాద్ వ్యవహరించారు. మరియు కళాశాల ఫ్యాకల్టీ మెంబర్స్ విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.

## స్త్రీ శక్తి భవనానికి శంకుస్థాపన

**అనంతగిరి సెప్టెంబర్ 9 వుదయం**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు మహిళ సంఘాల భవనాలను మంజూరు చేస్తున్న నేపథ్యంలో కోదాడ శాసనసభ్యురాలు పద్మావతి రెడ్డి ఆదేశాల మేరకు మొగలాయి కోట గ్రామంలో మహిళా సంఘం భవన నిర్మాణానికి బుధవారం గ్రామ సర్పంచ్ లింగం రామతారక శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సంఘాలకు శాశ్వత భవనం అందుబాటులోకి రావడం ద్వారా వారి కార్యకలాపాలకు మరింత సౌకర్యం కలుగుతుందని తెలిపారు.గ్రామ అభివృద్ధికి అవసరమైన ప్రభుత్వ భవన నిర్మాణానికి స్థలం లేక ఇబ్బందులు ఎదురైన సమయంలో సింగారెడ్డి చిన్న వెంకటరెడ్డి కుమారులు బుచ్చిరెడ్డి, భద్రారెడ్డి ముందుకు వచ్చి తమ స్థలాన్ని అందించడం అభినందనీయమన్నారు.గ్రామ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించిన స్థలదాతల సేవాభావం ఆదర్శనీయమని, వారి సహకారాన్ని గ్రామ ప్రజలు ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటారని సర్పంచ్ తెలిపారు. మహిళా సంఘాల అభివృద్ధితో పాటు గ్రామ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం మరియు మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి అందిస్తున్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అధికారులు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సింగారెడ్డి కిరణ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎయిర్ ఫోర్స్ వెంకటరెడ్డి వార్డు సభ్యులు మహిళా సంఘాల ప్రతినిధులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటాలి



- భద్రాచలంలో 18, 19 తేదీల్లో 70వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు
- ఎంఈఓ బెక్కంటి శ్రీనివాసరావు

**భద్రాచలం, సెప్టెంబర్ 9 (వుదయం ప్రతినిధి):**

స్కూల్ గేమ్స్ అండ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 70వ మండల స్థాయి తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల, భద్రాచలంలో మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు, పీడీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల నిర్వహణ, విద్యార్థుల భాగస్వామ్యం, క్రీడాకారుల ఎంపిక, పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన బాలికలకు, 19వ తేదీన బాలురకు మండల స్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు క్రీడా పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించాలని సూచించారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, పట్టుదల, జట్టుగా పనిచేసే లక్షణాలను పెంపొందించడంలో పాఠశాల స్థాయి నుంచి మండల, జిల్లా స్థాయి వరకు నిర్వహించే క్రీడా పోటీలు ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. పాఠశాల గేమ్స్ నిర్వహణకు మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి శ్రీనివాసరావు, కన్వీనర్‌గా స్కూల్ గేమ్స్ మండల స్థాయి ఆర్గనైజర్ పీవీ రమణ, పీడీ, ఎస్‌ఎన్‌ఎం, జెడ్పీహెచ్ఎస్ భద్రాచలం వ్యవహరించనున్నారు. కో-కన్వీనర్లుగా ఎం. రమేష్, ఫిజికల్ డైరెక్టర్, జీహెచ్ఎస్ భద్రాచలం, పి. సుజాత, ఫిజికల్ డైరెక్టర్, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల భద్రాచలం బాధ్యతలు నిర్వహించనున్నారు. కమిటీల కోఆర్డినేటర్‌గా రాజా శ్రీనివాస్ వ్యవహరించనుండగా, కమిటీ సభ్యులుగా భద్రాచలం మండలంలోని అన్ని పాఠశాలల ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లు వ్యవహరించనున్నట్లు ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జాన్సన్, పటేల్ లక్ష్మీనారాయణ, బాలేందర్, లీల, హేమలత, సాయన్న, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, కిషోర్, సీఆర్పీలు, సీసీహెచ్ఓ, మండలంలోని వివిధ పాఠశాలల హైస్కూల్, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.



## కాళోజీ జయంతి వేడుకలు

**యాదాద్రి భువనగిరి, 09-09-2026**

యాదాద్రి భువనగిరి జిల్లా గ్రంథాలయంలో ఘనంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి (తెలంగాణ భాషా దినోత్సవం) వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీ అవేజ్ ఉర్ రహమాన్ చిస్తీ గారు కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గారు మాట్లాడుతూ... తెలంగాణ భాషా వికాసానికి, ప్రజా చైతన్యానికి కాళోజీ నారాయణరావు చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. "అన్యాయాన్ని ఎదిరించినవాడే నా ఆరాధ్యుడు" అని చాటి చెప్పిన కాళోజీ, తన అక్షరాలతో ప్రజలను చైతన్య పరిచారని గుర్తుచేశారు. ఆయన రాసిన కవితలు, నినాదాలు సమాజంలో నిరంతరం స్ఫూర్తిని నింపుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న సీనియర్ కాంగ్రెస్ నాయకులు పోత్నక్ ప్రమోద్ గారు మాట్లాడుతూ... నిజాం వ్యతిరేక పోరాటంలో, గ్రంథాలయ ఉద్యమంలో కాళోజీ కీలక పాత్ర పోషించారని అన్నారు.



## కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు శాసనసభను అడ్డాగా మార్చొద్దు

**సూర్యాపేట, సెప్టెంబర్ 9: వుదయం ప్రతినిధి**

తెలంగాణ అసెంబ్లీలో ప్రజా సమస్యలను చర్చించకుండా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అడ్డాగా మార్చడం సిగ్గుచేటని, పెండింగ్ లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ ను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని జనసేన ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇంచార్జ్ మేకల సతీష్ రెడ్డి డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బుధవారం జనసేన జిల్లా నాయకులు ఏ.వి.రావు ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేకల సతీష్ రెడ్డి మాట్లాడుతూ పేదలకు ఇబ్బందికరంగా మారిన 22-ఏ భూముల సమస్యను పరిష్కరించాలని, ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. తాగునీరు లేక చెరువులు నిండకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు శ్రీనివాస్, జిలాని, శివ సాయి, భూక్యా సైదులు, శంకర్ నాయక్, మెలుగూరి సైదులు, వెంకట్, రాయల సతీష్, వెంకన్న, పసుపులేటి రామారావు, కాసర్ల వినయ్, షేక్ నజీర్ పాషా, లింగా నాయక్, మారోజు తిరుమల చారి, దండు మధు, వేముల విజయ్, సాయి స్వరూప్, పేరెల్లి గణేష్ పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ 2027 క్విజ్ పోటీలు

**మై భారత్ కేంద్ర జిల్లా యువజన అధికారి గౌతమ్ రెడ్డి**

**నల్గొండ జిల్లా**

**వుదయం వార్త ప్రతినిధి సెప్టెంబర్ 09**



నల్గొండ పట్టణ కేంద్రంలో భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ మై భారత్ కేంద్ర నల్లగొండ ద్వారా ఈరోజు విలేకర్ సమావేశం నిర్వహించడం జరిగింది. మై భారత్ కేంద్ర జిల్లా యువజన అధికారి గౌతమ్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ (VBYLD) 2027 ఒక ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి ఆన్లైన్ క్విజ్ పోటీలు 15 నుండి 29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత కోసం ఉద్దేశించిన ఈ కార్యక్రమం యొక్క ముఖ్య లక్ష్యం, రాజకీయ నేపథ్యం లేని సుమారు లక్ష మంది ప్రతిభావంతులైన యువతీ యువకులను గుర్తించి, 2047 నాటికి దేశాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేయాలనే 'వికసిత్ భారత్' లక్ష్యంలో వారిని భాగస్వాములను చేయడం. తెలుగుతో పాటు దేశంలోని 22 అధికారిక భాషల్లో అందుబాటులో ఉన్న ఈ ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొని, ఐదు దశల ఎంపిక ప్రక్రియ క్విజ్, వ్యాసరచన పోటీ, జిల్లా, రాష్ట్ర మరియు జాతీయ స్థాయి రౌండ్ల ద్వారా తుది విజేతలుగా నిలిచే యువతకు న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి డైలాగ్‌లో పాల్గొని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో దేశాభివృద్ధిపై తమ సరికొత్త ఆలోచనలను ప్రెజెంట్ చేసే సువర్ణావకాశం లభిస్తుంది ఆసక్తి గల అభ్యర్థులు 30 సెప్టెంబర్ 2026 లోపు ఉచితంగా రిజిస్టర్ చేసుకుని పాల్గొనవచ్చు. ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ రమణారెడ్డి , నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కోటయ్య . కొండ నాయక్, బాబురావు, ప్రసాద్, వెంకటేష్ యూత్ వాలంటీర్ నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అధ్వానంగా మారిన చర్ల వైకుంఠధామం

**బతికున్నవారికే చావు చూపిస్తున్న దుర్వాసన!**

**చర్ల, సెప్టెంబర్ 9: (వుదయం ప్రతినిధి)**



చర్ల సాయినగర్ కాలనీలో ఉన్న వైకుంఠధామం నిర్వహణ లేక అధ్వానంగా మారిందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాలను గౌరవంగా సాగనంపాల్సిన శ్మశానవాటికలో కనీస సౌకర్యాలు, పరిశుభ్రత లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తున్నారు. వైకుంఠధామం పక్కనే ఉన్న డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న పొగ, దుర్వాసన కారణంగా పరిసర ప్రాంతాల ప్రజలు అవస్థలు పడుతున్నారని చెబుతున్నారు. అంత్యక్రియలకు వచ్చే కుటుంబ సభ్యులు, బంధువులు సైతం దుర్వాసనను భరించలేక ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు. “చనిపోయిన వారిని గౌరవంగా సాగనంపాల్సిన చోట.. బతికున్నవారికే చావు చూపిస్తున్నారు” అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**గ్రావెల్ తోలకాలతో పెద్ద గోతులు.. ప్రజలకు ఇబ్బందులు**

వైకుంఠధామం పరిసరాల్లో గతంలో గ్రావెల్ తోలకాలు చేపట్టడంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి, అక్కడికి వచ్చే ప్రజలు నడవడానికి, వాహనాలు తీసుకెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. వర్షాలు కురిసిన సమయంలో గోతుల్లో నీరు నిలిచి పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పెరిగిపోయిన పిచ్చిమొక్కలు.. స్థలం లేక రోడ్డుపైనే దహన సంస్కారాలు!**

వైకుంఠధామం పరిసరాల్లో మొక్కలు, పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో శ్మశానవాటికలో అందుబాటులో ఉన్న స్థలం తగ్గిపోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అంత్యక్రియలు నిర్వహించేందుకు సరైన స్థలం లేకపోవడంతో కొన్ని సందర్భాల్లో రోడ్డుపైనే దహన సంస్కారాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది మృతుల పట్ల గౌరవానికి భంగం కలిగించడమే కాకుండా, అంత్యక్రియలకు వచ్చే ప్రజలకు కూడా తీవ్ర ఇబ్బందికరంగా మారిందని పేర్కొంటున్నారు. వైకుంఠధామం పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడం, డంపింగ్ యార్డు నుంచి వస్తున్న పొగ, దుర్వాసనపై సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైకుంఠధామాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, పెద్ద గోతులను పూడ్చి, పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి, అంత్యక్రియలకు సరిపడా స్థలాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న పొగ, దుర్వాసనకు శాశ్వత పరిష్కారం చూపి, వైకుంఠధామాన్ని పరిశుభ్రంగా, ప్రజలకు అనుకూలంగా తీర్చిదిద్దాలని చర్ల ప్రజలు అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

## గణేష్ ఊరేగింపుల్లో డీజేలకు అనుమతి లేదు

**సీఐ టీ.రాము**

**చండూరు, సెప్టెంబర్ 9(వుదయం):**



ఈ నెల 14 నుంచి ప్రారంభం కానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలంతా శాంతియుత, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని చండూరు సీఐ టీ. రాము సూచించారు. పండుగ సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. బుధవారం చండూరు పోలీస్ స్టేషన్‌లో గణేష్ ఉత్సవాల నిర్వహణ, ముందస్తు భద్రతా ఏర్పాట్లపై ఉత్సవ కమిటీ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఉత్సవాల వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మండప నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా నిమజ్జనం, ఊరేగింపుల సమయాల్లో డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో చండూరు మున్సిపల్ ఛైర్మన్ కోడి శ్రీనివాసులు, ఎస్ఐ శివకుమార్, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ శంకరయ్య, మున్సిపల్ పాలక వర్గ సభ్యులు, మండల పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు, వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు పాల్గొన్నారు. వీరితో పాటు పోలీస్ కానిస్టేబుళ్లు కృష్ణ కౌశిక్, రాజు, అనిల్, కిరణ్ కుమార్, సైదులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రాచీన వంటకాలను విద్యార్థులు తయారీ

**యాదాద్రి భువనగిరి 09.09.2026**

తెలంగాణ ప్రభుత్వం పటిష్టాత్మకంగా చేపడుతున్న యుత పర్యాటక కార్యాక్రమంలో భాగంగా స్థానిక ఎలిమినేటి లక్ష్మమ్మ నర్సారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, భువనగిరి ఆధ్వర్యంలో 9 రోజున భువనగిరి ఖిల్లా ప్రతిష్టతను తెలియజేస్తూ కళాశాల నుండి ఖిల్లా వరకు ర్యాలి నిర్వహించడం జరిగినది.

తదుపరి తెలంగాణ ప్రాచీన వంటకాలను విద్యార్దులు తయారు చేసి భువనగిరి ఖిల్లా ముఖ ద్వారం వద్ద ఫుడ్ స్టాల్ ఏర్పాటు చేసి మన ప్రాచీన వంటకాల యొక్క ప్రాముఖ్యతను సందర్శకులకు తెలియజేసారు. భువనగిరి ఖిల్లా ప్రాముఖ్యతను తెలియజేస్తూ సాంస్కృతిక కార్యాక్రమాలు నిర్వహిస్తూ మన పర్యాటక కేంద్రాల గురించి తెలియజేసారు.




కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి విజయ లక్ష్మి గారు మాట్లాడుతూ ఇలాంటి కార్యాక్రమాల ద్వారా మన తెలంగాణ చరిత్రను యువ తరానికి పరిచయం చేస్తూ విద్యార్దులలోని సృజనాత్మకతను వెలికితీయవచ్చు అని తెలిపారు. ఇట్టి కార్యాక్రమంలో కళాశాల విద్యార్దులు, ప్రిన్సిపాల్ మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

# వినాయక చవితి పండుగ ప్రశాంత వాతావరణంలో జరగాలి

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

**యాదాద్రి భువనగిరి, 09.09.2026**

వినాయక చవితి పండుగను భక్తి శ్రద్ధలతో,ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. బుధవారం రోజున కలెక్టరేట్ సమావేశం మందిరంలో గణేష్ ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, అడిషనల్ ఎస్పీ లక్ష్మి నారాయణ, లతో కలిసి సమీక్షించారు. ముందుగా శాంతి సమావేశ కమిటీ సభ్యులు తమ సూచనలు, సలహాలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..ఈ నెల 14న వినాయక చవితి పండుగ సందర్భంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, భక్తులకు, ప్రజానీకానికి ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ఏర్పాట్లు చేయాలని,వినాయకుల నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని, నిమజ్జనానికి అవసరమైన రూట్ మ్యాపులు సిద్ధం చేసుకోవాలని, అవసరమైన రూట్లలో రోడ్ల మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని తెలిపారు. వినాయక చవితి నిమజ్జనానికి చెరువుల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఫస్ట్ ఎయిడ్ కిట్లను మెడికల్ ఆఫీసర్, సిబ్బందితో బృందాలను ఏర్పాటు చేసి అందుబాటులో ఉంచాలన్నారు. వినాయక నిమజ్జన స్థలాల వద్ద భారీ క్రేన్లను ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ శాఖ అధికారుల సహకారంతో మండపాలకు విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలన్నారు. గణేష్ నవరాత్రులు మొదలుకొని నిమర్జనం పూర్తయ్యే వరకు అగ్నిమాపక శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. మండపాలలో అనుకోకుండా అగ్ని ప్రమాదాలు జరిగితే ఎలాంటి నివారణ చర్యలు తీసుకోవాలి అనే వాటి మీద అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఘనంగా పండగ వాతావరణంలో జరుపుకునేందుకు సహాయ సహకారాలు అందివ్వాలని తెలిపారు.

జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ మాట్లాడుతూ... గణేష్ పండుగను శాంతియుతంగా జరుపుకునేందుకు విగ్రహాన్ని పెట్టుకునే ప్రతి ఒక్కరు ఆన్లైన్ కమిటీ సభ్యులు, గణేష్ వివరాలను నమోదు చేయాలని అన్నారు. ఆన్లైన్ నమోదు చేసిన వివరాలు బట్టి పోలీసు బందోబస్తు ఏర్పాట్లు పటిష్టంగా చేయడం జరుగుతుందన్నారు. రాత్రి సమయంలో మండపాల వద్ద ముగ్గురు వాలంటీర్లు ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. గణేష్ మండపాలు రోడ్లను బ్లాక్ చేసి పెట్టడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయి కాబట్టి రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసుకోవాలన్నారు.ప్రతి గణేష్ మండపం వద్ద అవసరమైన బందోబస్తు ఏర్పాటు, గణేష్ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన గోడ పత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు.మట్టి గణపతుల వినియోగంతో నీటి కాలుష్యం తగ్గడంతో పాటు ప్రకృతి సమతుల్యతను కాపాడవచ్చని, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జయమ్మ, ఆర్డీవో లు కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి ,భువనగిరి మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి, సంఘం సభ్యులు, ఉత్సవ కమిటీల సభ్యులు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు ,తహసిల్దారులు పాల్గొన్నారు.



## మండల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

**ప్రత్యేక అధికారి కుటుంబరావు**

**నిజాంసాగర్ సెప్టెంబర్ 09 (వుదయం ప్రతినిధి) :**



గ్రామాల అభివృద్ధికి అధికారులు, సర్పంచులతో కలిసి సమన్వయంతో పనిచేయాలని మండల ప్రత్యేక అధికారి కుటుంబరావు సూచించారు. నిజాంసాగర్ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల స్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కుటుంబరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండలంలోని 13 గ్రామ పంచాయతీల సర్పంచులు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి కుటుంబరావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై అధికారుల నుండి నివేదికలను స్వీకరించి సమీక్షించారు. ప్రభుత్వ పథకాలపై గ్రామీణ ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కుటుంబరావు ఆదేశించారు. గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని, స్థానికంగా ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కుటుంబరావు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శివకృష్ణ, అచ్చంపేట ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు నరసింహారెడ్డి, ఎంఈఓ తిరుపతిరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి ఆచరిత, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సంకు లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడు బొజ్జ అంజయ్య, కేతావత్ నారాయణ,వడ్ల బ్రహ్మం,సాతేలి పోచయ్య,మోహన్, గరబోయిన చంద్రకళ,నర్మల రాజు,పాటు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కాలోజీ నారాయణరావు జయంతి

**దండేపల్లి:సెప్టెంబర్ 9 (వుదయం ప్రతినిధి)**



దండేపల్లి మండలం వెల్గనూర్ పాఠశాలలో తెలంగాణ భాషా దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు బొలిశెట్టి రాజన్న మాట్లాడుతూ కాలోజీ నారాయణరావు తన కలం, గళంతో తెలంగాణ ప్రజా చైతన్యానికి,భాషా వికాసానికి దిశానిర్దేశం చేశారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయనిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జప్తి జానకంపల్లిలో గంగమ్మ దేవి వార్షికోత్సవం

**నాగిరెడ్డిపేట్, వుదయం**



నాగిరెడ్డిపేట్ మండలం జప్తి జానకంపల్లి గ్రామంలో గంగమ్మ దేవి ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి, అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచే గ్రామంలోని భక్తులు ఆలయానికి చేరుకుని గంగమ్మ దేవిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా ఋగ్వేద పండితులు శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో పుణ్యాహవచనం, గణపతి హోమం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం గంగమ్మ దేవికి అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.వార్షికోత్సవంలో భాగంగా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లను చేపట్టి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, యువకులు, ముదిరాజ్ సంఘం పెద్దలు, గ్రామస్థులు ఉత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామస్థులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## టైగర్ జోన్ రద్దుకై జన్నారంలో బంద్ సంపూర్ణం

**జన్నారం,సెప్టెంబర్ 9 (వుదయం విలేఖరి)**

సామాజిక ఉద్యమకారుడు శ్రీరాముల భూమా చారి నాయకత్వంలో చేపట్టిన 'టైగర్ జోన్ వద్దు.. మండలాభివృద్ధి ముద్దు' నిరసన దీక్షలు బుధవారం 18వ రోజుకు చేరుకున్నాయి. టైగర్ జోన్ ప్రతిపాదన వల్ల జన్నారం మండల అభివృద్ధి కుంటుపడుతుందనే ఆందోళనతో ప్రారంభమైన ఈ పోరాటానికి ప్రజల నుండి అపూర్వ స్పందన లభిస్తోంది.భూమా చారి దీక్షకు మద్దతుగా జన్నారం మండలంలోని అన్ని వర్గాల ప్రజలు, వ్యాపారులు, ప్రజా సంఘాలు మరియు రాజకీయ పార్టీల నాయకులు ఏకమై సంపూర్ణ బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ బంద్ పిలుపుతో జన్నారం మండల కేంద్రంలో వాణిజ్య సముదాయాలు, దుకాణాలు మరియు వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా మూతపడ్డాయి. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ప్రాంతీయ ప్రయోజనాల కోసం విద్యాసంస్థలు కూడా ఈ బంద్‌లో భాగస్వామ్యమయ్యాయి. మండల పరిధిలోని అన్ని రాజకీయ పార్టీలు తమ సైద్ధాంతిక విభేదాలను పక్కనబెట్టి, ఏకతాటి పైకి వచ్చి దీక్షా శిబిరాన్ని సందర్శించి తమ పూర్తి సంఘీభావాన్ని ప్రకటించాయి.

ఈ సందర్భంగా ఉద్యమ నాయకులు మాట్లాడుతూ కవ్వాల్ టైగర్ జోన్ నిబంధనల వల్ల మండలంలో ఎలాంటి మౌలిక వసతుల కల్పన, రహదారుల విస్తరణ మరియు సమగ్ర అభివృద్ధి సాధ్యపడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టైగర్ జోన్ నిబంధనలను సవరించి జన్నారం మండల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటే రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరిన్ని రూపాల్లో తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ భాషా దినోత్సవం



**జన్నారం,సెప్టెంబర్ 9 (వుదయం విలేఖరి)**

జన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ భాషా దినోత్సవం – కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బుధవారం రోజున కళాశాల ప్రిన్సిపల్ ఎం.వి జిత్ కుమార్ ఆధ్వర్యంలో కాలేజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 9 కాళోజీ జన్మదినాన్ని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. కాళోజీ పూర్తి పేరు రఘువీర్ నారాయణ లక్ష్మీకాంత్ శ్రీనివాస రామానుజ కాళోజీ అని తెలిపారు.తెలుగు అధ్యాపకులు మాట్లాడుతూ "అన్య భాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు సకిలించు ఆంధ్రుడా చావవెందుకురా", "అక్షర రూపం దాల్చిన ఒక సిరా చుక్క లక్షల మెదళ్లకు కదలిక", "పుట్టుక నీది చావు నీది బ్రతుకంతా దేశానిది", "అన్యాయాన్ని ఎదిరిస్తే నా గొడవకు సంతృప్తి, అన్యాయాన్ని ఎదిరించిన వాడే నాకు ఆరాధ్యుడు" అనే కాళోజీ సూక్తులను వివరించి బోధించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బాపూరావు, సాయికుమార్,రవీందర్, నాగేశ్వరరావు,మోహన్, దేవేందర్,శశికళ,బర్ల కరుణాకర్ స్వరూప, కుమార స్వామి, శివ రాం, అ భిలాష్, కొమురయ్య,అనిత తదితరులు పాల్గొన్నారు.

## సాదాసీదాగా దండేపల్లి మండల సర్వసభ్య సమావేశం

**దండేపల్లి: సెప్టెంబర్ 09 (వుదయం విలేకరి)**



దండేపల్లి మండలం సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల ప్రత్యేక అధికారి దుర్గాప్రసాద్ అధ్యక్షతన సాదాసీదాగా జరిగింది ముందుగా ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రమడానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు .ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్,తహసీల్దార్ రోహిత్ దేశ్పాండే,సహకార సంఘం అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్,ఎంపీఓ ప్రసాద్ ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## పవర్ లిఫ్టింగ్ ప్రపంచ వేదికపై భారత్‌కు పతకమే లక్ష్యం

- అమెరికాలో జరిగే వరల్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశం తరపున భద్రాచలం క్రీడాకారుడు డి.వి. శంకరరావు
- క్రీడా శాఖ ఆర్థిక సహాయం అందించాలని క్రీడాభిమానుల విజ్ఞప్తి

**భద్రాచలం 9/9/26 వుదయం ప్రతినిధి**

పవర్ లిఫ్టింగ్ ప్రపంచ వేదికపై భారతదేశానికి పతకం సాధించడమే లక్ష్యంగా 74 ఏళ్ల వయసులోనూ పట్టుదలతో సాధన చేస్తున్న భద్రాచలం సిటీ స్టైల్ జిమ్‌కు చెందిన క్రీడాకారుడు శ్రీ డి.వి. శంకరరావు అంతర్జాతీయ పోటీలకు సిద్ధమవుతున్నారు. అమెరికాలోని నెవాడా రాష్ట్రం రెనో నగరంలో అక్టోబర్ 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ (IPF) ఆధ్వర్యంలో నిర్వహించనున్న వరల్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్స్–2026లో మాస్టర్–4, 74 కేజీల విభాగంలో భారతదేశం తరపున ఆయన ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ నేపథ్యంలో అమెరికా వెళ్లి అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ తెలంగాణ క్రీడా శాఖకు ప్రతిపాదనలు అందాయి. ఈ మేరకు ఈ రోజు ఉదయం గౌరవ పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖ మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి గారిని మర్యాదపూర్వకంగా కలిసి శంకరరావు అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన విషయాన్ని, ఆయన సాధించిన జాతీయ స్థాయి రికార్డులు, క్రీడా ప్రస్థానం, అమెరికాలో జరగనున్న ప్రపంచ స్థాయి పోటీల వివరాలను తెలియజేశారు. క్రీడాకారుడి ప్రతిభను, వయసును, అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని పరిగణనలోకి తీసుకున్న మంత్రి సానుకూలంగా స్పందించి సంబంధిత క్రీడా శాఖ అధికారులకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మంత్రివర్యుల ఆదేశాలు, ఎండార్స్‌మెంట్ మేరకు హైదరాబాద్‌లోని ఎల్.బి. స్టేడియంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి సోనీ బాలదేవి గారిని శ్రీ డి.వి. శంకరరావు, ఆయన కోచ్ శ్రీ జి.వి. రామిరెడ్డి గారు ప్రత్యక్షంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సిఫార్సు చేసిన ఉత్తర్వుల ప్రతిని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ వీసీ అండ్ ఎండీకి అందజేశారు. అనంతరం రాబోయే వరల్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు సంబంధించిన పూర్తి వివరాలను, ఇప్పటివరకు శంకరరావు సాధించిన జాతీయ స్థాయి రికార్డులను, అంతర్జాతీయ పోటీలకు ఆయనకు లభించిన ఎంపికను అధికారులు సమగ్రంగా వివరించారు. అమెరికాలోని నెవాడా రాష్ట్రం రెనో నగరంలో అక్టోబర్ 15 నుంచి 24 వరకు జరిగే వరల్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్స్–2026లో ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన ప్రతిభావంతులైన పవర్ లిఫ్టర్లు పాల్గొననున్నారు. ఈ ప్రతిష్టాత్మక పోటీల్లో మాస్టర్–4 విభాగంలోని 74 కేజీల కేటగిరీలో శ్రీ డి.వి. శంకరరావు భారతదేశం తరపున బరిలోకి దిగనున్నారు. అంతర్జాతీయ వేదికపై భారత త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగురవేయాలనే లక్ష్యంతో ఆయన ప్రస్తుతం ప్రత్యేక శిక్షణ, సాధన కొనసాగిస్తున్నారు. కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీ భోగాల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ, కోచ్ శ్రీ జి.వి. రామిరెడ్డి, అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారుడు శ్రీ డి.వి. శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

## మండల సమన్వయ సమీక్ష సమావేశం

**ధర్మసాగర్ సెప్టెంబర్ 09 (వుదయం ప్రతినిధి)**



ఈరోజు ధర్మసాగర్ మండల సమన్వయ సమీక్ష సమావేశం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని వివిధ శాఖల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాల అమలు, గ్రామాల్లో చేపడుతున్న పనుల పురోగతిపై సమావేశంలో సమీక్షించారు. జలసిరి కార్యక్రమంపై సమీక్ష: జలసిరి కార్యక్రమం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై డీఆర్‌డీఓ అసిస్టెంట్ పీడీ లక్ష్మీ ప్రసన్న సమీక్షించారు. గ్రామాల వారీగా భూగర్భ జలాల పరిస్థితిని అధికారులు వివరించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టేలా నిర్మాణాలు చేపట్టడం, నీటి నిల్వలను పెంచడం, నీటి సంరక్షణ చర్యలను విస్తృతంగా చేపట్టడంపై చర్చించారు. విబిజి రాంజీ పథకం కింద చేపడుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. గ్రామాల అవసరాలకు అనుగుణంగా పనులను గుర్తించి, వాటిని ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. భూగర్భ జలాల పెంపునకు ప్రణాళిక: ప్రతి గ్రామంలో భూగర్భ జలాల పెంపునకు సమగ్ర ప్రణాళిక రూపొందించి పనులు చేపట్టాలని లక్ష్మీ ప్రసన్న సూచించారు. వర్షపు నీటిని వృథా కాకుండా సంరక్షించడం ద్వారా భూగర్భ జలాలను పెంచేందుకు ప్రజలను భాగస్వామ్యం చేయాలని తెలిపారు. జలసిరి కార్యక్రమం లక్ష్యాలను సమర్థవంతంగా సాధించేలా అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భావ్‌సింగ్, వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

## సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం

**ఎంపీడీవో ప్రవీణ్ కుమార్**

**బెజ్జూర్ (వుదయం ప్రతినిధి)**



సర్పంచులు, ఉప సర్పంచులు మరియు గ్రామ ంచాయతీ కార్యదర్శులు కలిసి సమన్వయంతో పనిచేసి పంచాయతీల అభివృద్ధికి పాటుపడాలని మండల అభివృద్ధి అధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన సర్పంచులు ఉప సర్పంచులు కార్యదర్శులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు అధికారులు కలిసి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పారిశుద్ధ్యం ,త్రాగునీరు, ఇందిరమ్మ ఇల్లు ,బి వి జి రాంజీ ప్రణాళికల తయారీ, కొత్త పింఛన్ దరఖాస్తుల స్వీకరణ ,వెరిఫికేషన్, గ్రామపంచాయతీల ఆదాయ వ్యాయాలపై తదితర అంశాలపై చర్చించడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు. ఈ సమావేశంలో ఏపీ ఓ రాజన్న ,ఏ ఈ ఈ శ్రీనివాస్, గ్రామపంచాయతీల కార్యదర్శులు, సర్పంచులు, ఉప సర్పంచులు పాల్గొన్నారు.

## ఏరియా హాస్పిటల్‌లో పోషక ఆహార పరిరక్షణపై అవగాహన సదస్సు

**మంచిర్యాల /రామకృష్ణాపూర్/సెప్టెంబర్ 09(వుదయం ప్రతినిధి)**



ఏరియా హాస్పిటల్ రామ క ృష్ణాపూర్‌లో DYCMO (Admin) డా. ఎం. మధు కుమార్ ఆధ్వర్యంలో పోషక ఆహారం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన సదస్సు నిర వ్రహించారు. ఈ సందర్భంగా మధుమేహం, కిడ్నీ వ్యాధిగ్రస్తులు వైద్యుల సూచనల మేరకు ఆహార నియమాలు పాటించాలని, జంక్‌ఫుడ్, అధిక చక్కెర పదార్థాలు, కూల్‌డ్రింక్స్‌కు దూరంగా ఉండాలని డా. మధు కుమార్ సూచించారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని కోరారు.కార్యక్రమంలో సీనియర్ పీఓ మదార్ సాహెబ్, మాట్రాన్ టి.వి. విజయలక్ష్మి , శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పారామెడికల్ సిబ్బంది, యూనియన్ నాయకులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



## మురికి కాలువ నిర్మాణ పనులు ప్రారంభం

**యాదాద్రి భువనగిరి 09-09-2026**

భువనగిరి పట్టణంలోని స్థానిక 1వ వార్డు యందు రూ.2.00 లక్షలు మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులతో మురికి కాలువ నిర్మాణ పనులకు గౌరవ చైర్ పర్సన్ శ్రీమతి తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ గారు కొబ్బరికాయలు కొట్టి పనులను ప్రారంభించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో గౌరవ వార్డు సభ్యులు శ్రీమతి ఏలే భువనేశ్వరి శివ కుమార్ గారు, శ్రీమతి గంజి శ్రీవాణి గణేష్ గారు, శ్రీ నాకోటి నగేష్ గారు, అధికారులు MAEs, వార్డు ప్రజలు, నాయకులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నూతన ఎక్సైజ్ సీఐని మర్యాదపూర్వకంగా కలిసిన గౌడ సంఘం బాధ్యులు

**ఖానాపురం, సెప్టెంబర్ 9 (వుదయం ప్రతినిధి):**

నర్సంపేట ఎక్సైజ్ సీఐగా నూతనంగా విధుల్లో చేరిన జయశ్రీని ఖానాపురం గౌడ సంఘం అధ్యక్షుడు గంగాపురం రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో గౌడ సంఘం బాధ్యులతో కలిసి నూతన సిఐని మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే అందించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం క్యాషియర్ బుడిగ మనోహర్, సంఘం సభ్యులు పూల్లూరి ఎల్లగౌడ్, మచ్చిక సదానందంగౌడ్, పుల్లూరి రాజుగౌడ్, మడత బిక్షపతిగౌడ్ పాల్గొన్నారు.

## కిరాణా షాపులో నగదు చోరీ

**బెజ్జూర్ (వుదయం ప్రతినిధి)**

బెజ్జూర్ మండల కేంద్రంలోని ఓ కిరాణా షాపులో గుర్తుతెలియని వ్యక్తి చోరీకి పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చిందని ఎస్సై సర్తజ్ పాషా ఒక ప్రకటనలో తెలిపారు . ఆయన కథనం ప్రకారం బెజ్జూర్ గ్రామానికి చెందిన వ్యాపారి రాచకొండ స్వప్నిల్, కిరాణా షాప్ ను ఈ నెల 8 రాత్రి సుమారు 8:00 గంటలకు మూసివేసి, షాపు పైన ఉన్న నివాసానికి వెళ్లారు. మరుసటి రోజు ఈనెల 9న ఉదయం సుమారు 7 గంటలకు షాపును తెరిచినారు. గల్లాపెట్టిలో నగదు కనిపించకపోవడంతో పరిశీలించారు. అదే సమయంలో షాపులో పనిచేసే రాజు వెనుక వైపున ఉన్న గోదాం కిటికీ పగిలి ఉండటంతో పాటు, కిటికీకి అమర్చిన గ్రిల్స్ తొలగించి ఉండటాన్ని గుర్తించాడు. దీంతో గుర్తుతెలియని వ్యక్తి కిటికీ గ్రిల్స్ తొలగించి షాపులోకి ప్రవేశించి, గల్లాపెట్టెలో ఉన్న సుమారు రూ.10 వేలు నగదును చోరీ చేసి తీసుకెళ్లినట్లు అనుమానం వ్యక్తం చేశాడు . షాపులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించగా, ముఖానికి మాస్క్ ధరించిన గుర్తుతెలియని వ్యక్తి షాపులోకి ప్రవేశించి గల్లాపెట్టెను తెరిచి అందులోని నగదును తీసుకెళ్లిన దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదైనట్లు గుర్తించారు. నిందితుడిని త్వరలో గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## రైతు బీమా పథకం పునరుద్ధరణ

**నాగిరెడ్డిపేట్,వుదయం**

రైతు బీమా పథకాన్ని పునరుద్ధరించినట్లు నాగిరెడ్డిపేట్ మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్ తెలిపారు. 18 నుంచి 59 ఏళ్లలోపు రైతు బీమా కలిగిన రైతులు 2026 ఆగస్టు 14 తర్వాత మృతి చెంది ఉంటే, వారి కుటుంబ సభ్యులు సంబంధిత గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న కుటుంబాలకు రైతు బీమా ప్రయోజనం అందుతుందని తెలిపారు.

## దళితులను అవమానిస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదు

**బీఆర్ఎస్ నేతల తీరుపై మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల యాదగిరి**

**నల్గొండ జిల్లా**

**వుదయం వార్త ప్రతినిధి సెప్టెంబర్ 09**



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో దళితుల ఓట్లతో పదేళ్లు అధికారాన్ని అనుభవించిన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నాయకులు, అదే దళితులు తమ హక్కుల కోసం రోడ్లపైకి వస్తే అవమానించే స్థాయికి దిగజారడం వారి దళిత వ్యతిరేక వైఖరికి నిదర్శనమని మాల మహానాడు యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల యాదగిరి తీవ్రంగా మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దళిత, గిరిజనులు ఎన్నో త్యాగాలు చేశారని, ఆ త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణలో దళితుల ఓట్లతో అధికార పీఠాన్ని అధిరోహించిన బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు అదే దళిత సమాజాన్ని చిన్నచూపు చూడటం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. దళితులు తమకు వ్యతిరేకంగా నినాదాలు చేశారనే కారణంతో వారిని అవమానించేలా వ్యవహరించడం, దళితులు రోడ్లమీదికి వచ్చారనే కారణంతో రోడ్డుపై పసుపు నీళ్లు చల్లడం వంటి చర్యలు ప్రజాస్వామ్య విలువలకు, మానవత్వానికి, సామాజిక సమానత్వానికి విరుద్ధమని యాదగిరి అన్నారు. ఇలాంటి కుసంస్కార చర్యల ద్వారా దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇది రాచరిక వ్యవస్థ కాదని, ప్రజాస్వామ్య భారత దేశమని ఆయన గుర్తుచేశారు. దళిత సమాజాన్ని తక్కువగా అంచనా వేయడం ఏ రాజకీయ పార్టీకి కూడా మంచిది కాదని హెచ్చరించారు. దళితుల ఐక్యతను తక్కువగా అంచనా వేస్తే రాజకీయంగా తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని అవమానించిన ప్రతి చర్యకు ప్రజాస్వామ్య పద్ధతిలో తగిన సమాధానం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయనీ తెలిపారు.

## సాగర్ జలాలతో చెరువులను నింపాలి

**సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు**

**మధిర, సెప్టెంబర్ 9, వుదయం, ప్రతినిధి:**



ఎలినినో ప్రభావం వలన ఈ ఖరీఫ్ సీజన్ లో అనుకున్న మోతాదులో వానలు కురవటం లేదని, వర్షాభావ పరిస్థితులుఅనుకూలించక పోవడంతో రైతులు వేసిన పంటలకు పశువులకు ప్రజలకు త్రాగునీటికి ఎద్దడి లేకుండా సాగర్ జలాలు విడుదల చేసి చెరువులను కుంటలను నింపాలని సిపిఎం పార్టీ మధిర నియోజకవర్గ డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెం రామిశెట్టి పుల్లయ్య భవనం నందు ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నల్లమోతు హనుమంతరావు అధ్యక్షతన నిర్వహించారు. తొలుత సిపిఎం పార్టీ మాజీ కేంద్ర కమిటీ కార్యదర్శి దివంగత సీతారాం ఏచూరి రెండవ వర్ధంతి నిర్వహించారు.సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ ఈ సంవత్సరం అనుకున్న స్థాయిలో వర్షాలు కురవక పోవటం వలన పొలాలలో గల బోర్లు ఎండిపోతున్నాయని భూగర్భ జలాల పెంపునకు ప్రభుత్వం సాగర్ జలాల ద్వారా చెరువులను, కుంటలను నింపాలని అన్నారు.వర్షాలు కురవని వాతావరణ శాఖ ముందస్తు సమాచారం మేరకు నీటి ఆధారం లేని పొలాల రైతులు పంటలు వేయలేదని అన్నారు.ఈ సంవత్సరం వరి పంట నీటి ఆధారం కలిగిన బోర్ల కింద మాత్రమే నాట్లు వేశారని రైతులు వేసిన పంటలు ఎండిపోకుండా ఉండేందుకు వెంటనే సాగర్ జలాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.వరి పంట చాలా తక్కువగా పండే అవకాశం ఉందని నాట్లు వేసిన వరి పంట పండేందుకు సాగర్ జలాలు విడుదల చేయాలని ప్రభుత్వాన్నిహెచ్చరించారు.మెట్ట భూములలో రైతులు మొక్కజొన్న పత్తి మిర్చి మునగ బొప్పాయి తదితర పంటలకు బోర్లు సహకరించడం లేదని రైతుల వాపోతున్నట్లు తెలిపారు. రైతులు వేసిన పంటలు కాపాడేందుకు ప్రభుత్వం తక్షణమే సాగర్ జలాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య,మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్ రావు,

గామాసు జోగయ్య, దూదిగం బసవయ్య, షేక్ నాగుల్ మీరా, షేక్ లాల్ సాహెబ్, నాగులవంచ వెంకట రామయ్య, నక్కా పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

## కోడి పంద్యాలు వేసే వ్యక్తులపై పోలీసుల దాడులు రెండు వాహనాలు కత్తులు కోళ్లు స్వాధీనం

**స్థానిక ఎస్ఐ జి రామ్మోహన్**

**ఖానాపురం, సెప్టెంబర్ 9 (వుదయం ప్రతినిధి):**




మండల కేంద్రంలోని కోడిపంద్యాలు వేస్తున్నారనె సమాచారం మేరకు స్థానిక ఎస్ఐ జి రామ్మోహన్ పోలీస్ బృందంతో దాడులు చేయగా కోడి పంద్యాలు వేసే వ్యక్తులు పరారి పాకాగా రెండు టూ వీలర్ వాహనాలు, రెండు కత్తులు, రెండు కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్ఐ జి రామ్మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్ఐ మాట్లాడుతూ మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలోని పేకాటాడిన గుడుంబాను కాసిన అమ్మిన కోడి పంద్యాలు వేసిన అట్టి వ్యక్తులపై పీడియాకు ప్రవేశపెడతామని హెచ్చరిస్తూ, పోలీసులను చూసి కోడి పంద్యాలు వేసే వ్యక్తులు పారిపోయారని తెలుపుతూ, అట్టి వ్యక్తులను గుర్తించి పట్టుకున్న తదుపరి పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్ఐ తెలిపారు.



## ఘనంగా కాళోజీ జయంతి

**నివాళులు అర్పించిన పర్వతగిరి మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అల్లం దాస్ బిక్షపతి**

**పర్వతగిరి , సెప్టెంబర్ 9 ( వుదయం ప్రతినిధి ):**

కాళోజి జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొంకపాక లో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పర్వతగిరి మండల విద్యాధికారి అల్లం దాస్ బిక్షపతి అధ్యక్షత వహించారు వారు మాట్లాడుతూ తెలుగు భాష గొప్పదనాన్ని వివరిస్తూ మాతృ భాషను ఎప్పుడూ మనం నిర్లక్ష్యం చేయవద్దని విద్యార్థులు అక్షర దోషాలు లేకుండా రాయడం, తప్పుల్లేకుండా చదవడం, అనే సామర్థ్యాలను పెంపొందించుకోవాలని మన తెలంగాణ భాష, యాసను ,మన సంస్కృతిని పరిరక్షించుకోవాలని కోరారు అదేవిధంగా కాళోజి గురించి అతని గొప్పదనం గురించి కూడా వివరించారు .ఈ కార్యక్రమంలో తెలుగు భాష ఉపాధ్యాయులు డాక్టర్ అడ్లూరి వెంకటేశ్వర్లు కాళోజి జీవితం, సాహిత్యం, తెలంగాణ భాష ,యాస గొప్పతనం గురించి సుదీర్ఘంగా తన ఉపన్యాసంలో పేర్కొన్నారు అదేవిధంగా ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు జే. లింగమూర్తి, ఎం విశ్వనాథ శర్మ , వెనిశెట్టి కృష్ణమూర్తి , ఎండి హఫీజ్ , ఇన్స్ట్రక్టర్ లలిత, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అలరించారు

# ఎస్ఐఆర్ ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్
- నిర్మాణంలో ఉన్న భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

జగిత్యాల కోరుట్ల సెప్టెంబర్ 09 (ఉదయం ప్రతినిధి)

జగిత్యాల రూరల్ మండలం కల్లెడ తకళ్ల పెల్లి గ్రామాల్లో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు ఎస్ఐఆర్ ఫారాల్లో నమోదైన వివరాల్లో తప్పులను ఎలా సరి చేస్తున్నారు ఇప్పటివరకు ఎంతమంది ఓటర్లకు నోటీసులు జారీ చేశారు ఇంకా ఎన్ని నోటీసులు పెండింగ్‌లో ఉన్నాయి ఎన్ని కేసుల్లో సవరణలు పూర్తయ్యాయి తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు ఓటర్ల జాబితాలో ఇంటిపేరు ఓటరు పేరు ఫొటో తదితర వివరాల్లో తేడాలు ఉన్నట్లయితే వాటిని నిబంధనల ప్రకారం సరి చేయాలని అధికారులకు సూచించారు ఓటర్ల జాబితాలో అర్హత కలిగిన వారి పేర్లు తొలగిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు ఫొటోల్లో తప్పులు ఉంటే వాటిని సరి చేయడంతో పాటు పేరు లేదా ఇంటిపేరులో మార్పులు అవసరమైతే సంబంధిత ఆధారాలను పరిశీలించి సవరణలు చేయాలని సూచించారు ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా జారీ చేసిన నోటీసుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు నోటీసులు జారీ చేసిన అనంతరం సంబంధిత ఓటర్లకు విచారణ (హియరింగ్) నిర్వహిస్తున్నారా ప్రతిరోజూ ఎంతమంది విచారణకు హాజరవుతున్నారు వారి స్పందన ఎలా ఉందనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు విచారణకు ఓటర్లు హాజరవుతున్న తీరు ప్రజల స్పందనపై అధికారులు వివరించారు విచారణ ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని నోటీసులు అందుకున్న ఓటర్లు విచారణకు హాజరవుతున్నారని తెలిపారు అనంతరం కల్లెడ గ్రామంలో నిర్మిస్తున్న విపో భవనం తకళ్లపెల్లి గ్రామం లో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనం.విపో భవనం పనులను ఆకస్మికంగా పరిశీలించి నిర్మాణ పనులను నాణ్యతతో వేగవంతం చేసి భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్ తహసీల్దార్ హకీం పంచాయతీ రాజ్ శాఖ అధికారులు ఎంపిడివో రమాదేవి స్థానిక నాయకులు సూపర్ వైజర్ లు బిఎల్ఓ లు తదితరులు పాల్గొన్నారు



## ప్రజల్లో చైతన్యాన్ని తీసుకొచ్చిన కాళోజీ కృషి



**అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు**

పెద్దపల్లి, సెప్టెంబర్ 09 (ఉదయం ప్రతినిధి)

ప్రజల్లో సామాజిక, రాజకీయ చైతన్యాన్ని తీసుకొచ్చిన కాళోజీ కృషి మరువలేనిదని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని అధికారికంగా నిర్వహించిన కాళోజీ నారాయణరావు జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ, సామాజిక సమస్యలపై నిర్మోహమాటంగా, నిక్కచ్చిగా స్పందించే వ్యక్తిత్వం కాళోజీది అన్నారు. సత్యాగ్రహ మహోద్యమంలో పాల్గొని పిన్న వయసులోనే జైలు జీవితం గడిపారని తెలిపారు. విద్యార్థి దశ నుండే నిజాం ప్రభుత్వం నిషేధాజ్ఞలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప నాయకులు కాళోజీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్ ,సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే డ్రైవర్ ల ప్రధాన లక్ష్యం

- జిల్లా సుపరేండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్
- ప్రతి ఒక్క డ్రైవర్ డిఫెన్సివ్ డ్రైవింగ్ అలవర్చుకోవాలి
- అతివేగం నిర్లక్ష్య డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలి

జగిత్యాల సెప్టెంబర్ 09 (ఉదయం ప్రతినిధి)



ఆర్టీసీ డ్రైవర్లు ప్రయాణికుల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని అత్యంత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా సుపరేండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్ సూచించారు రోడ్డు భద్రత ట్రాఫిక్ నిబంధనలు ప్రమాదాల నివారణపై జగిత్యాల ఆర్టీసీ డిపోలో నిర్వహించిన ఆర్టీసీ డ్రైవర్ల అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ డ్రైవర్లకు పలు కీలక సూచనలు చేశారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల ద్వారా ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారని వారి సురక్షిత ప్రయాణం డ్రైవర్ల బాధ్యతపై ఆధారపడి ఉంటుందన్నారు రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకమని చిన్నపాటి నిర్లక్ష్యం కూడా భారీ ప్రమాదానికి దారితీసే అవకాశం ఉందన్నారు ప్రతి డ్రైవర్ రహదారి భద్రతను తన వ్యక్తిగత బాధ్యతగా భావించి విధులు నిర్వహించాలని సూచించారు అతివేగం నిర్లక్ష్యపు డ్రైవింగ్ ప్రమాదకరంగా ఓవర్ టేకింగ్ చేయడం వంటి వాటికి డ్రైవర్లు దూరంగా ఉండాలని సూచించారు ప్రయాణికులను సమయానికి గమ్యస్థానాలకు చేర్చాలనే ఉద్దేశంతో వేగంగా వాహనం నడపడం కంటే ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని తెలిపారు ముఖ్యంగా మలుపులు కూడళ్లు వంతెనలు రద్దీ ప్రాంతాలు పాఠశాలలు మార్కెట్లు గ్రామీణ ప్రాంతాల్లో రహదారులపై వాహనాల వేగాన్ని నియంత్రించాలని సూచించారు ఎదురుగా వచ్చే వాహనాలను గమనిస్తూ తగినంత దూరం పాటిస్తూ ఓవర్‌టేకింగ్ చేయాలని తెలిపారు డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ వినియోగించడం వల్ల డ్రైవర్ దృష్టి రహదారి నుంచి మరలే అవకాశం ఉందని ఒక్క క్షణం నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదానికి కారణమవుతుందని కావున డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించకపోవడం ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా పాటించాల్సిన నియమమని స్పష్టం చేశారు ప్రతి డ్రైవర్ రహదారిపై ఇతర వాహనదారులు కూడా తప్పులు చేసే అవకాశం ఉందనే విషయాన్ని గుర్తుంచుకుని డిఫెన్సివ్ డ్రైవింగ్ పద్ధతిని పాటించాలని సూచించారు ఇతర వాహనదారుల కదలికలను ముందుగానే అంచనా వేసి అవసరమైన సమయంలో వేగాన్ని తగ్గించడం ద్వారా అనేక ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు ఆర్టీసీ డ్రైవర్లు క్రమశిక్షణకు బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌కు ఆదర్శంగా నిలవాలన్నారు డ్రైవర్ తీసుకునే ప్రతి నిర్ణయం ప్రయాణికుల జీవితాలపై ప్రభావం చూపుతుందని అందువల్ల తొందరపాటు నిర్ణయాలకు దూరంగా ఉండాలని సూచించారు ఈ సందర్భంగా ఉద్యోగ నిర్వహణలో ఎలాంటి రోడ్డు ప్రమాదాలకు తావులేకుండా సురక్షితంగా విధులు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలిచిన ముగ్గురు ఉత్తమ ఆర్టిసి డ్రైవర్లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ శాలువాలతో సన్మానించి అభినందించారు ఇతర డ్రైవర్లు కూడా వీరిని ఆదర్శంగా తీసుకుని ప్రమాదరహిత డ్రైవింగ్‌కు కట్టుబడి విధులు నిర్వహించాలని సూచించారు ఈ కార్యక్రమంలో డీఎస్పీ పురుషోత్తం రెడ్డి డీటీఓ మహమ్మద్ సందాని ఆర్టీసీ ఆర్ఎం రాజు డిప్యూటీ ఆర్ఎం భూపతి రెడ్డి టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ డిపో మేనేజర్లు రమేష్ మనోహర్ హరి ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్ తో పాటు ఆర్టీసీ డ్రైవర్లు పాల్గొన్నారు

## విలీన గ్రామాల ప్రభుత్వ ఉద్యోగులకు సవరించిన హెచ్‌ఆర్‌ఏ వర్తింపజేయాలి

- రాష్ట్రంలో నూతన ఇథనాల్ పాలసీని ప్రవేశపెట్టాలి
- ప్రతి జిల్లాలో ప్లాంట్ ఏర్పాటు చేయాలి
- ఇంటర్మీడియట్ బోర్డును ప్రక్షాళన చేయాలి
- నిబంధనలు ఉల్లంఘిస్తున్న కార్పొరేట్ కాలేజీలు, కోచింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి
- శాసనమండలిలో ఎమ్మెల్సీ మల్క కొమరయ్య



పెద్దపల్లి, సెప్టెంబర్ 09 (ఉదయం ప్రతినిధి)

తెలంగాణ శాసనమండలి సమావేశాల్లో భాగంగా బుధవారం జరిగిన చర్చల్లో ఎమ్మెల్సీ మల్క కొమరయ్య రాష్ట్రంలోని పలు కీలక ప్రజోపయోగ, ఉద్యోగ సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాల ఉద్యోగుల ఇండ్ల అద్దె భత్యం (HRA) సవరణ, రాష్ట్రంలో నూతన ఇథనాల్ పాలసీ రూపకల్పన, మరియు అనుమతులు లేని కార్పొరేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ప్రస్తావించిన ప్రధాన అంశాల వివరాలు క్రింది విధంగా ఉన్నాయి: రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలోకి కొత్తగా విలీనమైన గ్రామాలు, ప్రాంతాలలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు సవరించిన ఇంటి అద్దె భత్యం (HRA)ను తక్షణమే వర్తింపజేయాలని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య కోరారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు జమ్మికుంట, హుజూరాబాద్ తదితర మున్సిపాలిటీల పరిధిని ఇటీవల విస్తరించినప్పటికీ, ఆయా విలీన ప్రాంతాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు HRA మాత్రం ఇంకా పాత రేట్ల ప్రకారమే చెల్లిస్తున్నారని ఆయన సభ దృష్టికి తెచ్చారు. మున్సిపాలిటీల పరిధి విస్తరించిన నేపథ్యంలో, ఆయా ప్రాంతాల పరిధిలోని ఉద్యోగుల హెచ్‌ఆర్‌ఏ రేట్లను ప్రభుత్వం సమీక్షించి సవరించాల్సిన అవసరం ఉందన్నారు. పాత రేట్ల వల్ల ఉద్యోగులు తీవ్రంగా ఆర్థిక నష్టానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు నిబంధనల ప్రకారం అందాల్సిన ప్రయోజనాలు ఎలాంటి జాప్యం లేకుండా అందేలా తగిన ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఇథనాల్ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఒక ప్రత్యేక 'ఇథనాల్ పాలసీ'ని రూపొందించాలని, తద్వారా రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఒక ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ డిమాండ్ చేశారు.

ఇథనాల్‌కు దేశీయంగా, అంతర్జాతీయంగా పెరుగుతున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విధానాన్ని తీసుకురావాలన్నారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో ఇథనాల్ వినియోగానికి సంబంధించిన ప్రతిపాదనలు రూపుదిద్దుకోగా, నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చొరవతో ఇథనాల్ వినియోగం దేశంలో మరింత వేగం పుంజుకుందని ఆయన గుర్తు చేశారు. బ్రెజిల్‌లో 100 శాతం, అమెరికాలో 'E85' విధానం ద్వారా 85 శాతం వరకు ఇథనాల్‌ను ఇంధనంగా వినియోగిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఇథనాల్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం ద్వారా చెరకు, వ్యవసాయ వ్యర్థాలు, నిల్వ ఉన్న పాత ధాన్యానికి డిమాండ్ పెరిగి రైతులకు అద్భుతమైన ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఇది పర్యావరణ పరిరక్షణకు, కర్బన ఉద్గారాల తగ్గింపునకు మరియు విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయడానికి ఎంతో దోహదపడుతుందని సభకు వివరించారు.



## ప్రభుత్వ పాఠశాలకు ఆర్వో వాటర్ ప్లాంట్ బహూకరించిన ఉపాధ్యాయులు

కోరుట్ల సెప్టెంబర్ 09 (ఉదయం ప్రతినిధి)

కథలాపూర్ మండలం గంభీర్పూర్ గ్రామానికి చెందిన గుండు విజయ్ కుమార్ ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు ఈ సందర్భంగా పురస్కార ప్రైజ్ మనీ నుండి ఎంపీపీ ఎస్ గంభీర్పూర్ పాఠశాలకు ఆర్వో వాటర్ ప్లాంట్ ను బహుకరించారు వారికి పాఠశాల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత గుండు విజయ్ కుమార్ ని సాటి ఉపాధ్యాయ బృందం ఆత్మీయ సన్మానం చేశారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ మనోహర్ ఉపాధ్యాయులు సాయి కృష్ణ మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ గ్రామ పంచాయతీ సెక్రటరీ గంగ లక్ష్మణ్ లక్ష్మీపతి అంజు గౌడ్ కృష్ణ హరి ప్రశాంత్ సురేష్ పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో కనీస చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలు పెంపొందించాలి

**కలెక్టర్ కోయ శ్రీహర్ష**

మంథని, సెప్టెంబర్ 9: ఉదయం ప్రతినిధి:



పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. బుధవారం మంథని మండలంలోని ఖాన్‌సాయిపేట, భట్టుపల్లి, వెంకటాపూర్, మల్లారం, ఆరెంద, స్వర్ణపల్లి తదితర పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, మౌలిక వసతులు, విద్యార్థుల హాజరు, బోధన, అభ్యసన స్థాయిపై అధికారులను, ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఖాన్‌సాయిపేట పాఠశాలలో కాంపౌండ్‌వాల్, పెయింటింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని, వెంకటాపూర్ పాఠశాలలో మంజూరైన అదనపు తరగతి గది నిర్మాణాన్ని నెల రోజుల్లోగా పూర్తి చేయాలని సూచించారు. వెంకటాపూర్–ఆరెంద సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించే పనులను వెంటనే క్షేత్రస్థాయిలో ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనులు పూర్తయ్యే వరకు రహదారిపై ఉన్న గుంతలను యుద్ధప్రాతిపదికన పూడ్చి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ప్రతి విద్యార్థికి కనీసం చదవడం, రాయడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలు వచ్చేలా FLN కార్యక్రమంపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారి అభ్యసన స్థాయిని మెరుగుపరిచేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఎంపీడీవో శ్రీజారెడ్డి, ఎంఈవో షబ్బీర్ పాషా, ఏఈ పీఆర్ జగదీశ్, విద్యాశాఖ, ఇంజినీరింగ్ శాఖ అధికారులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు బిగ్ షాక్.. బీఆర్ఎస్‌లో 100మంది చేరిక



సెప్టెంబర్ 9: ఉదయం ప్రతినిధి:

మంథని నియోజకవర్గం లోని మద్దులపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి మరో షాక్ తగిలింది. కాంగ్రెస్‌కు చెందిన కొట్టె రవీందర్, వార్డు మెంబర్ చకినరపు సంతోష్‌తో పాటు పలువురు నాయకులు, మహిళలు, కార్యకర్తలు సుమారు 100 మంది బీఆర్ఎస్‌లో చేరారు. రాజక్క, సమ్మక్క, లాస్మయ్య, కళ్యాణ్, రమేష్, శ్రీధర్, సంతోష్, దేవేందర్, రాజయ్య, ఎర్రయ్య, తిరుపతి తదితరులు పుట్ట మధూకర్ సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ వారికి పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. మద్దులపల్లిలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు చోటుచేసుకోవడం స్థానికంగా రాజకీయ చర్చకు దారితీసింది.



## మున్సిపల్ డ్రైవర్‌కు లక్షల ఎల్‌ఓసీ అందజేత

**ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్**

జగిత్యాల సెప్టెంబర్ 09 (ఉదయం ప్రతినిధి)

అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించే ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతున్న జగిత్యాల మున్సిపల్ డ్రైవర్ జుట్టు జగన్ కుటుంబానికి జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ అండగా నిలిచారు జగన్ అనారోగ్య పరిస్థితిని స్థానిక నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు దీనిపై తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 3 లక్షల ఎల్ఓసి మంజూరు చేయించి హైదరాబాద్‌లో జగన్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ అందజేశారు ఈ సందర్భంగా జగన్ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో తాళ్ళ ధర్మారం మాజీ సర్పంచ్ మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ఎల్‌నినో పరిస్థితుల్లో నీటి పొదుపుకు డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతులు తప్పనిసరి



పెద్దపల్లి,(సుల్తానాబాద్) సెప్టెంబర్ 09 (ఉదయం ప్రతినిధి)

ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉండే అవకాశం ఉన్నందున, రైతులు సాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ సూచించారు. నీటి వినియోగాన్ని గణనీయంగా తగ్గించేందుకు డ్రిప్ మరియు స్ప్రింక్లర్ సూక్ష్మ సాగునీటి విధానాలను రైతులు విస్తృతంగా వినియోగించుకోవాలని ఆయన కోరారు.

బుధవారం సుల్తానాబాద్ మండలంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన డ్రిప్ సాగునీటి వ్యవస్థలను జిల్లా ఉద్యానశాఖ అధికారి పరిశీలించారు. డ్రిప్ పరికరాల ఏర్పాటు తీరును యాదృచ్ఛికంగా తనిఖీ చేసి, రైతులతో నేరుగా మాట్లాడి, సూక్ష్మ సాగునీటి కంపెనీలు చేపడుతున్న పనుల్లో పారదర్శకత, నాణ్యత, రైతులకు అందుతున్న సబ్సిడీ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం ప్రతి రైతు బాధ్యత అని ఆయన తెలిపారు. సాగునీటి అవసరాన్ని తగ్గిస్తూ పంటలకు అవసరమైన నీటిని నేరుగా మొక్కల వేర్లకు అందించడంలో డ్రిప్ పద్ధతి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. స్ప్రింక్లర్ విధానం కూడా నీటి పొదుపుతో పాటు సమర్థవంతమైన సాగునీటి నిర్వహణకు దోహదపడుతుందని తెలిపారు. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతులకు సూక్ష్మ సాగునీటి పద్ధతుల ఏర్పాటుకు ప్రభుత్వం గణనీయమైన సబ్సిడీ అందిస్తోందని జిల్లా ఉద్యానశాఖ అధికారి తెలిపారు. అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పొలాల్లో డ్రిప్, స్ప్రింక్లర్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు.

అనంతరం సుల్తానాబాద్ మండలంలోని కూరగాయల సాగు పొలాలను కూడా జిల్లా ఉద్యానశాఖ అధికారి పరిశీలించి, రైతులకు పంటల సాగు, నీటి యాజమాన్యం, పురుగు–తెగుళ్ల నివారణ తదితర అంశాలపై సాంకేతిక సూచనలు అందించారు. కార్యక్రమంలో KVK రామగిరి ఖిల్లా సీనియర్ శాస్త్రవేత్త శ్రీ వెంకట రమేష్, ఉద్యాన శాస్త్రవేత్త శ్రీ భాస్కర్ రావు, కీటక శాస్త్రవేత్త శ్రీ వెంకన్న, వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త శ్రీ వినోద్, ఉద్యానశాఖ అధికారి శ్రీ ఎస్. మహేష్ పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్‌లో శాస్త్రీయ యాజమాన్యంతో అధిక దిగుబడులు సాధించాలి

**పంటల పరిశీలనలో రామగుండం ఉద్యానవన అధికారి ఏ. జ్యోతి**

ముత్తారం సెప్టెంబర్ 09(ఉదయం ప్రతినిధి)



ముత్తారం మండలంలోని ఆయిల్‌పామ్ తోటలను రామగుండం ఉద్యానవన అధికారి ఏ. జ్యోతి బుధవారం సందర్శించి పంటల పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయిల్‌పామ్ సాగులో రైతులు శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఆమె సూచించారు.ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆయిల్‌పామ్ తోటలకు డ్రిప్ విధానంలో ప్రతిరోజూ సుమారు నాలుగు గంటలపాటు నీటిని అందించాలని రైతులకు సూచించారు.తోటల్లో నీటి కొరత ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు నేలలో తేమ నిల్వ ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఆయిల్‌పామ్ పంటలో సరైన నీటి యాజమాన్యం దిగుబడులపై కీలక ప్రభావం చూపుతుందని వివరించారు.పరాగసంపర్కం కోసం తోటల్లో విడుదల చేసిన వీవిల్స్ (కీటకాలు) ఉధృతి పెరుగుతున్నట్లు గమనించిన ఆమె,రైతులు వాటి సంచారాన్ని పర్యవేక్షిస్తూ పంట అభివృద్ధికి అనుకూల పరిస్థితులు కల్పించాలని సూచించారు.అలాగే ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సిఫారసు చేసిన మోతాదులో సమతుల్య ఎరువులు అందించడం ద్వారా మొక్కల ఎదుగుదల మెరుగుపడుతుందని చెప్పారు.అనంతరం మండలంలోని ఉద్యాన పంటలను కూడా పరిశీలించారు.బంతి పూల పంటలో పుష్పోత్పత్తి, నాణ్యత పెంపుపై రైతులకు సూచనలు అందించారు. .ఈ కార్యక్రమంలో ఉద్యాన విస్తరణ అధికారి రాజశేఖర్, ఆయిల్‌పామ్ ఫీల్డ్ ఆఫీసర్ అజయ్,రైతులు సంపత్‌రావు, రవి తదితరులు పాల్గొన్నారు.

## ముత్తారంలో కాళోజి జయంతి నిర్వహణ

ముత్తారం సెప్టెంబర్ 09(ఉదయం ప్రతినిధి):



ప్రజాకవి, తెలంగాణ వైతాళికుడు శ్రీ కాళోజి నారాయణరావు జయంతి సందర్భంగా ముత్తారం మండల కేంద్రంలో బుధవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. మండల తహశీల్దార్ కార్యాలయం, మండల ప్రజాపరిషత్ కార్యాలయాల్లో కాళోజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది కాళోజి తెలంగాణ సమాజానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ప్రజల సమస్యలను తన రచనల ద్వారా ప్రతిబింబించిన మహోన్నత కవి కాళోజి అని కొనియాడారు.యువత కాళోజి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మధుసూదన్ రెడ్డి,ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ వివిధ అధికారులు అధికారులు,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అజెయంగా మొదటి సంవత్సర వార్షికోత్సవం

పెద్దపల్లి, సెప్టెంబర్ 09 (ఉదయం ప్రతినిధి)



ఈరోజు పెద్దపల్లి పట్టణంలోని ప్రగతి నగర్ అయ్యప్ప స్వామి దేవాలయం ఎదురుగా గల SGM ఫ్యాషన్ వరల్డ్ ( రైమండ్స్ ) షోరూం మొదటి సంవత్సర వార్షికోత్సవం సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసి కేక్ కట్ చేసి SGM యాజమాన్యానికిశుభాకాంక్షలు తెలియజేసిన మున్సిపల్ చైర్మన్ శ్రీ నూగిల్ల మల్లయ్య గారు కౌన్సిలర్లు మంథని నర్సింగ్ గారు మరియు నాయకులు పాల్గొన్నారు



## గణేష్ నవదుర్గ మండలి నూతన అధ్యక్ష ఉపాధ్యక్షులు ఎన్నిక

కోరుట్ల సెప్టెంబర్ 09 (ఉదయం ప్రతినిధి)

గణేష్ నవదుర్గ మండలి నూతన అధ్యక్షులుగా ఎలిగేటి సుమన్ ఉపాధ్యక్షులుగా లక్కంపల్లి విజయకుమార్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని గణేష్ నవదుర్గ మండలి త్రిశక్తి ఆలయ సేవా సమితి గౌరవాధ్యక్షులు కట్ట నారాయణ అధ్యక్షతన సంఘ కార్యవర్గ సభ్యుల సమావేశం ఏర్పాటు చేసి అందరి నిర్ణయం మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది సంఘానికి దేవాలయానికి సేవలు అందిస్తామని సంఘ అభివృద్ధి కోసం పాటుపడతామని ప్రమాణం చేసి బాధ్యతలు తీసుకున్నారు

ఈ సందర్భంగా నూతన అధ్యక్ష ఉపాధ్యక్షులకు సంఘ కార్యవర్గం వర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి వల్ల కొండ శ్రీనివాస్ సహాయ కార్యదర్శి మామిడిపల్లి రమేష్ కోశాధికారి అడివాల ప్రభాకర్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## మున్సిపల్ కార్యాలయంలో కాళోజీ జయంతి

కోరుట్ల సెప్టెంబర్ 09 (ఉదయం ప్రతినిధి)



తెలంగాణ ప్రజాకవి తెలుగు రచయిత కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలను బుధవారం కోరుట్ల మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు ఇట్టి కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత మున్సిపల్ ఇంచార్జి కమిషనర్ టి అరుణ్ కుమార్ వైస్ చైర్మన్ మహమ్మద్ షాహెద్ ఉల్ అహద్ వివిధ వార్డుల కౌన్సిలర్ లు ప్రజా ప్రతినిధులు కార్యాలయ సిబ్బంది అందరూ కాళోజీ నారాయణ రావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించడం జరిగింది ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత మున్సిపల్ ఇంచార్జి కమిషనర్ టి అరుణ్ కుమార్ వైస్ చైర్మన్ మహమ్మద్ షాహెద్ ఉల్ అహద్ వార్డు కౌన్సిలర్ లు ప్రజా ప్రతినిధులు మున్సిపల్ మేనేజర్ ఏఈ ఆర్ఓ మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్‌కు చెట్ల కొమ్మల ముప్పు

ముత్తారం సెప్టెంబర్ 09(వు దయం ప్రతినిధి):



మండల కేంద్రంలోని ఓడేడు–మంథని ప్రధాన రహదారి పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు చెట్ల కొమ్మలు ఆనుకుని ఉండటంతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో గాలులు, వర్షాల సమయంలో కొమ్మలు విద్యుత్ తీగలను తాకే అవకాశం ఉండటంతో షార్ట్‌సర్క్యూట్‌లు, విద్యుత్ అంతరాయాలు సంభవించే ప్రమాదం ఉందని తెలిపారు. అధికారులు స్పందించి చెట్ల కొమ్మలను తొలగించి భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## విద్యుత్ సమస్యను పరిష్కరించండి

**కోతల పై రోడ్డెక్కిన రైతులు**

కోరుట్ల సెప్టెంబర్ 09 (ఉదయం ప్రతినిధి)



కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎకిన్ పూర్ గ్రామంలో విద్యుత్ (కరెంట్) కోతలను నిరసిస్తూ రైతులు ధర్నా రాస్తారోకో నిర్వహించారు ఈసందర్భగా రైతులు పెద్ద ఎత్తున వచ్చి ప్రభుత్వం వ్యతిరేకంగా నినాదలు చేస్తూ 24 గంటల కరెంట్ ఇస్తున్నామని గొప్పలు చేప్పే రేవంత్ ప్రభుత్వం కనీసం 10 గంటలు కూడా ఇవ్వడం లేదని రైతులు మండిపడ్డారు ఇప్పటికే వర్షాలు లేక కష్టాల్లో ఉన్న రైతులకు కరెంట్ లేకపోవడం వల్ల పంటలు ఎండిపోతున్నాయని యూరియా దొరకడం లేదు యాప్ కష్టాలు ఇలా చాలా రకాల కష్టాలు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని మండిపడ్డారు కనీసం 12 గంటలు అయినా 3 పేస్ విద్యుత్ సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో కాశిరెడ్డి మోహన్ రెడ్డి పుట్టుకపు నర్సారెడ్డి అరికంటి సాగర్ గంగారెడ్డి సురేష్ రెడ్డి జలంధర్ మల్లేషం జగిలం లక్ష్మినర్సయ్య తదితరులు పాల్గొన్నారు

## శ్రావణమాస మాస శివరాత్రి ప్రత్యేక పూజల్లో అడువాల జ్యోతి లక్ష్మణ్

జగిత్యాల సెప్టెంబర్ 09 (ఉదయం ప్రతినిధి)



జగిత్యాల జిల్లా పొలాస గ్రామంలో శ్రావణమాస మాస శివరాత్రి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా అడువాల జ్యోతి లక్ష్మణ్ ఆలయానికి చేరుకుని శివయ్య ను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నపూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు ఈ సందర్భంగా అడువాల జ్యోతి లక్ష్మణ్ మాట్లాడుతూ శ్రావణమాసంలో శివారాధనకు ఎంతో విశిష్టమైన ప్రాధాన్యత ఉందన్నారు మాస శివరాత్రి సందర్భంగా మహాశివుడిని భక్తిశ్రద్ధలతో ఆరాధించడం వల్ల ఆధ్యాత్మిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని పరమేశ్వరుడిని ప్రార్థించినట్లు అడువాల జ్యోతి లక్ష్మణ్ తెలిపారు . ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం కొత్త మోహన్.ఆలయ నిర్వాహకులు గ్రామ పెద్దలు భక్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు

# ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలి

**మట్టి వినాయక విగ్రహాల వినియోగంపై అవగాహన కల్పించే వాల్ పోస్టర్ ను విడుదల చేసిన జిల్లా కలెక్టర్**

**పెద్దపల్లి, సెప్టెంబర్ 09 (వుదయం ప్రతినిధి)**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (PoP)తో తయారు చేసిన వినాయక విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (TGPCB) ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన వాల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, వినాయక చవితి సందర్భంగా పర్యావరణహిత విగ్రహాలను వినియోగించాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల జలాశయాలు, చెరువులు, ఇతర నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని తెలిపారు. మట్టి వినాయక విగ్రహాలను వినియోగించడం ద్వారా నీటి వనరుల పరిరక్షణతో పాటు పర్యావరణాన్ని కాపాడవచ్చని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజలు తమ వంతు సహకారం అందించడం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అసిస్టెంట్ సైంటిస్ట్ ఈ. కనకశ్రీ, ఏవో పెద్దపల్లి బి. ప్రకాష్, సూపరింటెండెంట్ కోటేశ్వర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీవాణి ,తదితరులు పాల్గొన్నారు.



## కేసీఆర్‌పై కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలు సిగ్గుచేటు

**మాజీ ఎంపీపీ లక్కారం సర్పంచ్ అత్తే చంద్రమౌళి ఆగ్రహం**



ముత్తారం సెప్టెంబర్ 09(వుదయం ప్రతినిధి):

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అహర్నిశలు కృషి చేసిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) చావును కాంగ్రెస్ నాయకులు కోరుకోవడం అత్యంత సిగ్గుచేటని ముత్తారం మాజీ ఎంపీపీ లక్కారం సర్పంచ్ అత్తే చంద్రమౌళి బుధవారం విమర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం కేసీఆర్ ఎన్నో ఉద్యమాలు నిర్వహించారని,ఆమరణ నిరాహార దీక్షలతో ప్రత్యేక రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు.తెలంగాణ ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రిగా రైతులు,పేదలు,మహిళలు,విద్యార్థుల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు మేలు చేశారని పేర్కొన్నారు.అలాంటి నాయకుడిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం,ఫామ్‌హౌస్ ముట్టడికి వెళ్లిన కాంగ్రెస్ నాయకులు మాజీ ముఖ్యమంత్రి చావును కోరుకోవడం, చావు డప్పులు కొట్టడం రాజకీయ సంస్కృతికి విరుద్ధమని అన్నారు.కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించకపోయి ఉంటే నేడు కాంగ్రెస్ నాయకులకు ఇన్ని పదవులు,అవకాశాలు వచ్చేవా అని ఆయన ప్రశ్నించారు.ప్రజల మనోభావాలను గౌరవిస్తూ కాంగ్రెస్ నాయకులు ఇలాంటి వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని చంద్రమౌళి డిమాండ్ చేశారు.

## రీ సర్వే పనులను పకడ్బందీగా వేగవంతంగా పూర్తి చేయాలి



- **జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బిఎస్ లత**
- **నాన్ కెడస్ట్రాల్ రిసర్వే ఎంజాయ్మెంట్**

**రీ సర్వే పనుల పరిశీలన...**

**జగిత్యాల సెప్టెంబర్ 09 (వుదయం ప్రతినిధి)**

పెగడపల్లి మండలంలోని ల్యాగల మర్రి గ్రామంలో నాన్ కెడస్ట్రాల్ రీసర్వే ఎంజాయ్ మెంట్ రీ సర్వే పనులను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి ఎస్ లత బుధవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు రీ సర్వే ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా పకడ్బందీగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు ఈ సందర్భంగా గ్రామంలో ఇప్పటివరకు ఎంత విస్తీర్ణంలో రీ సర్వే పూర్తయింది ఇంకా ఎంత మేర చేపట్టాల్సి ఉంది పనులు ఎన్ని రోజుల్లో పూర్తవుతాయనే వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు ఆయా గ్రామాల్లో భూమి విస్తీర్ణం ఎంత ఉందని ఆరా తీశారు సర్వే నంబర్ల వారీగా ఎలాంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితత్వంతో రీ సర్వే నిర్వహించాలని సూచించారు భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భూముల రీ సర్వే కార్యక్రమాన్ని చేపడుతోందని తెలిపారు ఈ రీసర్వేలో భాగంగా గ్రామ సరిహద్దులను నిర్ధారించి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అత్యాధునిక సర్వే పరికరాల సహాయంతో వ్యవసాయ భూములను సర్వే చేయనున్నట్లు తెలిపారు సర్వే పూర్తయిన అనంతరం భూ వివరాలను ప్రజలకు ప్రకటిస్తామని పేర్కొన్నారు గ్రామస్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా రీ సర్వే ప్రక్రియను నిర్వహించాలని ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు మొదట గ్రామ బౌండరీ పై లైసెన్సుడ్ సర్వేయర్లు మండల సర్వేలు కలిసి రీ సర్వే చేస్తారని తర్వాత ఒక్కొక్క రైతు వారిగా రీ సర్వే నిర్వహిస్తారని తెలిపారు జగిత్యాల జిల్లాలో మొదటి విడతగా 70 గ్రామాల్లో రీ సర్వే చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు ప్రస్తుతం ఎంజాయ్మెంట్ రీసర్వే కొనసాగుతుందని పేర్కొన్నారు నడికుడ గ్రామంలో నాన్ కెడస్ట్రాల్ రీ సర్వే చేపడుతున్నామని తెలిపారు రైతులు గ్రామస్థుల అడిగిన సందేహాలకు తగిన సలహాలు సూచనలు అందించారు ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మండల సర్వేయర్ రెవెన్యూ సిబ్బంది గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ వద్ద ఎమ్మెల్యేలపై దాడి, కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి మచ్చ

**మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి**

**పెద్దపల్లి, సెప్టెంబర్ 09 (వుదయం ప్రతినిధి)**



పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి మనోహర్ రెడ్డి నేడు పెద్దపల్లిలోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నుంచే ప్రజల దృష్టిని మళ్లించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వివిధ అంశాలను తెరపైకి తీసుకువస్తోందని దాసరి మనోహర్ రెడ్డి విమర్శించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి రావడాన్ని అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ నిరసన వ్యక్తం చేయడం తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఫల్యాలు, ఎన్నికల హామీల అమలు వంటి అసలు ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇలాంటి వివాదాస్పద ఘటనలను తెరపైకి తీసుకువస్తున్నారని ఆరోపించారు. ప్రజల దృష్టిని ఎంతకాలం మళ్లించినా ప్రభుత్వం ఇచ్చిన హామీలు, చేసిన పనులను ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా కక్ష పూరిత రాజకీయాలను పక్కనపెట్టి ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని, ప్రజల చేత ఎన్నుకోబడిన ఎమ్మెల్యేలకు తగిన గౌరవం ఇవ్వాలని దాసరి మనోహర్ రెడ్డి కోరారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

## పెండింగ్ బిల్లుల కోసం 'ఛలో అసెంబ్లీ'.. మాజీ సర్పంచ్‌ల అరెస్ట్

**మంథని, సెప్టెంబర్ 9: వుదయం ప్రతినిధి:**



గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సర్పంచ్ జేఏసీ చేపట్టిన 'ఛలో అసెంబ్లీ–ముట్టడి' కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఇందులో భాగంగా మంథని పోలీసులు పలువురు మాజీ సర్పంచ్‌లను బుధవారం తెల్లవారుజామున ముందస్తుగా అరెస్ట్ చేశారు. మాజీ సర్పంచ్‌ల జేఏసీ అధ్యక్షుడు కనవేన శ్రీనివాస్, కాకర్లపల్లి మాజీ సర్పంచ్ కనవే కొమురయ్య, గాజులపల్లి తాజా, మాజీ సర్పంచ్ కరెంగుల సుధాకర్, మల్లేపల్లి మాజీ సర్పంచ్ ఎరుకల తిరుపతమ్మ, తిరుపతిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఈ సందర్భంగా కనవేన శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు బాధ్యతలు చేపట్టి తొమ్మిది నెలలు గడుస్తున్నా నిధులు విడుదల కాకపోవడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రివర్గం వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## కేసీఆర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**మెట్‌పల్లి సీఐ కి జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు**

**మెట్‌పల్లి సెప్టెంబర్ 09 (వుదయం విలేకరి)**



తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి బీఆర్ఎస్ అధినేత ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పై అనుచితంగా అవమానకరంగా వ్యాఖ్యలు చేయడమే కాకుండా ఆయనకు హాని కలిగించేలా ప్రజలను ప్రేరేపించే వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు బీఆర్ఎస్ నాయకుల తో కలిసి బుధవారం మెట్‌పల్లి సీఐ కి ఫిర్యాదు చేశారు ఇటీవల ఒక మీడియా కార్యక్రమంలో ప్రజా ప్రతినిధిగా ఉన్న వ్యక్తి కేసీఆర్ పై అత్యంత అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు ముఖ్యంగా కేసీఆర్ ఈ రాష్ట్రానికి పట్టిన పీడ.. అందుకే అతని చావును కోరుకుంటున్నాం.. అందుకే వెయ్యి దప్పులతో ర్యాలీ చేస్తున్నాం.. అంటూ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు ఈ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో ఆధారాలను కూడా పోలీసులకు అందజేశారు ప్రజా జీవితంలో ఉన్న ఒక మాజీ ముఖ్యమంత్రి ప్రతిపక్ష నేతపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వారు అన్నారు రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగతంగా కించపరిచేలా హాని కలిగించేలా మాట్లాడటం ఏమాత్రం సమర్థనీయం కాదని పేర్కొన్నారు ఈ వ్యాఖ్యలు భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) 2023లోని సంబంధిత సెక్షన్ల కింద నేర పూరిత చర్యలకు దారితీసే అవకాశం ఉన్నందున సెక్షన్లు 196, 351(3), 352, 353, 61 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేపట్టాలని పోలీసులను కోరారు అలాగే ప్రజా ప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని భవిష్యత్తులో ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు ప్రజాస్వామ్యంలో రాజకీయ విమర్శలకు హద్దులు ఉండాలని వ్యక్తిగత దూషణలు బెదిరింపులు హింసను ప్రేరేపించే వ్యాఖ్యలను సహించబోమని స్పష్టం చేశారు బాధ్యులపై వెంటనే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.



## సంక్షేమ ఫలాలు అందరికీ అందాలి..కార్డుల పంపిణీలో చైర్మన్ పుల్కం రాజు

**వేములవాడ, సెప్టెంబరు 09 (వుదయం ప్రతినిధి) :**

వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని విలీన గ్రామం తిప్పాపురంతో పాటు 4, 7, 8, 18వ వార్డుల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ముఖ్య అతిథిగా పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గతంలో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం ప్రజలకు చేరువగా వార్డుల్లోనే ప్రభుత్వ సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులు భవిష్యత్తులో పలు సంక్షేమ పథకాల ప్రయోజనాల పొందేందుకు ఉపయోగపడతాయని తెలిపారు,వేములవాడ పట్టణంతో పాటు విలీన గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని పుల్కం రాజు చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్లు ఎల శ్రీనివాస్, మైలారం శ్రీనివాస్, కొండ రాజశేఖర్, తోట రాజు, తుమ్ మధు,ఇందిరమ్మ కమిటీ సభ్యులు నాగుల విష్ణు, సయ్యద్ సాబీర్, స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



## తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు

**కోరుట్ల సెప్టెంబర్ 09 (వుదయం ప్రతినిధి)**

కోరుట్ల పట్టణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కాళోజి నారాయణరావు 114 వ జయంతి సందర్భంగా తెలంగాణ భాష దినోత్సవ వేడుకలను నిర్వహించారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గౌసూర్ రెహమాన్ మాట్లాడుతూ కాళోజి రచన నా గోడన పుస్తకం గురించి ఆయన తెలంగాణ భాష కోసం చేసిన కృషి కొనియాడారు ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎస్ పిఓ గంగా ప్రసాద్ అధ్యాపకులు శ్రీనివాస్ సుబ్రహ్మణ్యం డింగిరి ప్రశాంత్ వంశీ రాజు శిరీష్ వసుధ రాజశేఖర్ అధ్యాపక బృందం పాల్గొన్నారు.



## బేటీ బచావో బేటీ పడావో పై అవగాహన

**మంథని, సెప్టెంబర్ 9: వుదయం ప్రతినిధి.**

జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం మంథని పట్టణంలోని ప్రణామ్ డే కేర్ సెంటర్ నందు బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కసందర్భంగా కో–ఆర్డినేటర్ దయ అరుణ, జెండర్ స్పెషలిస్ట్ బి. సంస్కృతి, ఎం.టి.ఎస్ ఈ. స్వర్ణలత లు మాట్లాడుతూ వయోవృద్ధులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి, టోల్ ఫ్రీ నంబర్ల ప్రాముఖ్యత, వాటి ఉద్దేశాన్ని వివరించారు. అలాగే వయోవృద్ధుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న కార్యక్రమాలు, సేవల గురించి, టోల్ ఫ్రీ నంబర్ల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా కాజా మొయినుద్దీన్, రాజమౌళి గౌడ్, దత్త గౌడ్ పాల్గొని వయోవృద్ధుల సంక్షేమంపై తమ సందేశాన్ని అందించారు.



## మాజీ మంత్రి రాజేశం గౌడ్ పరామర్శించిన ఎమ్మెల్యే సంజయ్

**జగిత్యాల సెప్టెంబర్ 09 (వుదయం ప్రతినిధి)**

మాజీ మంత్రి గోడిసెల రాజేశం గౌడ్ కు ఇటీవల మోకాలు శస్త్ర చికిత్స కాగా బుధవారం వారి ఇంటి వద్ద పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్

## లక్కారంలో భారీ కార్డన్ సెర్చ్

**ముత్తారం, సెప్టెంబర్ 9 (వుదయం ప్రతినిధి):**



ముత్తారం మండలంలోని లక్కారం గ్రామంలో బుధవారం పోలీసులు భారీ ఎత్తున కార్డన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధులు, అనుమానాస్పద ప్రాంతాలు, నివాస గృహాల్లో విస్తృత తనిఖీలు చేపట్టి శాంతిభద్రతల పరిస్థితులను సమీక్షించారు.మంథని సీఐ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలీసులు గ్రామాన్ని చుట్టుముట్టి క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు.అనంతరం గ్రామస్తులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో సీఐ స్వామి మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు.గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నా,చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.యువత మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని,సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.అపరిచితుల ఫోన్ కాల్స్,లింకులు,ఓటీపీలు, బ్యాంకు వివరాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని వివరించారు.సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించిన సీఐ,గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేందుకు ప్రజలు పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ సహకరించాలని కోరారు.గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ముత్తారం ఎస్సై రవికుమార్,రామగిరి ఎస్సై శ్రీనివాస్,మంథని ఎస్సై రమేష్, ఏఎస్సైలు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కేసీఆర్‌ను టార్గెట్ చేస్తే ఊరుకోం.. బీఆర్ఎస్ ఆగ్రహం

**సుల్తానాబాద్‌లో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దిష్టిబొమ్మ దహనం**

**పెద్దపల్లి, (సుల్తానాబాద్) సెప్టెంబర్ 09 (వుదయం ప్రతినిధి)**



మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కెసిఆర్ చావు కోరుతు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని శాస్త్రినగర్ సమీపంలోని హైవే రోడ్డుపై మండల బీఆర్ఎస్ నాయకులు వీర్లపల్లి శంకర్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, రాజకీయ విమర్శలు హద్దులు దాటకుండా ఉండాలని అన్నారు. బీఆర్ఎస్ అధినేతపై అవమానకరంగా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని వీర్లపల్లి శంకర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో హైవే రోడ్డుపై కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు చంద్రమౌళి, దయాకర్, నారాయణ, బాపూరావు, మల్లికార్జున్, తిరుపతి, సంపత్, పలువురు బిఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సాతారం తెలంగాణ పబ్లిక్ స్కూల్ కు 12 కోట్లు మంజూరు

**కోరుట్ల సెప్టెంబర్ 09 (వుదయం ప్రతినిధి)**



కోరుట్ల నియోజకవర్గ పరిధిలోని మల్లాపూర్ మండలం సాతారం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ స్కూల్ అభివృద్ధి పరచడం కోసం12కోట్ల రూపాయలు మంజూరు చేసింది ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు హైదరాబాద్ నుండి ప్రకటన విడుదల చేస్తూ స్థానిక పత్రిక విలేకరులతొ టెలిఫోన్ ద్వారా మాట్లాడారు కోరుట్ల నియోజకవర్గం లో విద్యాభివృద్ధి కోసం ఇంత పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుమల రేవంత్ రెడ్డి కి కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు ఈ నిధులతో పూర్తి స్థాయిలో పాఠశాల అభివృద్ధి చేస్తామని అలా అభివృద్ధి చెందిన పాఠశాల పని చేయడం ప్రారంభిస్తే విద్యార్థుల భవిష్యత్తు మారిపోతుందని విద్యార్థులు మరింత వృద్ధిలోకి వస్తారన్నారు.

## ఎమ్మెల్సీ తాతా మధు సభ్యత్వం రద్దు చేయాలి

**స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అనుచిత వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సెగ్గెం రాజేశ్**

**మంథని, సెప్టెంబర్ 9: వుదయం ప్రతినిధి**



తెలంగాణ శాసనసభ స్పీకర్, దళిత నేత గడ్డం ప్రసాద్ పై ఎంఎల్సీ తాతా మధు అసభ్య పదజాలంతో దూషించడం తీవ్రంగా ఖండించదగిన విషయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సెగ్గెం రాజేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ లు అన్నారు. మంగళవారం మంథని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో వారు మాట్లాడుతూ స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధు శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చేయడంతో పాటు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని వారు వారు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై నైతిక బాధ్యత వహిస్తూ బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం తక్షణమే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్ పెంటరి రాజు, కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేల్పుల రాజయ్య, సీనియర్ నాయకులు పేరవేని లింగయ్య, జంబోజు సమ్మయ్య, తోకల మల్లేష్, ఎరుకల రమేష్, పెట్టం రామస్వామి, దోరగోర్ల శ్రీనివాసు, అక్కపాక సది, ఆకుల శ్రీనివాసు, మచ్చిక దేవేందర్, మంథని శ్రీనివాస్, నాంపల్లి సతీష్, జంజర్ల సైలేందర్, రాదారపు సతీష్, కాశిపేట రాములు, పెట్టం రామస్వామి, ఇందారపు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులను గెంటేసిన కొడుకు

**ఆశ్రయమిచ్చిన సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు హరి అశోక్ కుమార్**

**జగిత్యాల సెప్టెంబర్ 09 (వుదయం ప్రతినిధి)**



జగిత్యాల జిల్లా కేంద్రంకు చెందిన సవుదుల నారాయణ (70) రత్నమ్మ (65) అనే వృద్ధ తల్లిదండ్రులను కన్న కొడుకు కమలాకర్ కోడలు లావణ్య లు మంగళవారం రాత్రి గొడవ పెట్టుకొని బలవంతంగా ఇంట్లోంచి గెంటి వేశారు ధీంతో సదరు వృద్ధ తల్లిదండ్రులు సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ను ఆశ్రయించారు తన ఇంటిలో రాత్రి ఆశ్రయమిచ్చి బుధవారం ఉదయమే హరి అశోక్ కుమార్ వారి అసోసియేషన్ ప్రతినిధులతో ఆ వృద్ధ తల్లిదండ్రులను వారి ఇంటికి తీసుకెళ్లి తండ్రి పేరిట ఉన్న ఇల్లును భూములను పట్టా చేయించుకొని పోషించక భార్య చెప్పుడు మాటలు విని గెంటేసిన విషయంలో తీవ్రంగా మందలించారు వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణ చట్టం ప్రకారం ఆ ఇల్లు భూములు మళ్ళీ తండ్రి పేరిట కలెక్టర్ కు ఫిర్యాదు చేసి పట్టా మార్పు చేయిస్తామని 6 మాసాల జైలు శిక్ష పడుతుందని కొడుకు కోడలు ను హెచ్చరించారు కౌన్సిలింగ్ మేరకు ఇక ముందు వెళ్ళగొట్టమని పోషణ వైద్య ఖర్చులు పెడుతూ సంరక్షిస్తామని వారి బంధువు సాక్షిగా నోటరీ అఫిడవిట్ రాసిచ్చి ఆ తల్లిదండ్రులకు క్షమాపణ చెప్పి వారి ఇంట్లోకి తీసుకెళ్లారు ఈ కౌన్సిలింగ్ లో సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ తో పాటు ప్రతినిధులు పిసి హన్మంత్ రెడ్డి గౌరిశెట్టి విశ్వనాథం బొల్లం విజయ్ వెల్మల ప్రకాష్ రావు ఎండి యాకూబ్ కరుణ విజయలక్ష్మి పాల్గొన్నారు.

## ఆరోగ్యశ్రీ ఉద్యోగుల జగిత్యాల జిల్లా అధ్యక్షులు గా గుడ్ల గంగాధర్

**జగిత్యాల సెప్టెంబర్ 09 (వుదయం ప్రతినిధి)**



ఆరోగ్యశ్రీ ఉద్యోగుల జగిత్యాల జిల్లా అధ్యక్షులు గా గుడ్ల గంగాధర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జిల్లాలోని ఆరోగ్యశ్రీ ఉద్యోగులు స్థానిక కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని జిల్లా అధ్యక్షున్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అలాగే ప్రధాన కార్యదర్శిగా సతీష్ ఉపాధ్యక్షులుగా కమలాకర్ రాజేశ్వరి కోశాధికారిగా రాజశేఖర్ సహాయ కార్యదర్శులు గా ఆంజనేయులు మోహన్ శ్రీనివాస్ లను ఎన్నుకొన్నారు గౌరవాధ్యక్షులుగా దాసరి మురళి గౌరవ సలహా దారులుగా కర్నె శ్రీనివాస్ దువ్వాక రాజేష్ పందిరి శ్రీధర్ లను ఎన్నుకొన్నారు ఈ సందర్భంగా కొత్త అధ్యక్షులు గుడ్ల గంగాధర్ మాట్లాడుతూ తనపై నమ్మకముంచి అధ్యక్షునిగా ఎన్నుకొన్న నాతోటి ఉద్యోగులందరికి రుణపడి ఉంటానన్నారు ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతర కృషి చేస్తానన్నారు తన నియామకానికి కృషి చేసిన అందరికి కృతజ్ఞతలు గంగాధర్ తెలిపారు.

# అర్హుడి ఓటు పోకూడదు.. అనర్హుడి పేరు ఉండకూడదు

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి**

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 9 (వుదయం ప్రతినిధి):**



ఓటర్ల జాబితా సవరణలో చిన్నపాటి పొరపాటుకు కూడా తావివ్వొద్దని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అర్హుడైన ఒక్క ఓటరు పేరు జాబితాలో గల్లంతు కాకూడదని.. మృతులు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లు కొనసాగకుండా నిబంధనల ప్రకారం తొలగించాలని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాలే ఎన్నికల ప్రక్రియకు పునాది కావడంతో SIRలో ప్రతి అంశాన్ని క్షేత్రస్థాయిలో నిర్ధారించిన తర్వాతే మార్పులు, చేర్పులు, తొలగింపులు చేపట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షాతో కలిసి బుధవారం తాంసి, భీంపూర్ మండలాల్లో సుదర్శన్‌రెడ్డి క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. తాంసి మండలం హోచ్చూర్, భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి నిర్వహిస్తున్న సర్వే, ఓటర్ల వివరాల పరిశీలన, కొత్తగా నమోదుకు వచ్చిన దరఖాస్తుల ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. బీఎల్‌ఓల వద్ద ఉన్న ఓటర్ల జాబితాలు, దరఖాస్తులను పరిశీలించిన సీఈఓ.. వివరాల నమోదులో తీసుకుంటున్న జాగ్రత్తలపై ఆరా తీశారు. పేరు, వయస్సు, చిరునామా వంటి వివరాల్లో తప్పులు గుర్తిస్తే నిబంధనల ప్రకారం సరిచేయాలని సూచించారు. ఇంటింటి సర్వేలో ఒక కుటుంబానికి సంబంధించిన వివరాలను మాత్రమే కాకుండా, ఆ కుటుంబంలోని ఓటరు వాస్తవంగా అక్కడే నివసిస్తున్నారా? అనే అంశాన్ని కూడా నిర్ధారించాలని స్పష్టం చేశారు. డాక్యుమెంట్లు అందుబాటులో ఉన్న చోట వాటిని పరిశీలించి వివరాలను ధ్రువీకరించాలని, పత్రాలు లేని సందర్భాల్లో సంబంధిత వ్యక్తులకు అవసరమైన మార్గదర్శకాలు అందించి నిబంధనల ప్రకారం ధ్రువీకరణ చేపట్టాలని తహశీల్దార్లకు సూచించారు. క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారం ఆధారంగా తదుపరి చర్యలు నిబంధనల మేరకు చేపడతామని తెలిపారు.

జిల్లాలో SIR ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని, గత మూడు రోజులుగా క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహిస్తున్నామని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. 18 ఏళ్లు నిండిన అర్హులైన యువత ఓటరుగా నమోదు అయ్యేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి పౌరుడు తన పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకునేలా ప్రజలకు సమాచారం అందించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా SIR ప్రక్రియను పూర్తి చేస్తున్నామని తెలిపారు. బీఎల్‌ఓలు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సందేహాలను నివృత్తి చేయాలని, అర్హులైన వారు జాబితాలో నమోదు కాకుండా మిగిలిపోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అదే సమయంలో అనర్హుల పేర్లు కొనసాగకుండా నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని డైట్ కళాశాల, సంజయ్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సీఈఓ, కలెక్టర్ సందర్శించి సవరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రూ, ఎస్. రాజేశ్వర్, తహశీల్దార్లు శ్రీనివాస్, గణేష్, రమేష్, ఎన్నికల నాయబ్ తహశీల్దార్లు సూరజ్, ఇస్తారీ, ఎన్నికల సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్పీకర్ పట్ల అనుచిత వాక్యాలను తీవ్రంగా ఖండిస్తున్నాం



- **నిరసనగా కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం**
- **పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్**

**కోరుట్ల సెప్టెంబర్ 09 (వుదయం ప్రతినిధి)**

స్పీకర్ పట్ల అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మెల్సీ తాత మధు ను వెంటనే సస్పెండ్ చేయాలని కోరుతూ తాత మధు చేసిన అనుచిత వాక్యాలకు నిరసనగా పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ మాట్లాడుతూ తెలంగాణ శాసనసభ గౌరవాన్ని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ పదవి ప్రతిష్టను కించపరిచే విధంగా బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వాక్యాలు అవమానకరమైన వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం కోరుట్ల పట్టణ కొత్త బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం ముందు పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన చేపట్టడం జరిగిందని ఆయనను అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు వ్యవహార శైలిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమాలను చూసి తట్టుకోలేక బిఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను పక్కదో వపట్టిస్తున్నారని ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అటవీ , వన్యప్రాణుల రక్షణ చర్యలను మరింత బలోపేతం

**డివిజనల్ ఫారెస్ట్ అధికారి భార్గవ్ కుమార్**

**కాగజ్ నగర్ ( వుదయం ప్రతినిధి )**




అటవీ సంపద వన్యప్రాణుల సంరక్షణ మరింత బలోపథం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కాగజ్నగర్ అటవీ డివిజనల్ అధికారి భార్గవ్ కుమార్ తెలిపారు. బుధవారం కాగజ్ నగర్ అటవీ డివిజన్ అధికారులు ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతాల్లో అక్రమంగా చెట్ల నరికివేత, అటవీ భూముల ఆక్రమణ, వన్యప్రాణుల వేట మరియు ఇతర అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు నిరంతర పెట్రోలింగ్, రక్షణ గస్తీ, వాహన తనిఖీలు మరియు సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు. అటవీ సిబ్బంది ప్రతిరోజూ తమ పరిధిలోని అటవీ ప్రాంతాలను పర్యవేక్షిస్తూ, అనుమానాస్పద కార్యకలాపాలపై తక్షణమే చర్యలు తీసుకావాలని. అవసరమైన ప్రాంతాల్లో కెమెరా ట్రాప్స్, మొబైల్ ప్యాట్రోలింగ్ మరియు సాంకేతిక పర్యవేక్షణ వంటి ఆధునిక పద్ధతులను కూడా వినియోగించాలని తెలిపారు. అటవీ సంపదకు నష్టం కలిగించే అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేశారు. వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా వేట నిరోధక చర్యలు, నీటి వనరుల పర్యవేక్షణ, వన్యప్రాణుల కదలికల పరిశీలన కు డ్రోన్స్ వినియోగించాలని సిబ్బందికి సూచించారు. కాగజ్నగర్ ,సిర్పూర్ ,కర్జల్లి, బెజ్జూర్ ,పెంచికలపేట ఫారెస్ట్ రేంజ్ అధికారులు, డిప్యూటీ రేంజ్ అధికారులు, సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు పాల్గొన్నారు.

# మందమర్రి ఏరియాలో ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు

**మంచిర్యాల /మందమర్రి/ రామకృష్ణాపూర్/ సెప్టెంబర్09(వుదయం ప్రతినిధి)**



సింగరేణి మందమర్రి ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో ప్రజాకవి, పద్మవిభూషణ్ కాలోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై కాలోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జీఎం ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ.. కాలోజీ నారాయణరావు తన కలం, గళంతో తెలంగాణ ప్రజా చైతన్యానికి, భాషా వికాసానికి దిశానిర్దేశం చేశారని కొనియాడారు. కాలోజీ జయంతిని తెలంగాణ ప్రభుత్వం 'తెలంగాణ భాషా దినోత్సవం'గా నిర్వహించడం గర్వకారణమన్నారు."పుట్టుక నీది.. చావు నీది.. బతుకంతా దేశానిది" అనే సందేశంతో ప్రజల్లో చైతన్యం నింపిన కాలోజీ సిద్ధాంతాలు, ఆయన పాటించిన విలువలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. కాలోజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఎస్ఓటూజీఎం జి.ఎల్. ప్రసాద్, ఏఐటీయూసీ జి.ఎం. స్ట్రక్చర్ కమిటీ మెంబర్ సి.వి. రమణ, సీఎంఓఏఐ జాయింట్ సెక్రటరీ రవి, ఏరియా ఈఅండ్ఎం ఏజీఎం బాలాజీ భగవతిజ, కేకే ఏజెంట్ ఖదీర్, శాంతిఖని ఏజెంట్ సంతోష్ కుమార్, కేకేఓసీపీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాంబాబు, డీజీఎం (పర్సనల్) సి.హెచ్. అశోక్, సీనియర్ పీవో ఆర్. సత్యనారాయణతో పాటు ఏరియా ఉన్నతాధికారులు, వివిధ విభాగాల అధిపతులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొని కాలోజీ సేవలను స్మరించుకున్నారు.

# తెలంగాణ గర్వించదగ్గ మహనీయుడు కాళోజీ నారాయణరావు



**క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ గొడిసెల సంధ్యారాణి, రాజా రమేష్, కమిషనర్ మురళీకృష్ణ**

**మంచిర్యాల/ రామకృష్ణాపూర్/ సెప్టెంబర్ 09 (వుదయం ప్రతినిధి)**

తెలంగాణ గర్వించదగ్గ మహనీయుడు, తెలంగాణ వైతాళికుడు కాళోజీ నారాయణరావు అని క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ గొడిసెల సంధ్యారాణి, రాజా రమేష్, కమిషనర్ మురళీకృష్ణ అన్నారు.బుధవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలకు మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల ప్రతి ఉద్యమానికి ప్రతిధ్వనిగా నిలిచిన కాళోజీ నారాయణరావు ప్రజలందరికీ సుపరిచితులని అన్నారు. తెలంగాణ వైతాళికుడిగా తన జీవితాన్ని ప్రజల కోసం అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు. తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమమే ఊపిరిగా జీవించారని తెలిపారు.కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రభుత్వం నిర్వహించడం సంతోషకరమని అన్నారు.

విద్యార్థి దశలోనే నిజాం పాలనను ఎదిరించి, తెలంగాణలో విద్యా వ్యాప్తికి కృషి చేశారని గుర్తుచేశారు. తన రచనల ద్వారా ప్రజలను చైతన్యపరిచి సమాజానికి ఆదర్శంగా నిలిచారని తెలిపారు.కాళోజీ నారాయణరావు బహుభాషా కోవిదుడిగా, కవిగా, రచయితగా విశిష్ట సేవలు అందించారని అన్నారు. తెలుగుతో పాటు వివిధ భాషల్లో మానవ హక్కులు, కుల వివక్ష లేని సమాజం కోసం రచనలు చేశారని పేర్కొన్నారు.మహనీయుల ఆశయాలను కొనసాగిస్తూ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# శివాలయంలో అభిషేకం

**బెజ్జూర్, సెప్టెంబర్ 9 (వుదయం ప్రతినిధి )**



బెజ్జూర్ మండల కేంద్రంలోని శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం పురస్కరించుకొని నిత్యభిషేక కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు గురుదత్ ఆధ్వర్యంలో అభిషేకం, అర్చన, శివలింగానికి అన్నాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. శ్రీ రంగనాయక స్వామి, వీర హనుమాన్, శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు తంగడపల్లి మహేష్, భక్తులు వోల్లాల నాగభూషణ్ గౌడ్ శారద దంపతులు,నరేందర్ గౌడ్ విద్య దంపతులు, శ్రీరామ భాస్కర్ స్వప్న, భక్తులు పాల్గొన్నారు.

# హాస్టల్ తండా అంగన్‌వాడీలో రాష్ట్రీయ పోషణ మాసం

**జన్నారం,సెప్టెంబర్ 9 (వుదయం విలేఖరి)**



జన్నారం మండలం కవ్వాల్ హాస్టల్ తండా అంగన్‌వాడీ కేంద్రంలో 9వ రాష్ట్రీయ పోషణ మాసం సందర్భంగా పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జన్నారం ఐసీడిఎస్ సూపర్‌వైజర్ వాణి హాజరై ప్రతి ఒక్కరు పౌష్టికాహారం తీసుకోవాలని, పిల్లల వయసుకు తగిన అనుబంధ పోషకాహారం ఇవ్వాలని, ప్రోటీన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. అలా తీసుకుంటేనే పిల్లల వయసుకు తగ్గ బరువు, ఎత్తు, ఎత్తుకు తగ్గ బరువు పెరుగుతారని తెలిపారు.ఈ పోషణ మాసం కార్యక్రమం సెప్టెంబర్ 9 నుండి అక్టోబర్ 8 వరకు కొనసాగుతుందని, అందరు అంగన్‌వాడీ టీచర్లు తమ కేంద్రాల్లో షెడ్యూల్ వారీగా కార్యక్రమాలు నిర్వహించాలని సూపర్‌వైజర్ సూచించారు. అనంతరం పోషణ పై ప్రతిజ్ఞ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఐసీడిఎస్ సూపర్‌వైజర్ వాణి, అంగన్‌వాడీ టీచర్లు వజ్ర, నీలా, జిజియా, గర్భిణులు, పిల్లల తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టివేత

**బెజ్జూర్ ( వుదయం ప్రతినిధి )**

బెజ్జూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుష్నపల్లి బ్రిడ్జి వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, అక్రమంగా తరలిస్తున్న సుమారు 5 క్వింటాళ్ల పీడీఎస్ పట్టుకు పట్టుకున్నట్లు ఎస్ఐ ఎం.డి. సర్తాజ్ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సై సిబ్బంది తో కలిసి తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వస్తున్న ఆటోను ఆపి తనిఖీ చేయగా ఆటోలో 11 ప్లాస్టిక్ సంచుల్లో పీడీఎస్ బియ్యం ఉండగా డ్రైవర్ బోగ మహేష్‌గా గుర్తించామని బియ్యంతో పాటు ఆటో ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టమన్నారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం, రవాణా చేయడం లేదా విక్రయించడం చట్టవిరుద్ధమని, ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.



# పెరిక సంఘ భవన స్థలంపై సమావేశం

**జన్నారం,సెప్టెంబర్ 9 (వుదయం విలేఖరి)**

జన్నారం మండల పురగిరి క్షత్రియ పెరిక సంఘం కార్యవర్గ సమావేశం మండల కేంద్రంలో నిర్వహించారు.ఈ సమావేశంలో ప్రధానంగా జన్నారం మండల పెరిక సంఘం భవన నిర్మాణానికి స్థలం ఏర్పాటు, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై నాయకులు సుదీర్ఘంగా చర్చించారు.నాయకులు మాట్లాడుతూ జన్నారం మండల పెరిక సంఘానికి సొంత భవనం ఏర్పాటు ఎంతో అవసరమని, సంఘ సభ్యులందరూ ఐకమత్యంతో ముందుకు వచ్చి భవన నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా సంఘ భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని నిర్ణయించి, స్థలం కోసం బయానాగా పదివేల రూపాయలను అల్లం రవికి అందజేసారు.భవిష్యత్‌లో అదే స్థలంలో సంఘ భవన నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కార్యవర్గం నిర్ణయించింది.కార్యక్రమానికి జిల్లా నాయకులు అక్కల రమేష్, బొడ్డు తిరుపతి, సంగ మానయ్య, ఎన్. మల్లేష్, ముత్తె నారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.మండల పెరిక సంఘం అధ్యక్షులు కానిగంటి శివలింగు, గౌరవ అధ్యక్షులు ఎంబడి సత్యం, ప్రధాన కార్యదర్శి గూడా అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి తిరుపతి, ముత్యం సతీష్, మండల నాయకులు అల్లం రవి, పేరం శ్రీనివాస్, కుదర వెంకన్న, యువజన నాయకులు పేరం మహేందర్, కానిగంటి లక్ష్మణ్, కొట్టే హరికృష్ణ, అల్లం సురేష్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



# ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సర్పంచుల ముందస్తు అరెస్ట్

**నాగిరెడ్డిపేట,వుదయం**

విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా మండలానికి చెందిన ముగ్గురు సర్పంచులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. బేగం చెరువు తండా సర్పంచ్ మాలావత్ భాస్కర్ (బీజేపీ), గోపాల్‌పేట్ సర్పంచ్ రాజోపల్లి వంశీకృష్ణగౌడ్ (బీఆర్ఎస్), లను బుధవారం తెల్లవారుజామున 4.30 గంటలకు పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అరెస్టులతో తమ పోరాటాన్ని అడ్డుకోలేరని, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# వార్డ్ మెంబర్స్ ఫారం నియోజవర్గ ఇన్చార్జిగా మల్లికార్జున్

**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 09 (వుదయం న్యూస్):**



తెలంగాణ వార్డు మెంబర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి ఆదేశాల మేరకు లక్షెట్టిపేట మండలం సూరారం గ్రామానికి చెందిన ఐదవ వార్డ్ మెంబర్ పెట్టం మల్లికార్జున్ ను మంచిర్యాల నియోజకవర్గ వార్డ్ మెంబర్స్ ఫోరం ఇన్చార్జిగా నియమించారు. ఈ మేరకు బుధవారం మల్లికార్జున్ కు జిల్లా వార్డ్ మెంబర్స్ ఫోరం ఇంచార్జ్ ముక్త సంతోష్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పెట్టం మల్లికార్జున్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. తనకు ఈ బాధ్యత అప్పగించినందుకు రాష్ట్ర ఫోరమ్ వ్యవస్థాపక అధ్యక్షురాలు నాగజ్యోతి, మంచిర్యాల జిల్లా వార్డ్ మెంబర్స్ పోరం ఇంచార్జ్ ముక్త సంతోష్ కుమార్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దండేపల్లి మండల ఇంచార్జ్ సుదర్శన్, వార్డు సభ్యులు, పాల్గొన్నారు.

# దళిత వ్యతిరేకి కల్వకుంట్ల కుటుంబం



**విలేకరుల సమావేశంలో జువ్వాడి కృష్ణారావు**

**కోరుట్ల సెప్టెంబర్ 09(వుదయం ప్రతినిధి)**

ఎమ్మెల్సీ తాత మధు స్పీకర్ పై చేసిన అనుచిత వాక్యాలను తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కల్వకుంట్ల కుటుంబం దళితుల వ్యతిరేకులని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు సోమవారం హైదరాబాదు లో ఎమ్మెల్సీ తాతా మధు రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై చేసిన వ్యాఖ్యలకు స్పందిస్తూ మంగళవారం నియోజకవర్గ కేంద్రమైన కోరుట్ల పట్టణ జువ్వాడి కృష్ణారావు స్వగృహం జువ్వాడి భవన్లో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ 10 సంవత్సరాలు అధికారంలో ఉండి చేయలేని పనులను కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో చేపడుతుందని ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి నాడు ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత కల్వకుంట్ల కుటుంబానిదేనని బిఆర్ఎస్ పార్టీ చేసిన అప్పులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెల్లిస్తున్నారని విదేశీ పెట్టుబడులను తీసుకురావడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక కృషి చేస్తున్నారన్నారు రైతు నియోజకవర్గంలో రైతు ఆధారిత పరిశ్రమ అయినటువంటి ముత్యంపేట చక్కర కర్మాగారాన్ని 170 కోట్ల బ్యాంకు రుణాలు చెల్లించి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు 10 సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో ఒక్క నూతన రేషన్ కార్డును కూడా మంజూరు చేయలేదని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నూతన రేషన్ కార్డులను మంజూరు చేయడమే కాకుండా దేశంలో ఎక్కడా లేనివిధంగా రేషన్ దుకాణాల ద్వారా నిరుపేదలు కూడా కడుపునిండా తినాలని సంకల్పంతో సన్న బియ్యాన్ని పంపిణీ చేయడం జరుగుతుందన్నారు పేద మధ్య తరగతి ప్రజలకు విద్యుత్ భారాన్ని తగ్గించేందుకు 200 యూనిట్ల వరకు ఉచిత సరఫరా చేయడం జరుగుతుందన్నారు స్వర్గీయ మాజీమంత్రి రత్నాకర్ రావు కోరుట్ల పట్టణంలో సుమారు 5000 ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇస్తే గడచిన పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో కేవలం 80 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మాత్రమే నిర్మించారని అది కూడా వారికి అనుకూలంగా ఉన్నవారికి ఇచ్చారన్నారు టీటీడీ బోర్డు మెంబర్ గా ఉండి కూడా మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు టీటీడీ కల్యాణ మండపానికి ఒక్క రూపాయి నిధులు కూడా మంజూరు చేయించలేదని అలాగే వెంకటేశ్వర దేవాలయంలో ఉన్న ఉప ఆలయాల్లో విగ్రహాలను ఏర్పాటు చేయలేదని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆలయాల్లో విగ్రహాలు ఏర్పాటు చేయడమే కాకుండా కళ్యాణ మండపానికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోలేదని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ పాఠశాలలకు అధిక నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు శాసనసభ స్పీకర్ గా దళితుడు ఉన్నత స్థానంలో ఉండగా ఆయనను అధ్యక్ష అని పిలవాల్సిన పరిస్థితి ఉంటుందని కెసిఆర్ శాసనసభ కు అసలు రావడంలేదని గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అప్పటి సీఎల్పీ నాయకుడు ప్రతిపక్ష నేత మల్లు భట్టి విక్రమార్క ప్రతిపక్ష నాయకుడిగా కాంగ్రెస్ పార్టీ నియమించిందని దీంతో కేసీఆర్ తన అహంకారంతో దళిత వ్యతిరేకతతో మల్లు భట్టి విక్రమార్క ప్రతిపక్ష హోదాను తొలగించిన దుర్మార్గుడు కేసీఆర్ అన్నారు తెలంగాణ లో కెసిఆర్ అధికారంలోకి రాకముందు తెలంగాణ రాష్ట్రా ఏర్పాటు జరిగితే దళితున్నే ముఖ్యమంత్రి చేస్తానని మాటిచ్చి మోసం చేశాడని అలాగే దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని చెప్పి మోసం చేశాడని దళితులను మోసం చేసిన వ్యక్తి కె చంద్రశేఖర్ రావు అని అన్నారు ఉన్నత పదవిలో ఉన్నటువంటి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై అనుచిత వ్యాఖ్యలు చేసి ఆయనను అవమానించినటువంటి విషయం సామాన్యమైనది కాదని భారత రాజ్యాంగాన్ని వ్యతిరేకించినట్లేనని అన్నారు భారత రాజ్యాంగం ను వ్యతిరేకిస్తే భారతీయ న్యాయ సంహిత బిఎన్ఎస్) లో ఏ శిక్ష విధించాలని ఉందో అదేవిధంగా స్పీకర్ ను అవమానించిన వారిని శిక్షించాలని తాతా మధును శాసనమండలి సభ్యత్వం నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు కోరుట్ల నియోజకవర్గం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు కల్వకుంట్ల కుటుంబం తండ్రి కొడుకులు రాజ్యమేలుతున్నారని అవినీతి కమిషన్లతో సంపాదించిన డబ్బులు ఖర్చుపెట్టి ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలు చేయిస్తున్నారన్నారు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు మెట్పల్లి మండలం కొండ్రికర్ల వాగుపై వంతెన నిర్మిస్తామని బాండ్ పేపర్ పై రాసి ఇచ్చి మాట తప్పడని కానీ నేడు తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వడి నర్సింగరావు నాయకత్వంలో వంతెన మంజూరు చేయించడం తోపాటు నేడు సగానికి పైగా నిర్మాణం పూర్తయిందని త్వరలోనే మిగతా పని కూడా పూర్తి చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ జిల్లా కాంగ్రెస్ మైనారిటీ విభాగం అధ్యక్షులు నయీమ్ మున్సిపల్ వైస్ చైర్మన్ షాహిద్ కౌన్సిలర్ లు మోర్తాడ్ లక్ష్మి నారాయణ వాసీద్ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు జిల్లా మైనార్టీ అధ్యక్షులు ఎంఏ నయీమ్ నాయకులు రిజ్వాన్ పాషా శ్రీ వెంకటేశ్వర దేవస్థానం ధర్మకర్తల మండల అధ్యక్షులు ఎతిరాజం నర్సయ్య కో ఆప్షన్ సభ్యులు బొద్దురి సతీష్ కుమార్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి రాజోజీ సదానందచారి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఎలేటి మహిపాల్ రెడ్డి నాయకులు భూమయ్య నజ్జు కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాలో ఉన్న నాయకులు యువజన కాంగ్రెస్ ఎన్ ఎస్ యు ఐ విభాగాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ నుంచి బీఆర్ఎస్ లోకి చేరికలు



**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 9 (వుదయం న్యూస్) :**

మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ మండల నాయకుడు,గత సర్పంచ్ ఎన్నికల్లో 500 ఓట్లు సాధించిన సంగ లచ్చన్న బుధవారం మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.బీఆర్ఎస్ మండల అధ్యక్షులు చుంచు చిన్నయ్య, ఉపాధ్యక్షులు అంకతి రమేష్, గ్రామ కమిటీ అధ్యక్షులు ఇండ్ల లింగన్న ఆధ్వర్యంలో మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు గారు లచ్చన్నకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా లచ్చన్న మాట్లాడుతూ "మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నాను అని అన్నారు రాబోవు రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ నాయకత్వంలో మంచిర్యాల నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తాను అని తెలిపారు.

# నీటి కుంటలో మునిగి రైతు మృతి

**పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు మృత్యువాత**

**నిజాంసాగర్ సెప్టెంబర్ 09 (వుదయం ప్రతినిధి):**



మహమ్మద్‌నగర్ మండలం హసన్‌పల్లి గ్రామానికి చెందిన రైతు సుంకే సాయిలు (38) ప్రమాదవశాత్తు నీటి కుంటలో మునిగి మృతి చెందినట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. నిజాంసాగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది.

ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం పొలానికి నీరు అందించేందుకు వెళ్లిన సాయిలు గ్రామ పరిధిలోని బోయినోళ్ల జాలకుంట తూము వద్ద ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. సాయిలు నీటిలో మునిగిపోవడాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి అతడిని బయటకు తీశారు. అయితే అప్పటికే సాయిలు మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి భార్య అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు శవపంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

# పర్యాటక అభివృద్ధికి మూడేళ్ల సమగ్ర ప్రణాళిక: కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్




నాగర్‌కర్నూల్ (వుదయం): నాగర్‌కర్నూల్ జిల్లాను ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు మూడేళ్ల సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో సహజ, చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక పర్యాటక రంగాల్లో అపార అవకాశాలు ఉన్నాయని, సోమశిల, నల్లమల్ల అటవీ ప్రాంతాలతో పాటు ఇతర పర్యాటక ప్రదేశాలను ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. పర్యాటకులకు అవసరమైన మౌలిక వసతులు, రహదారుల నిర్మాణంతో పాటు విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపడతామని, ప్రైవేట్ పెట్టుబడులు, సీఎస్ఆర్ నిధులు, ప్రభుత్వ పథకాల అనుసంధానంతో పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. పర్యాటక రంగంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పిస్తూ ప్రభుత్వ భూములను సమర్థంగా వినియోగించుకుంటామన్నారు. అలాగే 'జ్ఞాన భారతం మిషన్'లో భాగంగా జిల్లాలోని చారిత్రక ప్రదేశాలు, దేవాలయాల్లో లభించే తెలుగు, ఉర్దూ తదితర భాషల ప్రాచీన గ్రంథాలు, మాన్యుస్క్రిప్టులను గుర్తించి, నిపుణులు, పండితుల సహకారంతో సర్వే చేసి సంరక్షించడంతో పాటు డిజిటలైజ్ చేస్తామన్నారు. దీనివల్ల మన చారిత్రక వారసత్వాన్ని పరిరక్షించి భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉంచవచ్చని పేర్కొంటూ, ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

# గణేష్ ఉత్సవాలపై ఆర్గనైజర్లకు పోలీసుల కీలక సూచనలు

## విద్యుత్ ,అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి : సీఐ సైదానాయక్






రామాయంపేట (వుదయం) : గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని రామాయంపేట సర్కిల్ పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్, ఫైర్ సేఫ్టీ శాఖల అధికారులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక దౌలతాబాద్ రోడ్డులోని కళ్యాణి శుభ వేదిక ఫంక్షన్ హాల్‌లో గణేష్ ఉత్సవాలపై నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో మండపాల నిర్వాహకులకు అధికారులు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రామాయంపేట ఎస్ఐ బలరాజ్ మాట్లాడుతూ మండపాల వద్ద విద్యుత్ కనెక్షన్లు, స్టేజ్ డెకరేషన్ లైట్లు ఏర్పాటు చేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించగా, ఫైర్ సేఫ్టీ అధికారులు విద్యుత్ వైర్లు, జాయింట్ల విషయంలో అప్రమత్తంగా ఉంటూ అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మండపాల వద్ద మద్యం సేవించి గొడవలకు పాల్పడకూడదని తహసీల్దార్ రజినీకుమారి స్పష్టం చేశారు. మున్సిపల్ కమిషనర్ రవీందర్ మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని ప్రతిబింబించేలా ఉత్సవాలు నిర్వహించాలని, అన్నప్రసాదాల పంపిణీలో పరిశుభ్రత పాటిస్తూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని కోరారు. అలాగే భజనలు, కోలాటాలు, జానపద నృత్యాలు నిర్వహిస్తూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. సీఐ బి.సైదానాయక్ మాట్లాడుతూ విగ్రహాలను తీసుకువచ్చే సమయం నుంచి నిమజ్జనం వరకు నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని, ఉత్సవాల్లో డీజేలకు ఎలాంటి అనుమతి లేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రామాయంపేట, చేగుంట, శంకరంపేట-ఆర్, నార్సింగి, నిజాంపేట పోలీస్‌స్టేషన్ల పరిధిలోని నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. - (వుదయం ప్రతినిధి రాజాగౌడ్)

# ఆశ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి : సీఐటీయూ

## కనీస వేతనం అమలు చేయాలని ఆశ వర్కర్ల నిరసన



రామాయంపేట (వుదయం) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చి, ఆశ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ రామాయంపేట మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు బుధవారం స్థానిక బస్టాండ్ ఎదుట రోడ్డుపై ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుదీర్ఘ కాలంగా ప్రజలకు నిరంతరాయంగా వైద్య సేవలందిస్తూ కీలక పాత్ర పోషిస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం అత్యంత విచారకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆశ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు, కనీస వేతనం అమలు చేసి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని గట్టిగా డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు పోరాటాన్ని ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

# మహబూబ్‌నగర్ జిల్లాలో.. పర్యాటక ప్రాంతాలకు అభివృద్ధి ప్రణాళికలు... కలెక్టర్



మహబూబ్‌నగర్ (వుదయం) : జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ముమ్మర చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. బుధవారం రాష్ట్ర పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణి ప్రసాద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ.. కోయిల్ కొండ మండలం రాం కొండను 'బెస్ట్ టూరిజం విలేజ్'గా తీర్చిదిద్ది, ఫిల్మ్ షూటింగ్‌లకు అనువుగా అభివృద్ధి చేసే ప్రతిపాదనలతో పాటు, జడ్చర్లలో హెరిటేజ్, టూరిజం ప్లాజాలను పి.పి.పి విధానంలో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు వివరించారు. జిల్లాల్లో పర్యాటక రంగ అభివృద్ధి, ఫైవ్ స్టార్ హోటళ్ల నిర్మాణం, మౌలిక సౌకర్యాల కల్పన, సి.ఎస్.ఆర్ నిధుల సమీకరణ, మూడంచల అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికలపై ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణి ప్రసాద్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు పర్యాటక ప్రాంతాల సందర్శనతో పాటు వ్యాసరచన, వక్తృత్వం, పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లా టూరిజం నోడల్ అధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జ్ఞాన భారత్ నోడల్ అధికారిగా క్రిస్టినాలను నామినేట్ చేసినట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర స్థాయి నుంచి పర్యాటక శాఖ డైరెక్టర్ రంజిత్ నాయక్, కల్చర్, హెరిటేజ్ డైరెక్టర్లు పాల్గొనగా, జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో పాటు అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జిల్లా పర్యాటక శాఖ అధికారి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిన్ గుర్తిలో ఇళ్ల మధ్య లో మురుగు నీరు..



తాండూరు (వుదయం) : మండల పరిధిలోని జిన్ గుర్తి గ్రామంలో పారిశుధ్య లోపం తాండవిస్తోందని, సరైన మురుగు నీటి కాలువలు లేకపోవడంతో తీవ్ర అపరిశుభ్రత నెలకొందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని 6వ వార్డు పరిధిలోని దస్తయ్య గౌడ్, బోయిని నర్సమ్మ ఇళ్ల నుంచి చిన్నప్ప ఇంటి వరకు డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. ఇళ్ల మధ్య నిలిచిన ఈ నీటి వల్ల తీవ్ర దుర్గంధం వెదజల్లడమే కాకుండా దోమలు విపరీతంగా ప్రబలి రోగాలు వ్యాపించే ప్రమాదం ఉందని, పలుచోట్ల చెత్త దిబ్బలు పేరుకుపోవడంతో కాలనీ వాసులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పారిశుధ్య సమస్యపై స్థానిక పంచాయతీ అధికారులకు, సిబ్బందికి పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) విశ్వప్రసాద్ స్వయంగా స్పందించి, జిన్ గుర్తి గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించేలా పంచాయతీ కార్యదర్శిని, సిబ్బందిని ఆదేశించాలని, తక్షణమే మురుగునీటి నిల్వలను తొలగించి తగిన పారిశుధ్య చర్యలు చేపట్టాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి




సంగారెడ్డి (వుదయం) : జిల్లాలో గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గణేష్ ఉత్సవాలు, శోభాయాత్రలు, నిమజ్జన కార్యక్రమాలను సురక్షితంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందే పూర్తి చేయాలని, మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు జరగకుండా నాణ్యమైన వైరింగ్ ఉండేలా చూడాలని, నిమజ్జన ఘాట్ల వద్ద గజ ఈతగాళ్లు, క్రేన్లు, నిరంతర విద్యుత్, బారికేడింగ్, అత్యవసర వైద్యం, తాగునీరు, పారిశుధ్యం, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. పర్యావరణ పరిరక్షణకై మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించేలా ప్రజలలో విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, ఉత్సవాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని, నిర్వాహకులు నిబంధనలు పాటించాలని సూచించారు. అనంతరం కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన గోడపత్రికలను కలెక్టర్, ఎస్పీ ఆవిష్కరించి, మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, కాలుష్య నియంత్రణ మండలి, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్అండ్‌బీ, మత్స్యశాఖ, నీటిపారుదల, వైద్య ఆరోగ్యశాఖ, పోలీస్, అగ్నిమాపక శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, సంగారెడ్డి తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్ధికి విద్యార్థుల భాగస్వామ్యం కీలకం: డా. దేవేంద్ర నాథ్ దశ్

## రాయికల్‌లో ఉన్నత భారత్ అభియాన్ అవగాహన కార్యక్రమం




షాద్‌నగర్ (వుదయం) : రాయికల్‌లోని మూన్‌రే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో ఉన్నత భారత్ అభియాన్ (యూబీఏ)పై అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రాంతీయ సమన్వయకర్త డాక్టర్ దేవేంద్ర నాథ్ దశ్ ఉన్నత భారత్ అభియాన్ ముఖ్య ఉద్దేశాలను తెలియజేస్తూ, గ్రామీణాభివృద్ధిలో విద్యార్థులు, అధ్యాపకుల పాత్ర అత్యంత కీలకమని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి విద్య, ఆరోగ్యం, పారిశుధ్యం, పోషకాహారం మరియు పర్యావరణ పరిరక్షణ వంటి విభాగాలలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులు సమాజంతో మమేకమై పల్లెల అభ్యున్నతికి తమ వంతు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ (డా.) బొల్లెదుల రాజ్ కుమార్, సంస్థ సమన్వయకర్త డాక్టర్ వినోద్, డాక్టర్ రమేష్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సదస్సు విద్యార్థుల్లో సామాజిక స్పృహను, సేవాభావాన్ని పెంపొందించేందుకు ఎంతగానో దోహదపడింది.

# క్రీడల్లో స్వర్ణ పతక విజేతలకు కలెక్టర్ సన్మానం - రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ లో నాగర్ కర్నూల్ క్రీడాకారుల ప్రతిభ



నాగర్ కర్నూల్ (వుదయం) : రాష్ట్రస్థాయి అత్యా పాత్య పోటీల్లో స్వర్ణ పతకం సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచిన నాగర్ కర్నూల్ జిల్లా అండర్-17 బాలికల జట్టుతో పాటు తృతీయ స్థానం సాధించిన బాలుర జట్టును జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ బుధవారం కలెక్టరేట్‌లో ఘనంగా సన్మానించారు. నిర్మల్ జిల్లాలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఆగస్టు 29, 30 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-17 జూనియర్ అత్యా పాత్య పోటీల్లో బాలికల జట్టు ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోగా, బాలుర జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విజేతలను శాలువాలతో సన్మానించి అభినందించిన కలెక్టర్ మాట్లాడుతూ... క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని, ఈ రాష్ట్రస్థాయి విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని జాతీయస్థాయిలోనూ రాణించాలని సూచించారు. జిల్లాలోని క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహం, సరైన శిక్షణ అందించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ అభినందన కార్యక్రమంలో డీఎఫ్ఓ రేవంత్ చంద్ర, ఎస్జీఎఫ్ కార్యదర్శి నాగేశ్వరరావు, అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్, జనరల్ సెక్రటరీ అంజయ్య, ట్రెజరర్ రవీందర్, జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్, పీఈటీలు అశోక్, రాఘవేందర్, మల్లేష్, వరలక్ష్మి, లలిత, సింధు, నిర్మల, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీలకు అండగా 'కంజర్ల విజయలక్ష్మి ఫౌండేషన్

## గడప గడపకూ శ్రీమంతం కార్యక్రమాలు కంచర్ల విజయలక్ష్మి



తాండూరు (వుదయం) : గర్భిణీ మహిళలకు కుటుంబ సభ్యురాలిగా అండగా నిలుస్తూ కంజర్ల విజయలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'గడప గడపకూ శ్రీమంతం' కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. తాండూర్ మండల పరిధిలోని అల్లాపూర్, సంకిరెడ్డిపల్లి, అంతారం తండా గ్రామాల్లో ఫౌండేషన్ చైర్‌పర్సన్ కంజర్ల విజయలక్ష్మి స్వయంగా గర్భిణీల ఇళ్లకు వెళ్లి వారిని ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా మహిళలకు సాంప్రదాయబద్ధంగా సీమంతం జరిపించి, పుట్టబోయే తల్లీబిడ్డలు క్షేమంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఆశీస్సులు అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతి తల్లి ముఖంలో చిరునవ్వు చూడటంతో పాటు ప్రతి బిడ్డ ఆరోగ్యంగా జన్మించాలనే లక్ష్యంతోనే తమ ఫౌండేషన్ పనిచేస్తోందని, మహిళల సంతోషమే తమ ప్రధాన ధ్యేయమని తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవాలనే ఉద్దేశంతోనే గ్రామ గ్రామాన, గడప గడపకూ ఇలాంటి సామాజిక, సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అత్యంత వేడుకగా జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నందిని యాదయ్య గౌడ్, బి.రమేష్, సురేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నవీన్ గౌడ్, సునీల్ గౌడ్, ప్రకాష్ గౌడ్, రమేష్ యాదవ్, బోయిని రాజు, వెంకటేష్ చారి, శంకర్ చారి, సంగం పాండు, ఎల్లేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు 18 గంటల విద్యుత్ సరఫరా చేయాలి

**ఎస్ఈకి వినతిపత్రం అందజేసిన వంగ రాజేశ్వర్ రెడ్డి**



వుదయం, సిద్దిపేట ప్రతినిధి : రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, రైతుల పక్షాన ఎల్లవేళలా అండగా ఉంటానని వంగ రాజేశ్వర్ రెడ్డి అన్నారు. రైతులకు ప్రస్తుతం సుమారు 10 గంటల విద్యుత్ మాత్రమే అందుతుండటంతో పంటలను కాపాడుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. కనీసం 18 గంటల పాటు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ అధికారులను కోరారు.ఈ మేరకు సిద్దిపేటలో విద్యుత్ శాఖ ఎస్ఈని కలిసి వినతిపత్రం అందజేసి రైతుల సమస్యలపై మాట్లాడారు. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో పంటలను కాపాడుకోవాలంటే అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరా ఎంతో కీలకమని పేర్కొన్నారు. సిద్దిపేట పరిసర ప్రాంతాల్లో కాల్వలు అందుబాటులో ఉన్నప్పటికీ చెరువులు, కుంటలకు సాగునీరు చేరకపోవడం దురదృష్టకరమన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నందున ప్రభుత్వం వెంటనే స్పందించి అందుబాటులో ఉన్న నీటి వనరులను వినియోగించి చెరువులు, కుంటలను నీటితో నింపేలా చర్యలు చేపట్టాలని కోరారు.రైతుల సమస్యలను రాజకీయాలకు అతీతంగా పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని వంగ రాజేశ్వర్ రెడ్డి తెలిపారు.ఆయన వెంట వివిధ గ్రామాల రైతులు ఉన్నారు.

## మూసాపేట మండలం వేముల గ్రామంలో పర్యటించిన జిల్లా కలెక్టర్



మహబూబ్‌నగర్ (వుదయం): మూసాపేట మండలం వేముల గ్రామంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా బుధవారం విస్తృతంగా పర్యటించి పాఠశాలలు, పల్లె దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. వేముల జడ్.పి.హెచ్.ఎస్‌లో విద్యాబోధన, వసతులు, ల్యాబ్‌లు, అక్షయపాత్ర భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్, పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి గణితంలో మంచి మార్కుల సాధనకు సూత్రాల నిరంతర సాధన అవసరమని మార్గదర్శనం చేశారు. 'శతక మధురిమ' పుస్తకాన్ని రచించిన విద్యార్థిని కుమారి మాధురిని ప్రత్యేకంగా అభినందించారు. పిఎం శ్రీ, సిఎస్ఆర్ నిధులతో పాఠశాలను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. అనంతరం పల్లె దవాఖానలో వైద్య సేవలు, ఉచిత మందుల నిల్వలను తనిఖీ చేసి, స్థానికుల నుంచి ప్రభుత్వ సేవలపై వివరాలు సేకరించారు. ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన పిదప అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ నిర్దేశిత మెనూ ప్రకారం కాకుండా, సాధారణ అన్నంపై గుడ్డు వేసి 'ఎగ్ బిర్యానీ'గా అందించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, బాధ్యులైన సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. నిబంధనల ప్రకారం పౌష్టికాహారం అందించాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో మండల, గ్రామ అధికారులు ఉన్నారు.

## ప్రత్యేక అవసరాల పిల్లలు అన్ని రంగాల్లో రాణించాలి: డీఈఓ రమేష్ కుమార్




నాగర్ కర్నూల్ (వుదయం) : ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను తల్లిదండ్రులు ఎంతమాత్రం భారంగా భావించకుండా, ప్రభుత్వం అందిస్తున్న విద్యా, శిక్షణ, సంక్షేమ సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ సమాజంలో అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) రమేష్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని డీకేఆర్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల సంరక్షణ, విద్య, ప్రభుత్వ సదుపాయాలపై నిర్వహించిన తల్లిదండ్రుల అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రత్యేక అవసరాల పిల్లల విద్యాభివృద్ధికి విద్యాశాఖ అనేక సదుపాయాలు, అలవెన్సులు, ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను అందిస్తోందని తెలిపారు. జిల్లాలో వివిధ వైకల్యాలు కలిగిన 2,514 మంది విద్యార్థులకు విద్యను అందించేందుకు 20 మంది ఐఆర్పీలు, 55 మంది ప్రత్యేక ఉపాధ్యాయులు సేవలు అందిస్తున్నారని వివరించారు. ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని గుర్తించి, అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇవ్వడం ద్వారా ఆత్మవిశ్వాసం పెంపొందించాలన్నారు. తల్లిదండ్రులు నిరాశ, నిస్పృహలకు గురికాకుండా ధైర్యంగా ముందుకు సాగుతూ విద్యాశాఖ అధికారులు, ప్రత్యేక ఉపాధ్యాయుల సహకారం తీసుకోవాలని సూచించారు. సరైన ప్రోత్సాహం, నిరంతర శిక్షణ ఉంటే వీరు ఉన్నత స్థానాలను అధిరోహించగలరని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, సమగ్ర శిక్షా అభియాన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిల్లల్లోని ప్రతిభను గుర్తించి అవకాశాలు కల్పిస్తే విద్య, క్రీడలు, సాంస్కృతిక, ఉద్యోగ రంగాల్లో రాణించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి కురుమయ్య, ఏఎంఓ కిరణ్ కుమార్, ఏఎస్ఓ మాధవరెడ్డి, డీఎస్ఓ శైలజ, జీసీడీఓ నిర్మలతో పాటు ఐఆర్పీలు, ప్రత్యేక ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పర్యాటక అభివృద్ధికి మూడేళ్ల సమగ్ర కార్యాచరణ



గద్వాల (వుదయం): జిల్లాలోని ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను గుర్తించి, పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు మూడేళ్ల సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించి పకడ్బందీగా అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలు, జ్ఞాన భారతం మిషన్ అమలుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్ మాట్లాడుతూ, ప్రతి జిల్లాలో పర్యాటక అభివృద్ధి కార్యక్రమాల సమన్వయానికి ప్రత్యేక నోడల్ అధికారిని నియమించాలని సూచించారు. సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని జిల్లాల్లోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించాలని, రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 142 వారాంతపు పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, పెట్టుబడి అవకాశాలు, ప్రచార కార్యక్రమాలను సమగ్రంగా రూపొందించాలని ఆదేశించారు. ప్రతి జిల్లాకు మూడు సంవత్సరాల పర్యాటక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి, ప్రాధాన్యత కలిగిన పర్యాటక ప్రాంతాలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మౌలిక వసతులు, సందర్శకుల సౌకర్యాలు, పెట్టుబడి అవకాశాలు, ప్రచార కార్యక్రమాలను స్పష్టమైన కాలపరిమితులతో అందులో పొందుపరచాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ స్పందిస్తూ, జిల్లా పరిధిలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి మరియు పర్యాటక రంగాన్ని పటిష్టం చేసేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రణాళికాబద్ధంగా తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## మద్యం డిపోలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



తిమ్మాజీపేట, సెప్టెంబర్ 09 (వుదయం) : తిమ్మాజీపేట మండల పరిధిలోని తెలంగాణ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (TSBCL) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐఎంఎల్ (IML) మద్యం డిపోను జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిపోలోని మద్యం నిల్వలు, సరఫరా విధానం, రికార్డులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, సరఫరా వ్యవస్థలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిబంధనల ప్రకారం పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. నకిలీ మద్యం వల్ల ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ప్రమాదం వాటిల్లుతుందని, అక్రమ రవాణా, సరఫరాపై నిరంతరం నిఘా ఉంచి అనుమానాస్పద కదలికలపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. అలాగే డిపోలో అగ్నిప్రమాదాల నివారణకు ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం డిపోలో 75 వేల బీర్ కాటన్లు, సుమారు 62 వేల లిక్కర్ కాటన్ల నిల్వలు ఉన్నాయని, ఇక్కడి నుంచి నాగర్ కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, మహబూబ్ నగర్, షాద్ నగర్, కోస్గి, కొడంగల్ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఎక్సైజ్ సూపరింటెండెంట్ వేణుగోపాల్ రెడ్డి, డిపో మేనేజర్ మల్లికార్జున్, స్టోర్ ఆఫీసర్ మధు, తహసీల్దార్ జయంతి తదితర ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మండల పశువైద్య కేంద్రము ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా పశుసంవర్ధక అధికారి.



పాపన్నపేట (వుదయం) : మండల కేంద్రంలోని పశువైద్య కార్యాలయాన్ని జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి టి. ఆదిత్య వర్మ ఆకస్మికంగా సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పశువైద్య సేవల తీరుపై ఆరా తీసిన ఆయన, అనంతరం సిబ్బందితో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పశువులకు వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించాలని, నివారణ టీకాల కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. పశువైద్య శిబిరాల నిర్వహణతో పాటు కృత్రిమ గర్భాధారణ కార్యక్రమాల పురోగతి, వాటి ఆన్‌లైన్ నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పశుసంపద అభివృద్ధికి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు ప్రతి పశుపోషకుడికి చేరేలా అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో మండల పశు వైద్యాధికారులు డాక్టర్ సౌమ్య రెడ్డి, డాక్టర్ ప్రవీణ్ కుమార్, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ సతీష్ కుమార్, శివాజీ, ఎల్ఎస్ఏలు సురేష్, రాకేష్, కార్యాలయ సిబ్బంది మరియు గోపాల మిత్రులు పాల్గొన్నారు.

## పార్టీలో పదవులు రాని వారు నిరాశ చెందొద్దు, పదవులు వచ్చినా రాకున్నా నేను అందరినీ గుర్తిస్తా

**సంగారెడ్డి నియోజకవర్గంలోని 4 మండలాలు , 2 మున్సిపాలిటీల కాంగ్రెస్ పార్టీ కమిటీల నియామక సమావేశంలో జగ్గారెడ్డి**



సంగారెడ్డి (వుదయం) : సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కమిటీల నియామక సమావేశం బుధవారం పట్టణంలోని క్లాసిక్ గార్డెన్స్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డిల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల కాంగ్రెస్ కమిటీలతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళా, ఐఎన్‌టీయూసీ, కిసాన్ సెల్ వంటి అనుబంధ సంఘాల కమిటీలను ప్రకటించారు. ఈ సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ, పదవులు వచ్చిన వారు, రాని వారు అనే భేదం లేకుండా ప్రతి ఒక్కరినీ గుర్తించి పార్టీ బలోపేతానికి ప్రాధాన్యత ఇస్తామని, కార్యకర్తలు నిరాశ చెందకుండా సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అలాగే, నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా త్వరలోనే వరుస సమీక్షా సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. నాలుగు మండలాల పరిధిలో గెలిచిన, ఓడిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులతో అధికారుల సమక్షంలో ప్రత్యేక రివ్యూలు చేపడతామని, రెండు మున్సిపాలిటీలకు సంబంధించి కూడా ఇటువంటి ప్రత్యేక సమావేశాలే నిర్వహిస్తామని వెల్లడించారు. సెప్టెంబర్ 30 నుంచి నాలుగు రోజుల పాటు వరుసగా అధికారులతో సమావేశాలు నిర్వహించి, ప్రతి ఒక్కరితో ముఖాముఖి మాట్లాడతామని తెలిపారు. పోలీసు శాఖతో పాటు అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులను ఈ సమీక్షలకు ఆహ్వానించి ప్రజా సమస్యలపై చర్చిస్తామని, కాంగ్రెస్ శ్రేణులు సమన్వయంతో ప్రజలకు మరింత చేరువ కావాలని జగ్గారెడ్డి పిలుపునిచ్చారు.

## దుబ్బాకలో జనసేన శాంతియుత నిరసన

**బీఆర్ఎస్ , కాంగ్రెస్ పాలనపై జనసేన నేతల ఆగ్రహం**



దుబ్బాక (వుదయం) : బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు, వైఫల్యాలను నిరసిస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో దుబ్బాక పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో శాంతియుత నిరసన చేపట్టారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి నేమూరి శంకర్ గౌడ్ ఆదేశాల మేరకు దుబ్బాక నియోజకవర్గ జనసేన నాయకుడు మారోజు లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసనలో నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులు చేతబూని ప్రభుత్వ వైఫల్యాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ నాయకుడు మారోజు లక్ష్మణ్ మాట్లాడుతూ.. తమకు రాముడి పాలన కావాలని, రాక్షస పాలన వద్దని హితవు పలికారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో దుబ్బాక నియోజకవర్గం ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రెండు ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని ఆరోపించారు. ప్రజా సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు జనసేన నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని, ప్రభుత్వాల తీరులో మార్పు వచ్చే వరకు ప్రజా పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో జనసేన పార్టీ కీలక నాయకులు, కార్యకర్తలు గొడుగు యాదగిరి, విజయ్, అశోక్, ఉపేందర్, ప్రశాంత్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోస్టర్ ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



మహబూబ్‌నగర్ (వుదయం) : జిల్లాలో పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రజల భాగస్వామ్యంతో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 9వ రాష్ట్రీయ పోషణ్ మాహ్–2026 పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు నెల రోజుల పాటు నిర్వహించనున్న పోషణ్ మాహ్ కార్యక్రమాలను జిల్లాలో విజయవంతంగా చేపట్టాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రజల్లో సామాజిక బాధ్యత, సామూహిక యాజమాన్య భావనను పెంపొందించాలని, చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన పోషకాహారం అందించడంతో పాటు పిల్లల ఆరోగ్యం, ఎదుగుదల, ప్రారంభ దశలోనే సరైన పోషణ, మానసిక వికాసానికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను పోషణ, సంరక్షణ, బాల్య వికాసానికి కీలక వేదికలుగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది 'హమారీ అంగన్‌వాడీ, హమారీ జిమ్మేదారీ' (మన అంగన్‌వాడీ.. మన బాధ్యత) అనే ప్రధాన ఇతివృత్తంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆహార వైవిధ్యం, తగినంత ప్రోటీన్ తీసుకోవడం, అంగన్‌వాడీ కేంద్రాల్లో తాజా వేడిగా వండిన భోజనం అందించడం, సామాజిక యాజమాన్యం–జవాబుదారీతనం, బాల్య వికాసానికి పోషణ–ప్రారంభ ప్రేరణ, ప్రధానమంత్రి మాతృ వందన యోజన ద్వారా తల్లి ఆరోగ్యానికి అందించే నగదు బదిలీలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సమన్వయంతో పనిచేసి పోషకాహార లోపాన్ని తగ్గించేందుకు కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ, డి.ఆర్.ఓ ఎ.నిర్మల, ఆర్.డి.ఓ నవీన్, జెడ్.పి.సి.ఈ.ఓ డి. పి.ఓ వెంకటరెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి జరీనాబేగం, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి గంప శ్రీనివాస్, డి.పి.ఆర్.ఓ పి.శ్రీనివాస్, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.